# హిందీసాహిత్యంలో

# నీలమేఘశ్యాముడు

గ్రంథకర్త
**కోరుకొండభట్టర్ రామానుజభట్టర్**

**తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.**
**2023**

# HINDISAHITHYAMLO
# NILAMEGASYAMUDU

*By*
**Korukonda Bhattar Ramanuja Bhattar**

T.T.D. Religious Publications Series No. 1458
© All Rights Reserved

*First Edition : 2023*

*Copies :* 250

*Published by :*
**Sri A.V. Dharma Reddy,** I.D.E.S.,
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati.

***D.T.P:***
Publications Division,
T.T.D, Tirupati.

*Printed at :*
Tirumala Tirupati Devasthanams Press,
Tirupati.

## ముందుమాట

మత్స్యకూర్మవరాహాది దశావతారాలలో "శ్రీరామ, శ్రీకృష్ణ" అవతారాలకు ఒక ప్రత్యేకమైన స్థానమున్నది. విశేషించి ఉత్తర భారతీయ భక్తిసాహిత్యంలో శ్రీరామ, శ్రీకృష్ణ అవతార లీలా విశేషాలకు అగ్రపీఠం వేశారు. ఉత్తర భారతదేశంలో ప్రధానమైనది హిందీభాషే అయినా, సాహిత్యం మాత్రం హిందీతోపాటు దాని అనుబంధ భాషలైన "అవధి", "వ్రజ్" భాషలలోకూడా సమానంగా వ్యాప్తిలోకి వచ్చింది.

"అవధి" భాషలో 'సంత్ తులసీదాస్' వ్రాసిన "రామచరితమానస్" గ్రంథం సంస్కృత వాల్మీకి రామాయణం తరువాత అంతటి స్థానాన్ని సంపాదించింది. అలాగే "వ్రజ్" భాషలో 'సూర్‌దాస్' రచించిన "సూర్ సాగర్" వ్యాస భగవానుని భాగవతం తరువాత అంతటి పేరు ప్రఖ్యాతులను పొందింది. రామచరిత మానస్ శ్రీమద్రామాయణాన్ని ఆలంబనంగాచేసుకొని వచ్చినది కాగా, సూర్ సాగర్ శ్రీకృష్ణ పరమాత్మ లీలావిశేషాలను తెలియజేసే భాగవత కథాంశంతో కూడుకున్నది.

తులసీదాస్ భగవద్రామానుజ మతానుయాయి అయిన రామానందుల సంప్రదాయంలో వచ్చినవారు కాగా, సూర్‌దాస్ వల్లభాచార్యుల సంప్రదాయంలో వచ్చినవారు. ఉత్తర భారతంలో వీరిరువురు విశేష ప్రజాదరణ పొందిన భక్త శిఖామణులు.

"హిందీ సాహిత్యంలో నీలమేఘశ్యాముడు" అనే ఈ ప్రస్తుత గ్రంథంలో డా॥ కోరుకొండభట్టర్ రామానుజభట్టర్ తులసీదాస్

రచించిన 'రామచరితమానస్', సూర్ దాస్ రచించిన 'సూర్‌సాగర్' లలోని విశేషాలను తులనాత్మకంగా అధ్యయనం చేసి ఆ రెంటిలో నీలమేఘశ్యాముని ఎలా వర్ణించారో చాలా చక్కగా వివరించారు.

"హిందీ సాహిత్యంలో నీలమేఘశ్యాముడు" అనే ఈ గ్రంథాన్ని తిరుమల తిరుపతి దేవస్థానములు స్వీయముద్రణగా భక్త లోకానికి అందిస్తున్నది. ఈ గ్రంథాన్ని పాఠకలోకం ఆదరిస్తుందని భావిస్తూ, రచయిత శ్రీ రామానుజభట్టర్ గారికి శ్రీనివాస కృపాకటాక్షాలు కలగాలని కోరుకుంటున్నాను.

*సదా శ్రీవారి సేవలో....*

**కార్యనిర్వహణాధికారి**
తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి.

# పీఠిక

శ్రీవైష్ణవ సంప్రదాయం ఉత్తర భారతదేశంలో కూడ చాల ప్రచారంలో ఉన్నది. అనేకమంది మహానుభావులు తమ తమ దృక్పథాన్ని అనుసరించి ఈ సంప్రదాయాన్ని అనుసరించారు.

ఉత్తరభారతదేశంలోని ప్రముఖ భాష హిందీ. హిందీ సాహిత్యంలో ఉన్న విభిన్న రూపాలు. వాటిలో ప్రముఖ సాహిత్యం పల్లవితమై, కుసుమితమైన భాషలు **"అవధీ"** మరియు **"వ్రజ"** భాషలు. ఈ భాషలను మాధ్యమాలుగా తీసికొని చాలామంది కవులు తమ తమ భక్తిభావాలను వ్యక్తంచేశారు. వారిలో "తులసీదాసు" మరియు "సూరదాసు" అనువారు ప్రముఖులు.

తులసీదాసు **"రామానంద"** సంప్రదాయాన్ని అనుసరించినవాడు. ఈ రామానందుడు అను మహానుభావుడు విక్రమశకం 16లో ఉన్నవాడు. ఈయన భగవద్రామానుజుల శ్రీవైష్ణవ సిద్ధాంతాన్ని అనుసరించినవాడు.

అయితే శ్రీమద్రామానుజులు శ్రీవైష్ణవ సిద్ధాంతం ప్రకారం నిత్యవిభూతిలోని పరమపదనాథుడైన శ్రీమన్నారాయణుని ప్రధాన ఉపాస్యదైవంగా స్వీకరించారు. వ్యూహ, విభవ, అంతర్యామి, అర్చావతార ఉపాసనలు ఆ పరమపదనాథుని ప్రతిరూపాల ఉపాసననే అని స్వీకరించారు. కాని, రామానందుడు ఆ పరమపదనాథుని విభవావతారమైన శ్రీరామచంద్రుని లీలావిభూతినే ప్రముఖంగా గ్రహించి, విశిష్టాద్వైత సిద్ధాంతాన్ని అనుసరించారు.

రామానంద సంప్రదాయంలోని "నరహరిదాసు" అనే ఆచార్యునివలన దీక్షను స్వీకరించి, తులసీదాసు రామానందుని "విశిష్టాద్వైత" సిద్ధాంతాన్ని అనుసరించి తన రచనలను పరిఢవిల్లచేసినాడు.

తులసీదాసు రచనలు 12 ఉన్నాయి. వాటిలో ప్రధానమైనది "రామచరితమానస్" అనే మహాకావ్యం. ఇది "అవధీ" భాషలో ఉన్నది.

తులసీదాసు, "అవధీ" మరియు "వ్రజ" భాషల్లో నిష్ణాతుడు. అందుచేత ఈయన "అవధీ" భాషలో కొన్ని గ్రంథాలు, "వ్రజ" భాషలో కొన్ని గ్రంథాలు రచించి, రెండు భాషల్లోనూ ప్రకాండ పండితుడుగా ప్రసిద్ధి చెందాడు. తులసీదాసు సంస్కృతభాషలో కూడ ఉద్దండ పండితుడే. అందువలన ఈయన రచనలలో సంస్కృతపదాలు బహుళంగా ఉన్నాయి. కొన్ని తద్భవంగానూ కొన్ని తత్సమాలుగానూ ఉన్నాయి.

* * *

హిందీసాహిత్యంలో శ్రీకృష్ణావతారాన్ని ఆలంబనంగా గ్రహించి మనను రసడోలికల్లో ఓలలాడించిన మహానుభావులు కూడ చాలమంది ఉన్నారు. వారిలో "సూరదాసు" ఒకడు. ప్రముఖుడుకూడ.

భారతీయసాహిత్యంలోని సంస్కృత భాషలో "శ్రీమద్భాగవత" పురాణంగా శ్రీకృష్ణభగవానుని పావనచరిత్రను, ఆయన లీలలను శరణాగతరక్షకత్వాన్ని, పరమార్థతత్త్వాన్ని మనకు కృపచేసిన మహానుభావులు వేదవ్యాసులవారు. ఈ భాగవతాన్ని ఆధారంగా తీసికొని తమదైన రీతుల్లో వ్యక్తీకరించినవారు హిందీసాహిత్యంలో కూడ ఉన్నారు. వీరిలో "సూరదాసు" ప్రముఖుడు.

సూరదాసు "వల్లభాచార్యులు" అనే ఆచార్యుని సంప్రదాయాన్ని అనుసరించినవాడు.

వల్లభాచార్యులు శ్రీకృష్ణుని విభవావతారాన్ని తన ఉపాస్యదైవంగా స్వీకరించినవాడు. "పరమపదనాథుడు శ్రీకృష్ణభగవానుడే. ఈయనయే నిత్య విభూతిలో తనను ఆశ్రయించి ఉన్న నిత్యసూరులకు భగవద్గుణానుభవాన్ని కలిగిసన్తా ఉన్నాడు. ఈ శ్రీకృష్ణభగవానుడే విభవావతారంగా లీలావిభూతిలోనికి వచ్చి తన లీలలను మనకు అందించినాడు, దర్శింపచేసినాడు. ఈయన అనుగ్రహమే మనకు కావాలి"– అనేది వల్లభ సంప్రదాయం. దీనినే "పుష్టిమార్గం" అని వల్లభాచార్యులు నిర్వచించాడు. "పుష్టి" అంటే భగవానుని "అనుగ్రహం". భగవానుని అనుగ్రహం వల్లనే జీవుడు పరమాత్మతో సాయుజ్యాన్ని పొందుతాడు. ఇది వల్లభాచార్యుల సంప్రదాయం. దీనినే సూరదాసు అనుసరించినాడు.



సూరదాసు తన రచనలకు "వ్రజ" భాషను గ్రహించాడు. ఈయన ప్రామాణిక రచనల్లో "సూరసాగర్" అనే గ్రంథం ప్రముఖమైనదిగా పరిగణిస్తారు. ఈ "సూరసాగర్" శ్రీమద్భాగవతం వలెనే "ద్వాదశ స్కంధాత్మకం" అనే విమర్శకులు నిర్ణయించారు. కాని, దశమస్కంధంలోని శ్రీకృష్ణుని బాల్యలీలలనే ప్రధానంగా తీసికొని వాత్సల్యభరితరీతిలో సూరదాసు వర్ణించాడు. "సూరసాగర్" ఒక ఉద్గ్రంథం – ముక్తకగ్రంథం. సూరసాగర్‌లో సూరదాసు వాత్సల్యానికి రసాత్మకతను కల్పించి **"వాత్సల్య రససమ్రాట్"** అని బిరుదు పొందాడు.

హిందీ సాహిత్యంలో కొందరు 'సూరదాసు'ను "సూర్యుని"గాను, "తులసీదాసు"ను "చంద్రుని"గాను వర్ణిస్తారు. కాని మరికొందరు తులసీదాసునే సూర్యునిగా, సూరదాసును చంద్రునిగా భావిస్తారు. ఇద్దరూ ఆ "నీలమేఘశ్యాము"లను వర్ణించినవారే.

తన పాండిత్య పటిమతో రచనలు కొనసాగించిన తులసీదాసు ప్రచండకిరణ ప్రసారంచేసే "సూర్యుడే" అని, తన కోమలకాంత పదాలతో

రచనలు చేసిన సూరదాసు స్నిగ్ధ చంద్రికను ప్రసరింపచేసే "చంద్రుడు" అని మరికొందరు భావిస్తారు. ఇద్దరు ఆ నీలమేఘశ్యాముని వర్ణించినవారే.

ప్రస్తుతం నేను తమ ఎదుట ఉంచే ఈ చిన్న ప్రయత్నంలో తులసీదాసు యొక్క మరియు సూరదాసుయొక్క భక్తిభావాలను, ఆధ్యాత్మికతను నాకు తెలిసినంతరీతిలో చేతనయినంత తీరులో విన్నవించటానికి ప్రయత్నించాను. విజ్ఞులు నీరక్షీరన్యాయంగా నా ఈ భావాలను స్వీకరించి నన్ను ఆశీర్వదిస్తారని మనవి చేస్తున్నాను.

హనుమకొండ

ఇట్లు
బుధజన విధేయుడు
**కోరుకొండభట్టర్ రామానుజభట్టర్**

# విషయసూచిక


1. గోస్వామి తులసీదాసు పరిచయం 1
2. తులసీదాసు "రామచరితమానస్" 6
3. "రామచరితమానస్"లోని సిద్ధాంతము 16
4. తులసీదాసు – భక్తిమార్గము 23
5. 'రామచరితమానస్'లో ప్రబంధసౌష్ఠవం 29

**మహాకవి "సూరదాసు"**

1. "సూరదాసు" పరిచయం 46
2. "సూరదాసు" దార్శనిక సిద్ధాంతం 49
3. "సూరదాసు" భక్తి పద్ధతి 58
4. "సూరసాగర్"లో ప్రతిపాద్య వస్తువు 63
5. "సూరసాగర్"లో వాత్సల్య శృంగారాలు 67
   - ఎ. వాత్సల్యం 67
   - బి. శృంగారం 71
     - బి1. సంయోగ శృంగారం 71
     - బి2. వియోగ శృంగారం 76
6. "సూరసాగర్"లో కావ్యకళ 84



# 1. గోస్వామి తులసీదాసు పరిచయం

## 1. తులసీదాసు ఆవిర్భావ కాల పరిస్థితులు

మన భారతదేశంలో మహమ్మదీయుల ప్రభుత్వం స్థిరపడి ఉన్న రోజులు. కాని సమాజం అల్లకల్లోలంగా ఉన్న రోజులు. మహమ్మదీయుల సార్వభౌమత్వం, బలవంతంగా చేసే మత మార్పిడులు, విగ్రహారాధన వ్యతిరేకత, దేవాలయ విధ్వంసనం, కొందరు "సూఫీ" యోగులు సనాతన హిందూధర్మంపట్ల అపనమ్మకాన్ని కలిగించటం మొదలైన వాటివల్ల సమాజం అతలాకుతలం అవుతున్న రోజులు.

ఇలాంటి పరిస్థితుల్లో హిందూధర్మాన్ని పరిరక్షించాలని ధర్మాచార్యులు ఆలోచించారు. పరమతప్రాబల్యానికి కారణం హిందూమతంలోని నిమ్నజాతులపట్ల ఉండే వివక్షతే అని గుర్తించారు. నిమ్నజాతుల వారిని సాదరంగా ఆహ్వానించారు. బలవంతంగా ఇతరమతాన్ని అవలంబింప చేసినవారిని హిందూమతంలోకి తిరిగి ఆహ్వానించి దీక్షితులను చేయటం ప్రారంభించారు.

ఈ విషయాన్ని 11వ శతాబ్దంలో దక్షిణభారతదేశంలోని "శ్రీమద్రామానుజులు" అప్పుడే గుర్తించారని మనకు తెలుసు. శరణాగత పరిరక్షకుడైన పరమాత్మ దృష్టిలో అందరూ సమానులే అని తలచినవాడు. ఆచార్యుల ఆజ్ఞను కూడ వ్యతిరేకించి నిమ్నజాతులవారికి కూడ తిరుమంత్రోపదేశం చేసి స్వీకరించిన మహానుభావులు. 15, 16 శతాబ్దాలలోని ధర్మాచార్యులపై వీరి ప్రభావం తప్పక ఉన్నదనే తలవవచ్చు.

"చైతన్య మహాప్రభు", "వల్లభాచార్యులు", "రామానందుడు" మొదలైన చాలమంది ఆచార్యులు ఈ మార్గాన్ని అనుసరించి అనేకులను ఆహ్వానించి "శ్రీరామతారకాన్ని" ఉపదేశించి, శ్రీకృష్ణభగవానుని లీలలను ఆధ్యాత్మికంగా విశదీకరించి శ్రీవైష్ణవ సంప్రదాయంలో దీక్షితులను చేశారు.

ఇలాంటి పరిస్థితులలోనే శ్రీ "గోస్వామి తులసీదాసు" జన్మించాడు.

## 2. తులసీదాసు జననం

తులసీదాసును "గోస్వామి తులసీదాసు" అంటారు. అంతఃసాక్ష్యాల ఆధారంగా ప్రసిద్ధ చారిత్రకుల కథనాల ఆధారంగా తులసీదాసు జననం విక్రమశకం 1554 (క్రీ.శ1502)లో శ్రావణశుద్ధ చతుర్దశినాడు జరిగింది. ఈ విషయంలో ఎన్నోవాద ప్రతివాదాలు ఉన్నా – అంటే జనన తిథి విషయంలో ఎన్నోవాద ప్రతివాదాలు ఉన్నా – ప్రస్తుతం వరకు ఈ తిథినే ప్రామాణికంగా తీసికోవటం జరుగుతున్నది.

తులసీదాసు తల్లిపేరు "హులసీ". తండ్రిపేరు విషయంలో అనేక వాదాలు ఉన్నా "ఆత్మారాం దుబే" అని ఎక్కువ మంది అంగీకరించారు. భార్యపేరు "రత్నావళి". ఆచార్యుడు "నరహరిదాస్" అని ప్రమాణం. ఈయనది బ్రాహ్మణవర్ణమే అనటంలో ఏమీ సందేహంలేదు. వాదప్రతివాదాలు లేవు. "పరాశర" గోత్రం. జన్మస్థలం "ఉత్తరప్రదేశ్" రాష్ట్రంలోని "బాందా" ప్రాంతంలో ఉండే "రాజాపూర్". ఈయన జన్మించగానే ఏడవలేదట. "రామ్" అనే అన్నాడట అందుకే ఈయనను **"రామ్‌బోలా"** అని పిలిచేవారు.

## 3. బాల్యం – విద్యాభ్యాసం

తులసీదాసు జన్మనక్షత్రం "మూలా" నక్షత్రం. ఇది తల్లిదండ్రులకు (పాదాన్ని బట్టి) గండం ఉన్న నక్షత్రం. అందుచేత ఆయనను తల్లిదండ్రులు విడచిపెట్టారు. అప్పటినుంచి ఆయనకు రామనామమే శరణ్యం అయింది. ఆయనకు ఎవరూ ఆశ్రయం కూడ ఇవ్వలేదు. భిక్షాటన చేస్తూ జీవించేవాడు.

తులసీదాసు బాల్యంలోనే ఇంట్లోనుంచి బయటకు వచ్చాడు కదా! భిక్షాటన చేసుకుంటూ సాధువుల వెంట తిరుగుతూ ఉండేవాడు. వారు చెప్పే రామకథను వింటూ ఉండేవాడు. బాల్యంలో రామకథాబీజం తులసీదాసు మనస్సులోపడింది. నిరంతరం రామస్మరణలోనే ఉండటంవల్ల



ఈ సర్వజగత్తూ రామమయమే అని గుర్తించగలిగాడు. "నరహరిదాస్"ను ఆచార్యునిగా స్వీకరించిన తరువాత ఆయన ద్వారా కూడ రామకథాసారాన్ని, మర్మాన్ని తెలుసుకొనగలిగాడు. గురువు ద్వారానే శాస్త్రాలు, కావ్యనాటకాలు అధ్యయనం చేశాడు. ఇతిహాసాలను, పురాణాలను చదివేవాడు. వాటిద్వారా రామతత్త్వాన్ని తెలుసుకున్నాడు. కాశీలోని "పంచగంగా ఘాట్"లో తన గురువు అయిన నరహరిదాస్‌తో కలిసి ఆయన దగ్గరే ఉంటూ ఉండేవాడు. ఈ నరహరిదాసు "రామానంద" అనే మహానుభావుని శిష్యుడు. ఆయనతో కలసి "రామానందుని" దగ్గర తులసీదాసు ఉంటూ ఉండేవాడు.

ఆయనవద్ద "శేషసనాతన్" అనే విద్వాంసుడు ఉండేవాడు. ఈ పండితునివద్దనే తులసీదాసు వేదవేదాంగాలను అధ్యయనం చేశాడు. శాస్త్రాలు, పురాణాలు, ఇతిహాసాలలోని మర్మాన్ని తెలుసుకొన్నాడు. తులసీదాసు ఇలా 15 సంవత్సరాలవయస్సు వచ్చేవరకు అధ్యయనం చేసి పండితుడు అయ్యాడు, రామభక్తుడు అయ్యాడు.

## 4. జీవితపుమలుపు

రామానందుడు విరాగి. ఆయన సాన్నిధ్యంలో ఉంటూ ఆయన సంప్రదాయాన్నే అవలంభించినా ఆయనవలె తులసీదాసు విరాగికాలేదు. గృహస్థజీవితాన్ని కూడ కొన్నాళ్లు గడిపినాడు. ఆ సాంసారిక జీవితంలో పడి తన జీవితధ్యేయమైన రామస్మరణకు దూరమయ్యాడు. భార్యాసక్తుడైనాడు. అయితే ఎక్కువ రోజులు ఇలా ఉండలేదు.

ఆ రోజుల్లో ఒక సంఘటన జరిగింది. తులసీదాసు భార్య 'రత్నావళి' తన పుట్టింటికి వెళ్లింది. ఆమెను విడిచి ఉండలేక తులసీదాసు ఒకటి రెండు రోజుల్లోనే అత్తవారింటికి వెళ్లాడు. రత్నావళి ఎంతో సిగ్గుపడింది. "నా వెంటపడి ఇలా రావటం మీకు సిగ్గుగాలేదా? అస్థి, చర్మమయమైన నా ఈ శరీరంపైన ఉన్న ప్రేమ శ్రీరామచంద్రునిపై ఉంటే మంచిది" అని మందలించింది.

భార్య మాట్లాడిన ఈ పరుషవాక్యాలు తులసీదాసును ఎంతో బాధించాయి. "నిజమే" అనుకున్నాడు. బాల్యంలోనే రామభక్తి బీజాలు తులసీదాసు మనస్సులో నాటుకొని ఉన్నాయి కదా! భార్య యొక్క పరుషవాక్యాలు ఈ బీజాలు మొలకెత్తేవిధంగా చేశాయి. అప్పటినుంచి ఆయన జీవితమే మారిపోయింది. వెంటనే తన ఇంటికి వచ్చేశాడు.

తన ఇష్టదైవమైన శ్రీరామచంద్రుణ్ణి వెతకటానికి బయలుదేరాడు. జగన్నాథపురి, రామేశ్వరం, ద్వారకానగరం, అయోధ్య మొదలైనవన్నీ తిరుగుతూ బదరికాశ్రమం చేరాడు. అక్కడ ఉన్న "మానస సరోవరాన్ని" దర్శించుకున్నాడు. ఇలా ఆయన "స్వామీజీ" అయి దేశం నలుమూలలూ తిరిగాడు. తిరిగి తిరిగి చివరకు "చిత్రకూటం" చేరి తన సాధన ప్రారంభించాడు. యోగసాధన చేస్తూనే అక్కడ ఉన్న సాధువులకు రామకథను వినిపించసాగాడు. ప్రతిరోజూ హనుమంతుడు కూడ ఒక కుష్ఠువ్యాధి సోకిన సాధువువలె వచ్చి తులసీదాసు ప్రవచనాలను వింటూ ఉండేవాడట. రఘునాథ కీర్తన జరుగుచున్నచోటుకు హనుమ ప్రత్యక్షం అవుతూనే ఉంటాడు? అంటారు కదా. హనుమంతుని కృపాకటాక్షంవల్ల తులసీదాసుకు శ్రీరామసాక్షాత్కారం కూడ అయింది. ఆయన స్వయంగానే ఇలా రాశాడు.

**చిత్రకూట్ కే ఘాట్‌పర్, భయి సన్తన్ కీ భీర్ ।**
**తులసీదాస్ చందన్ ఘిసే, తిలక్ దేత్ రఘుబీర్ ॥**

అంటే "చిత్రకూటంలో తాను గంధం తీసి రఘువీరుడైన శ్రీరామచంద్రునికి బొట్టు పెట్టినాను" అని అర్థం.

ఇలా శ్రీరామచంద్రుని దర్శనం అయిన తరువాత మళ్లీదేశాటనకు బయలుదేరాడు. కాశి, జనకపురి (మిథిలానగరం), నైమిశారణ్యం, బృందావనం మొదలైన క్షేత్రాలను దర్శించాడు. అయితే తులసీదాసుకు



చిత్రకూటం అన్నా, అయోధ్య అన్నా అంతులేని ప్రేమ. అందుకే ఆయన ఆ స్థలాల్లోనే ఎక్కువ రోజులు గడిపాడు. చివరి రోజుల్లో మాత్రం "కాశీ"లో ఉన్నాడు.

## 5. అంతిమ ఘడియలు

తులసీదాసు గొప్ప ప్రతిభాశాలి అయ్యాడు. విద్వాంసులు, రామాయణ ప్రవక్తలు అయిన మహామహులు ఆయనను గౌరవిస్తూ ఉండేవారు. "టోడర్" (Todder) అనే మహానుభావుడు తులసీదాసు రామభక్తియొక్క ప్రచారంలో ఆయనకు ఎంతో సహాయపడినాడు. వారి వంశస్థులు ఇప్పటికీ తులసీదాసు నిర్యాణతిథిని జరుపుకుంటూ ఉంటారు. శ్రావణశుద్ధ తదియనాడు ఒక బ్రాహ్మణుని సత్కరిస్తూ ఉంటారు. కాబట్టి, ఆ తిథినే తులసీదాసుయొక్క నిర్యాణ తిథి అనుకోవాలి. అంతకన్నా ఆధారాలు మనకు లభ్యంకాలేదు.

అక్బరుచక్రవర్తి యొక్క సేనాధ్యక్షుడైన "రహీమ్", ఈయనను ఎంతో గౌరవించేవాడు. "అజమేర్ చక్రవర్తి అయిన "మాన్‌సింగ్", స్వయంగా తులసీదాసును కలిసి ఆయనపట్ల తన గౌరవాన్ని తెలుపుతూ ఉండేవాడు. "అక్బరు"చక్రవర్తి కూడ "రాజాపూర్" గ్రామాన్ని దర్శించాడట. ఆ గ్రామం తులసీదాసు జన్మస్థలం కదా, తులసీదాసును కలుసుకొని తన ప్రణామాలు అర్పించేవాడట.

అయితే ఇలా ప్రసిద్ధ వ్యక్తులు తనను కలుస్తూ ఉండటం తులసీదాసుకు ఏమీ ఇష్టంలేదు. తన సాధనలో అంతరాయం కలుగుతుందని ఆయన భావన.

వల్లభాచార్య సంప్రదాయంవారు, రామానంద సంప్రదాయంవారు తమ పేరుకు ముందు "గోస్వామి" అని చేర్చి చెప్పుకునేవారట. అందుకే తులసీదాసు పేరు కూడ "గోస్వామి తులసీదాసు" అని ప్రఖ్యాతినొందింది.

తులసీదాసు యొక్క అంతిమ ఘడియలు అనగా నిర్యాణం గురించి అంతఃసాక్ష్యాధారం ఇలా ఉంది....

**సంవత్ సోరహ్‌సౌ అసీ, అసీ గంగా కే తీర్ ।**
**సావన్ శ్యామా తీజ్ శని, తులసీ తజే శరీర్ ॥**

అనగా "1680 విక్రమశకంలో (క్రీ.శ.1628), "అసీఘాట్" అనే స్థలంలో వరణా+అసి= వారణాసి రెండు నదుల సమాహారం వారణాసి. వీటిలో 'అసీ'నదీతీరంలో శ్రావణబహుళ తదియ శనివారంనాడు తులసీదాసు తన శరీరాన్ని వదలినాడు"- అని అర్థం.

జననం 1554వ శకం, నిర్యాణం 1680 (క్రీశ.జననం 1502, నిర్యాణం 1628) జరిగింది. ఆయన 126 సంవత్సరాలు జీవించాడు. పండితులు ఈ తేదీనే ప్రామాణికంగా తీసికొన్నారు.

ఇకముందు వచ్చే అధ్యాయాలతో తులసీదాసు రచనలు, ముఖ్యరచన, భక్తిపద్ధతి మొదలైన వాటిని గురించి తెలుసుకుందాము.

## ౨. తులసీదాసు - "రామచరితమానస్"

క్రిందటి అధ్యాయంలో గోస్వామి తులసీదాసు ఆవిర్భావ కాలపరిస్థితులు, ఆవిర్భావం, బాల్యం, విద్యాభ్యాసం, రామభక్తి, దీక్షాశ్రవణం, దేశాటనం, పాండిత్యం మొదలైన విషయాలను గురించి తెలుసుకున్నాం. ఈ అధ్యాయంలో తులసీదాసు రచనలు వాటిలో ప్రముఖమైన **"శ్రీరామచరితమానస్"** అనే ప్రబంధాన్ని గురించి తెలుసుకుందాం.

తులసీదాసు వ్రాసిన గ్రంథాలు 12 అని ప్రమాణీకరించారు. వీటిలో కొన్ని ప్రబంధాలు, కొన్ని ముక్తక రచనలు. శ్రీరామచరితమానస్, గీతావళి, వినయపత్రిక, జానకీమంగళ్, పార్వతీమంగళ్, దోహావళి, రామ్‌లీలాసహఛూ, కవితావళి, రామాజ్ఞ, వైరాగ్యసందీపని, కృష్ణగీతావళి, బరవైరామాయణ్ –



అనేవి ప్రసిద్ధి చెందిన గ్రంథాలు. ఇవేకాక ఇంకా చాలా తులసీదాసు రచనలుగా తలచబడుచున్నాయి. కాని వాటిశైలి, భాష మొదలైన వాటిని బట్టి, అవి పూర్తిగా తులసీదాసు రచనలు కావని పండితుల అభిప్రాయం. ఈ 12 గ్రంథాలతో కొన్ని "అవధీ" అనే హిందీభాషలో, మరికొన్ని "వ్రజ" అనే హిందీభాషలో రచించబడినాయి. తులసీదాసు సంస్కృతంలోనే కాక, అవధీ, వ్రజ భాషలలో కూడ పండితుడే.

ఈ 12 గ్రంథాలలోని "శ్రీరామచరితమానస్" అనే ప్రబంధాన్ని గురించి తెలుసుకుందాం.

ప్రబంధసౌష్టవం, కవిత్వం, ప్రభావం మొదలైన అనేక అంశాలలో పండితులందరి నిర్ణయం ప్రకారం "శ్రీరామచరితమానస్" సర్వశ్రేష్ఠమైనదని భావించబడుచున్నది. ఇందులో 7 సోపానాలు ఉన్నాయి. ఈ సోపానాలు అనే పేరు పెట్టింది తులసీదాసే. కొంతమంది ఈ సోపానాలను "కాండలు" అని కూడ అంటున్నారు. బహుశా "వాల్మీకి రామాయణం"లోని కాండల ప్రభావంవల్ల "మానస్"లోని సోపానాలను కూడ "కాండలు" అంటే బాగుంటుందని వారు తలచి ఉండవచ్చు. సంస్కృతభాషలో "వాల్మీకి రామాయణం" ఎంత ప్రామాణికమో హిందీలో "రామచరితమానస్" అంత ప్రామాణికము అని వారి ఉద్దేశ్యంకావచ్చు. ఈ "రామచరితమానస్" "అవధీ" అనే హిందీలో వ్రాయబడింది. ఈ ప్రబంధాన్ని తులసీదాసు "అయోధ్య"లో వ్రాశాడు. 2 సంవత్సరముల 7 నెలల్లో పూర్తిచేశాడు.

ప్రథమ సోపానంలో, వాణీవినాయకులవందనము, భవానీశంకరుల వందనము, గురుస్తుతి, కవీశ్వరస్తుతి, కపీశ్వరస్తుతి, సీతారాములవందనము అనేవాటిని సంస్కృతంలో తులసీదాసు రచించాడు. గణేశుని ప్రార్థన శ్రీమహావిష్ణుప్రార్థన, శివ ప్రార్థన, గురు ప్రార్థన అనేవాటిని అవధీభాషలో రచించాడు కూడ. తరువాత రామచరిత్రను వ్రాసిన మహామహులను స్తుతించి తన "మానస" రచన అవధీ భాషలో సాగించాడు.

## 2. "రామచరితమానస్" ఆధారం

ప్రబంధకావ్యాలు 2 రకాలుగా ఉంటాయి. ఇతిహాసికాలు అని, పౌరాణికాలు అని. వీటిలో కథాంశము ప్రసిద్ధిచెంది ప్రాచీనతను కలిగి ఉంటుంది. శ్రీమద్రామాయణం "ఇతిహాసం". కనుక "రామచరితమానస్"ను ఇతిహాసిక మహాకావ్యం అంటారు. రామచరిత్ర ఏ భాషలోఉన్నా రచయిత ఎవరైనా దాని కీర్తి ప్రతిష్ఠలు మాత్రం విశ్వవ్యాప్తం అని మనకు తెలుసు. మంగళాచరణంలోనే తులసీదాసు ఇలా వ్రాశాడు.

**నానాపురాణ నిగమాగమ సమ్మతం యద్రామాయణే నిగదితం**
**క్వచిదన్యతోఽపి,**
**స్వాన్త స్సుఖాయ తులసీ రఘునాథ గాథా, భాషా నిబంధ**
**మతిమంజులమాతనోతి"**

అని తన అంతఃకరణ సుఖం కోసమే తాను రామాయణ రచన చేస్తున్నట్లు చెప్పాడు–

అనేక పురాణాలను, వేదాలను, ఇతిహాసాలను, కావ్యాలను, చంపూ నాటకాదులను పరిశీలించి వాటి ఆధారంగానే తాను రచన కొనసాగించినట్లు తులసీదాసు స్వయంగానే వ్రాశాడు. కాబట్టి ఇవన్నీ "రామచరితమానస్"కు ఆధారాలే. "రామచరితమానస్"లోని ప్రధాన కథాంశం శ్రీరామచంద్రుని కథానికయే అయినా, ఆనుషంగికంగా అనేక కథలు కూడ వస్తూ ఉంటాయి. ఇవి కూడ ప్రామాణికాలైన గ్రంథాలనుంచి గ్రహించినవే.

## 3. వాల్మీకి రామాయణంలోని శ్రీరామచంద్రుడు

''రామచరితమానస్''లో ప్రముఖంగా సంస్కృతంలోని వాల్మీకి రామాయణంలోని శ్రీరామచరిత్రే కనిపిస్తుంది. అయితే ప్రతిపాద్యవస్తువు మాత్రం భిన్నంగా కనిపిస్తుంది. "రామచరితమానస్"లో శ్రీరామచంద్రుడు శ్రీమహావిష్ణువుయొక్క సంపూర్ణ అవతారమనే తులసీదాసు ప్రతిపాదించాడు.



వాల్మీకి రామాయణంలో కూడ చాలాచోట్ల శ్రీరామచంద్రుడు విష్ణువుయొక్క అవతారమనే వర్ణింపబడి ఉన్నది.

బాలకాండలో బ్రహ్మాదిదేవతలు విష్ణుభగవానుని అవతరించమని ప్రార్థించటం, దేవతలు

**''మానుషం రూపమాస్థాయ రావణం జహిసంయుగే''** అని ప్రార్థించటం;

**"ఇత్యేత ద్వచనం శ్రుత్వాసురాణాం విష్ణురాత్మవాన్**
**పితరం రోచయామాస తదా దశరథం నృపం –"** అని అవతరించారు.

**"పుత్రత్వం తు గతేవిష్ణౌ రాజ్ఞస్తస్యమహాత్మనః,**
**ఉవాచ దేవతాః సర్వాః స్వయం భూర్భగవా నిదం–"**

ఇదేవిధంగా యుద్ధకాండలో బ్రహ్మాదులు రామచంద్రుని దగ్గరకు వచ్చి– **"కర్తాసర్వస్యలోకస్య"** – అని సంబోధించి, ఆయనను ఇలా పరిచయం చేశారు.

**భగవాన్నారాయణోదేవః, శ్రీమాన్ చక్రాయుధో ప్రభుః ।**
**ఏకశృఙ్గో వరాహస్త్వం, భూతభావ్య సపత్నజిత్ ॥**
**అక్షరం బ్రహ్మ సత్యంచ, మధ్యే చాన్తేచ రాఘవ ।**
**లోకాణం త్వం పరోధర్మో, విష్వక్సేనశ్చతుర్భుజః ॥**
**శార్ఙ్గధన్వాహృషీకేశః, పురుషఃపురుషోత్తమః ।**
**అజితః ఖడ్గధృగ్విష్ణుః, కృష్ణశ్చైవ బృహద్బలః ॥**

యుద్ధకాండ చివరలోకూడ–

**ప్రీయతే సతతం రామః, సహి విష్ణుః సనాతనః**
**ఆదిదేవో మహాబాహుః, హరిర్నారాయణః ప్రభుః ॥**

అని వాల్మీకి మహర్షి వర్ణించాడు–

అలాగే అక్కడక్కడ శ్రీరామచంద్రుణ్ణి భగవత్ స్వరూపంగా సుమిత్ర, తార, మండోదరి, మారీచుడు, విభీషణుడు మొదలైన కొన్ని పాత్రల ద్వారా వాల్మీకి వర్ణించినా, ప్రముఖంగా మాత్రం శ్రీరామచంద్రుణ్ణి ఒక "మర్యాదాపురుషోత్తముడు"గాను, "సర్వశ్రేష్ఠధనుర్ధారి"గాను, ఆదర్శపుత్రుని గాను, ఆదర్శసోదరునిగాను, ఆదర్శపతిగానూ, ఆదర్శప్రభువుగాను, మూర్తీభవించిన ధర్మదేవతగాను (రామోవిగ్రహవాన్‌ధర్మః) చిత్రించటమే వాల్మీకి ధ్యేయం. శ్రీరామచంద్రుణ్ణి ఒక ఆదర్శమానవునిగా చిత్రించి ఆయనను ఆదర్శంగా తీసికొని సమాజం పురోగమించాలనే వాల్మీకిమహర్షి ఆశయం అని చాలామంది పండితుల అభిప్రాయం. అందుకే ఓం "ఆత్మానం మానుషం మన్యే" "నన్ను మానవునిగానే తలచుచున్నాను."

రావణాసురుడు నర, వానరులచే తనకు మరణము రాకుండునట్లు వరము కోరలేదు. అందుకే భగవానుడు మానవావతారంగా జన్మించి సంపూర్ణమానవునిగానే తలుస్తూ, వ్యవహరిస్తూ, దేవతాంశలతో సంభూతులైన వానరులను కలుపుకొని రావణుని సంహరించాడు.

## 3. తులసీదాసు "రామచరితమానస్"లోని రామచంద్రుడు

వాల్మీకిమహర్షి శ్రీరామచంద్రుని ఒక సంపూర్ణమానవునిగానే చిత్రించినాడు. ఆ మహర్షి ఎదుట శ్రీరామచంద్రుని ఒక భగవానుని అవతారంగా సమాజానికి పరిచయం చేయవలసిన అవసరంలేదు. ఎందుకంటే ఆ కాలంలో సమాజానికి భగవానుని ఎడల అమితమైన భక్తి ప్రపత్తులు ఉన్నాయి.

కాని, తులసీదాసు కాలం వచ్చేవరకు కాలపరిస్థితులు పూర్తిగా మారిపోయినాయి. ప్రజల్లో "శ్రీరామచంద్రుడు ఒక అవతారపురుషుడు" అనే భావం సన్నగిల్లిపోయి, క్రమంగా ఆ భావం కనుమరుగయ్యే సమయం వచ్చింది. సందేహాలు ఎక్కువ అయినాయి. దీనికి ప్రముఖ కారణం నిర్గుణవాదులు – వారు భగవానుని నిర్గుణుడని, ఆయనకు ఒక ఆకారం



ఏమిటి? అని, ఒక అవతారం ఏమిటి? అని వాదిస్తున్న స్థితి దాపురించింది. కొందరు ఆ భ్రమలో పడుతున్నారు కూడ "నిజమే శ్రీరాముడు దశరథుని పుత్రుడేకదా! ఆయన భగవానుడు ఎలా అవుతాడు?" అనే రకరకాల వాదాలు ప్రబలిపోయినాయి.

ఇలాంటి పరిస్థితులలో సమాజానికి వాస్తవికతను పరిచయం చేయవలసిన అవసరం వచ్చింది. శ్రీరామచంద్రుణ్ణి "సర్వేశ్వరుని" గానే నిర్ణయించి బోధించవలసి వచ్చింది. హైందవ ప్రాచీన సంప్రదాయము, విశ్వాసము అయిన సగుణ వాదాన్ని ప్రజలకు నచ్చచెప్పవలసి వచ్చింది. అందుకే తులసీదాసు శ్రీరామచంద్రుని మానవలీలలను వర్ణిస్తూనే ఆ లీలల్లోని అలౌకికత్వాన్ని చాటిచెప్పాడు.

ఇలాంటి ప్రేరణ తులసీదాసుకు "అధ్యాత్మరామాయణం" నుంచి లభించింది. దానిలో ప్రమాణీకరింపబడిన రామభక్తినే లోకంలో ప్రతిష్ఠించి శ్రీరామచంద్రుని, ఒక పరమాత్మగా నిరూపించటం అనేది తన "రామచరితమానస్" ప్రబంధలక్ష్యంగా తులసీదాసు పెట్టుకున్నాడు.

కాబట్టి, మానవశ్రేష్ఠుడైన శ్రీరామచంద్రుని చరిత్రను తెలపటం వాల్మీకిమహర్షి ఉద్దేశ్యం. అయితే, తులసీదాసు ఉద్దేశ్యం శ్రీరామచంద్రుని యొక్క ఈశ్వరత్వప్రతిపాదనమే అని మనకు తెలుస్తున్నది. ప్రథమ సోపానం (ప్రథమకాండ) నుంచి అంతిమ సోపానం వరకు తులసీదాసుయొక్క ఈ ఉద్దేశ్యమే మనకు కనిపిస్తుంది. లుప్తమవబోతున్న సనాతన సత్యాన్ని పునఃసముద్ధరించటమే మనకు కనిపిస్తుంది.

## 4. నామకరణము

రామకథను ఎవరు ఎప్పుడు ఎలా వ్రాసినా "రామాయణం" అనే నామకరణం చేస్తూ వచ్చారు. కాని, తులసీదాసు తన గ్రంథానికి నామకరణం "రామచరితమానస్" అని చేశాడు. ఇందుకు కారణం కూడ తులసీదాసు ఇలా చెప్పాడు.

**రామచరితమానస్ మునిభావన, బిరచెఉ సంభు సుహావన్‌పావన్**
**త్రివిధ దోష్ దుఖ్ దారిద్ దావన్, కలి కుచాలి కలికలుషనసావన్**
**రచిమహేస్ నిజ్ మానస్ రాఖా, పాఇ సుసమవుసినాసన్ భాఖా,**
**తాతే రామ్‌చరిత్ మానస్ బర్, ధరె ఉ నామ్ హి అహేరి హరిష్ హర్ ॥**

అంటే దీనితాత్పర్యం : "ముని మానసములకు ఎంతో ప్రియమైనట్టి, త్రివిధ దోషాలను (వాచిక, కాయిక, మానసిక) దుఃఖాలను, దారిద్ర్యాన్ని పోగొట్టేదీ, కలియుగంలోని దుష్ప్రవర్తనలను నశింపచేయునట్టి "రామచరిత్ర" అనే చరిత్రను శంకరుడు తన మనస్సులో రచించుకొని, ఆ పావనచరిత్రను తన మనస్సులో సురక్షితంగా ఉంచుకొనినాడు. మంచిసమయం కోసం వేచి ఉన్నాడు. ఆ సమయం రాగానే ఆ కథను పార్వతికి వినిపించినాడు. ఈ కథ తన మనస్సుకు సంబంధించినది. ఈ కారణంగా ఆ కథపేరు "రామచరితమానస్" అని మహాదేవుడు నామకరణం చేసి ఎంతో సంతసించినాడు.

ఈ విషయాన్ని గోస్వామి తులసీదాసు స్వయంగా తన ప్రబంధంలో వ్రాశాడు. కాబట్టి ఈ "రామచరితమానస్"ను మొట్టమొదట శివుడే తన మనస్సులో రచించినాడు. అందుచేత రామకథ పరంపరకే మూలపురుషుడు శంకరుడు ప్రథమ ఆచార్యుడు. ఆ శంకరుడే అనేకసార్లు ఎంతోమంది మహాపురుషులకు వినిపించాడు.

అయితే శంకరుడు కూడ ఈ రామకథను "అగస్త్యమహాముని" ద్వారా విని తన మనస్సులో నిక్షిప్తం చేసుకున్నాడని తులసీదాసే వ్రాశారు.

**ఏక్‌బార్ త్రేతాయుగ్‌మహీ, సంభుగయే కుంభజ రిషి మాహీ,**
**సంగ్ సతీ జగ్ జననీ భవానీ, పూజే రిషి అఖిలేశ్వర్ జానీ,**
**రామ్‌కథా ముని బర్ణ్ బఖానీ, సునీ మహేశ్ పరమ సుఖమానీ ॥**

అంటే ఒకసారి పార్వతీపరమేశ్వరులు అగస్త్యమహాముని వద్దకు వెళ్లారు. అగస్త్యమహాముని వారిని పూజించి, రామ కథను వినిపించాడు. మహేశుడు ఎంతో సంతోషించాడు అని తాత్పర్యం.



అగస్త్యమహాముని ద్వారానే సనకసనందనాదులు కూడ వినినారు. తరువాత శంకరుడు "లోమశ"మహర్షికి కూడ వినిపించాడు. లోమశ మహర్షి "కాకభుశుండి"కి వినిపించాడు. ఈ కాకభుశుండి "గరుడునికి" వినిపించాడు. ఒక ఋషి శాపంవల్ల తాను "కాకి"రూపంలోకి మారవలసి వచ్చిందని కూడ చెప్పినాడు. ఈ కాకభుశుండి నుండియే "యాజ్ఞవల్క్యుడు" వినినాడు. ఇలా రామచరిత్ర పరంపర కొనసాగిందని తులసీదాసు తన "రామచరితమానస్"లో సందర్భానుసారంగా పేర్కొన్నాడు.

దీనినిబట్టి నలుగురు ప్రసిద్ధి చెందిన శ్రోతలు - వీరిద్వారా రామచరిత్రము ప్రసిద్ధి చెందిందని మనం తెలుసుకోవచ్చు- 1. శివుడు - పార్వతి 2. కాకభుశుండి - గరుడుడున్నూ తరువాత 3. యాజ్ఞవల్క్యుడు - భరద్వాజుడు 4. రామానందుడు - తులసీదాసు. ఈ నలుగురు వక్తలు శ్రోతలు అని "మానస్"లోని అంతఃసాక్ష్యాలవల్ల తెలుస్తుంది.

### 4. ప్రతిపాద్యవిషయము

ఈ పై నలుగురిలో వక్తలు సంపూర్ణ జ్ఞానం ఉన్నవారు. వారికి భ్రమ అనేది లేదు. కాని, శ్రోతలకు మాత్రం భ్రమ ఉన్నది.

పార్వతీదేవికి శ్రీరాముని సర్వేశ్వరత్వంలో భ్రమ ఉన్నది. ఆమెకు తన పూర్వజన్మమైన "సతి" జన్మపైమోహం ఉండటమే కారణం. అందుకే భ్రమ కలిగింది. శ్రీరామచంద్రుడు సీతావియోగంతో చెట్లను, పుట్లను సీతజాడ తెలుపమని అడుగుతూ తిరిగే సందర్భాన్ని విని పార్వతికి శ్రీరామచంద్రుణ్ణి పరీక్షిద్దామనే కోరిక కలిగింది. శివుడు వారిస్తూనే ఉన్నాడు. అయినా ఆమె "సీత" రూపం ధరించి రాముని వద్దకు వెళ్లింది. శ్రీరామచంద్రుడు ఆమెను చూచి "అమ్మా! నీవు కూడ నన్ను పరీక్షిస్తున్నావా?" అని అడిగాడు. పార్వతి ఖిన్నురాలు అయింది. భ్రమ తొలగిపోయి శంకరుని సన్నిధికి వెళ్లి తనకు కలిగిన అనుభవాన్ని చెప్పింది.

రామాయణంలో ఇంద్రజిత్తుయొక్క నాగాస్త్రానికి లక్ష్మణుడు మూర్ఛనొందినాడు. శ్రీరాముడు మానవమాత్రుని వలె దుఃఖించినాడు. దీనిని చూచి లక్ష్మణుని నాగాస్త్రబంధంనుండి విముక్తుని చేయటానికి వచ్చిన గరుడుడు "ఈయన నా స్వామియేనా? అయితే ఇలా మాయామోహితుడు అవుతాడా?'' అని తలచాడు. దీనికి ''కాకభుశుండి" గరుడునితో ''మాయామోహితులు" ఈ ప్రకృతిలో ఎలా అవుతారో ప్రపంచానికి చెప్పటానికే స్వామి అలా చేశాడు. తాను సంపూర్ణ మానవునిగానే ఉండాలి కదా. ఆయన మాయామోహితుడు కాలేదు అని గరుడుని భ్రమను పోగొట్టినాడు.

ఇలాంటి భ్రమే భరద్వాజునకు కూడ కలిగి తనకు రామచరిత్రను ఉపదేశించిన యాజ్ఞవల్క్యుని ఇలా ప్రశ్నించాడు. "శ్రీరాముడు దశరథుని కుమారుడు. అతని చరిత్ర ప్రపంచంలో ప్రసిద్ధి చెందినది – కాని ఆ రాముడు సీతావిరహంలోపడి అమితంగా దుఃఖించాడు కదా! అపరిమితమైన ఆగ్రహం వచ్చి రావణాసురుని సంహరించాడు కదా! అలాటి శ్రీరామునే అంతకంటె పరమపురుషుడు లేడని త్రిపురారి అయిన శంకరుడు ఎల్లప్పుడూ భజిస్తూ ఉంటాడని చెప్పినారు కదా! ఇది సందర్భోచితంగా లేదు కదా! ఆచార్యా, మీరు సత్యవాక్పరిపాలకులు, అన్నీ తెలిసినవారు. కాబట్టి, బాగుగా ఆలోచించి ఇందులోని మర్మాన్ని తెలియచేయండి–" అని తన సందేహాన్ని వెలిబుచ్చాడు.

– "త్రిపురారి అంతటివాడే సదా ఆ పరంధాముని శ్రీరాముని కీర్తిస్తూ ఆయన నామాన్ని జపిస్తూ ఉంటే శ్రీరామచంద్రుని సర్వజ్ఞత్వాన్ని, పరాత్పరత్వాన్ని శంకించటమా? ఆ మహానుభావుడు మానుషరూపం ధరించిన పరమాత్మే"– అని భరద్వాజుని సందేహాన్ని యాజ్ఞవల్క్యుడు తొలగించాడు.



తులసీదాసు కూడ రామానందుని బోధనలను వినియే, ఆయన సంప్రదాయంలో దీక్షితుడు అయిన తరువాతనే శ్రీరామచంద్రుని పరమాత్మగానే గుర్తించి, ఆయన పరాత్పరత్వాన్ని లోకంలో చాటడానికి తన ''రామచరితమానస్" గ్రంథం ప్రారంభించి తన వాంఛితాన్ని నెరవేర్చుకున్నాడు.

ఇలా మహామహుల మనస్సులలో వ్యాపించి ఉన్న సందేహామే ఆ రోజుల్లో శ్రీరామచంద్రుని గురించి సామాన్య ప్రజానీకంలో కూడ వ్యాపించి ఉన్నాయి. ఆ సందేహాలను తొలగించటానికే ''తులసీదాసు'' "రామచరితమానస్" గ్రంథరచన చేశాడు.

ఇక్కడ ఒక విశేషాన్ని మనం గమనించాలి. జగన్మాత అయిన పార్వతీదేవి మనస్సులో కూడ భ్రమ కలగటం ఏమిటి? అనిపిస్తుంది. దీనికి సమాధానంగా సాక్షాత్తు శంకరుడే ఆమెతో అన్న మాటనే మనకు సమాధానం ఇస్తున్నది.

**ధన్య ధన్య గిరిరాజ్ కుమారీ, తుమ్హ సమాన్ నహి కోఉ ఉపకారీ,**
**పూఛెఉ రఘుపతికథా ప్రసంగ్, సకల్ లోక్ జగ్‌పావని గంగా,**
**తుమ్ రఘుబీర్ చరన్ అనురాగీ, కేన్హహు ప్రస్న జగ్‌హిత్ లాగే,**
**రామ్ కృపా తే పార్వతి, సప్ నెహు తవ మన్ మాహి,**
**సోక్ మోహ్ సన్దేహ భ్రమ, మను విచార్ కఛు నాహి,**
**తదపి అసంకా కీన్హెహు సోయీ, కహత్ సునత్ సబ్ కర్ హిత్ హోయి ॥**

అనగా, "– ఓ పార్వతీ! నీవంటి పరోపకారపారీణురాలు ఎవరు లేరు. రాఘవునిచరిత్రలో కలవిశేషాలను ప్రపంచానికి చాటిచెప్పే అవకాశం కలిగించారు. రామచరిత్ర నీకంటె తెలిసినవారు ఎవరూలేరు. నీవు స్వప్నంలో కూడ ఆ మహానుభావునిచరిత్రనే స్మరిస్తూ దర్శిస్తూ ఉంటావు. అయినా నీవు ఇలా సందేహం కలదానివలె ప్రవర్తించావంటే దీనికి కారణం లోకహితమే" అని తాత్పర్యం.

పరమశివునికి పార్వతీదేవి మనస్సుతెలుసు. ఆమెకు శ్రీరాముని విషయంలో ఎలాంటి భ్రమ లేదని కూడ తెలుసు. అందుకే పార్వతీదేవితో ఇలా అన్నాడు.

ఇలాంటి లోకకల్యాణాన్ని సాధించటంకోసమే శ్రీరామచంద్రుని పరాత్పరత్వాన్ని ప్రతిపాదించటవే తన లక్ష్యంగా ఉంచుకొని "రామచరితమానస్" రచించాడు. శ్రీరామచంద్రుడు అనాద్యనంతుడు, ఆదిమద్యాంతరహితుడు, మానుషరూపంలో అవతరించిన పరమాత్మ. ఇదే తులసీదాసు ప్రతిపాద్యవిషయం.

## 3. "రామచరితమానస్"- లోని సిద్ధాంతము

"రామచరితమానస్"లో తులసీదాసు పరబ్రహ్మ స్వరూపమైన శ్రీరాముని అవతార లీలలనే వర్ణించాడు. దశరథ పుత్రుడైన శ్రీరాముని మానుషావతారంలోని దివ్యశక్తులనే అభివర్ణించాడు.

"మానస్" కథాంశంలో శ్రీరామచంద్రుడు పరబ్రహ్మ అవతారమే. సమస్తదేవతలకు ఆరాధ్యుడు ఆయనయే. అందరికంటె ఉత్తమోత్తముడైన దేవాధిదేవుడు ఆ శ్రీరామచంద్రుడే. దేవతలందరు ఆయనను ఆశ్రయించినవారే.

రావణుడు అంటే దేవతలందరికి అమితమైన భయం. భూదేవి రావణుని అత్యాచారాలను సహించలేకపోయింది. దేవతలని సహాయం కోరింది. వారు ఏమీచేయలేకపోయారు. పైగా సూర్యచంద్రాది సమస్తదేవతలు రావణుని వశకర్తులే అయిపోయినారు.

ఇలాంటి పరిస్థితిలో భూదేవిని ముందు ఉంచుకొని దేవతలందరు బ్రహ్మను ప్రార్థించగా తాను కూడ తన అశక్తతను తెలిపి వారందరిని వెంట తీసికొని శివుని దగ్గరకు వెళ్ళారు. శివుని సలహాతో బ్రహ్మాదిదేవతలు



శ్రీమన్నారాయణుని సర్వవ్యాపకత్వాన్ని గుర్తించి ఆ మహానుభావుని వద్దకు వెళ్లి తమ బాధలను చెప్పుకున్నారు. ఆ స్వామి దేవతలకు అభయం ఇచ్చాడు. తాను దశరథ కౌసల్యానందనుడనై మానవరూపంలో అవతరించి, రావణసంహారం చేసి, రాక్షసబాధలనుండి వారిని విముక్తులను చేస్తానన్నాడు. ఆ మాటప్రకారమే సర్వేశ్వరుడు శ్రీరాముని రూపంలో అవతరించాడు. ఇలా అవతరించిన శ్రీరాముణ్ణి పరాత్పరుడిగా సిద్ధాంతీకరించటమే తులసీదాసు "రామచరితమానస్" లక్ష్యంగా పెట్టుకున్నాడు. పరంపరాగత వస్తువును గ్రహించి శ్రీరామునిచరిత్రను సర్వోత్కృష్టమైన సర్వేశ్వరతత్త్వంగా స్పష్టీకరించటమే తన లక్ష్యంగాపెట్టుకున్నాడు.

తులసీదాసు ప్రాచీన భారతీయ ధర్మపరంపరను పూర్తిగా ఆకళింపు చేసుకొనినవాడు. దానిని ఆచరించేటట్లు, సమస్త ప్రజానీకానికి నిత్యమైన సత్యాన్ని చాటిచెప్పి "శ్రుతి సమ్మత హరిభక్తి"ని వారిలో కలుగచేయటమే తులసీదాసు ధ్యేయం. "రామచరితమానస్"లో అనేక స్థలాల్లో అనేక పాత్రలద్వారా శ్రీరామచంద్రుని ఈ స్వరూపాన్నే వ్యక్తీకరించాడు. ఇలా రామభక్తిని ప్రతిపాదించటంలో ఆయన అనుసరించిన అధ్యాత్మతత్త్వం ఆర్యసిద్ధాంతాలకు అనుగుణమైనదే.

ఉపనిషత్తులు పరబ్రహ్మను నిర్గుణ, సగుణ రూపాలుగా భావిస్తున్నాయి. బ్రహ్మతత్త్వాన్ని నిరూపించటం సాధ్యం కాని విషయం. పరబ్రహ్మ "నిర్గుణుడు" అని అనగా "గుణరహితుడు" అని కొందరు వ్యాఖ్యానించగా "నిర్గుణుడు" అనగా "హేయ గుణరహితుడు" అని కొందరు వ్యాఖ్యానించారు. "నిర్గుణుడు" అన్నా "సగుణుడు" అన్నా ఒకటే అని అన్నారు. దీనినే తులసీదాసు ఇలా చెప్పాడు–

**సగున్ అగున్ దో ఉ బ్రహ్మస్వరూపా,**
**సగునహి అగునహి నహి కఛు భేదా" –**

అనగా, "బ్రహ్మస్వరూపం సగుణ, నిర్గుణ అని రెండు విధాలు. ఈ రెంటిలో భేదం ఏమీలేదు" – అని అర్థం.

"నిర్గుణ" శబ్దానికి "హేయగుణరహితుడు" అనే తులసీదాసుభావన. అందుకే ఈ రెండు విధాలైన రూపాలు ఒకటే అన్నాడు. తరువాత–

**మన్ గోతీత్ అమల్ అబినాసీ, నిర్వికాక్ నిర్‌బధి గున్ రాసీ–**

అంటే ఆ పరబ్రహ్మ ధ్యానయోగంలో మనశ్చక్షువులకు మాత్రమే కనిపించువాడు, స్వచ్ఛమైనవాడు, శాశ్వతమైనవాడు, నిర్వికారుడు, నిరవధికగుణ పరిపూర్ణుడు"– అని అర్థం.

అయితే అలాంటి పరబ్రహ్మమే దేవతలకొరకు, భక్తులకొరకు, భూలోకవాసులకొరకు, గో బ్రాహ్మణహితంకొరకు, సగుణ బ్రహ్మ అయి మానుషరూపంలో అవతరిస్తూ ఉంటాడు. ఇది తులసీదాసుయొక్క భావన. దీనినే శివుడు పార్వతీదేవితో ఇలా అన్నాడు.

**జేహి ఇమి గావహి బేద్ బుధ్, జాహి ధరహి మునిధ్యాన్ ।**
**సోఇ దస్‌రథ్ సుత్ భగత్‌హిత్, కోసల్ పతి భగవాన్ ॥**

అనగా – ఏ పరబ్రహ్మనైతే వేదాలు బుధజనులు, మునులు, ధ్యానయోగంలో దర్శించి కీర్తించినారో ఆయనే భక్తులకోర్కెలు తీర్చుటకై వారిహితాన్ని కోరి, దశరథ తనయుడుగా జన్మించాడు– అని తాత్పర్యం. ఇదే తులసీదాసు సిద్ధాంతం.

అయినా కొంతమంది శాంకర సిద్ధాంత అనుయాయులు, "మానస్" ప్రబంధంలో ప్రతిపాదింపబడినది **"అద్వైత సిద్ధాంతమే"** అంటారు. కాని కొంతమంది అనగా రామానంద సంప్రదాయ అనుయాయులు, శిష్యులు తులసీదాసుయొక్క రామోపాసన **"విశిష్టాద్వైత"** సంప్రదాయానుకూలమే అంటున్నారు.



**ఈశ్వర్ అంస్ జీవ్, అవినాసీ, చేతన్, అమల్, సహజ్ సుఖ్ రాసీ,**
**ఔర్ జీవ్ అనేక్, ఏక్ శ్రీకాంతా....**

అంటే "జీవుడు సర్వేశ్వరుని అంశయే. ఈ జీవుడు నాశములేనివాడు, చేతనుడు, స్వచ్ఛమైనవాడు. సహజమైన సుఖాలకు నిలయమైనవాడు. ఇలాంటి జీవులు అనేకం. కాని, పరమాత్మ ఒక్కడే." అని అన్నాడు.

ఈ విశిష్టాద్వైత సిద్ధాంతాన్నే తులసీదాసు అనుసరించి ప్రతిపాదించాడు.

శ్రీమద్రామానుజులు విశిష్టాద్వైత సంప్రదాయ ప్రముఖ ఆచార్యులు. ఆయన "భగవంతుడు ఒక్కడే. ఆయన దయామయుడు, అసమానుడు. ఆయనకు సాటి అయినవారు మరొకరు లేరు. చతుర్ముఖునినుండి గడ్డిపరకవరకు సర్వమూ ఆయనకు లోబడి ఉన్నవే. కనుక ఆయన విశ్వశరీరి, విశ్వాత్మ. ఆయన యొక్క కల్యాణగుణాలను ఉపాసించటమే మనజ్ఞానానికి ప్రయోజనం.

లోకోపకారకుడైన ఆ దైవానికిలొంగి దాసులమై ఆయనను ప్రేమించటమే మన అవగాహనకు ప్రయోజనం. జనన మరణాలకు కారణమైన రాగద్వేషాల వ్యామోహాన్ని తొలగించేశక్తి ఆ దైవానికే ఉన్నది. ఆ దైవాన్ని ప్రేమించి, ఆయన దేహమైన ఈ జగత్తును దాసభావనతో సేవించటమే మనజీవిత ప్రయోజనం. ఆయన సర్వశేషి. జీవుడు. ప్రకృతి శేషభూతులు. జీవుడు సర్వేశ్వరుని అంశయే జగత్తు అంతా ఆయన శరీరమే.

తులసీదాసు, రామానందుని బోధనలను విని ఈ విశిష్టాద్వైతాన్నే అనుసరించి తన "రామచరితమానస్"లో ప్రతిపాదించాడు.

విశిష్టాద్వైతం ప్రకారం సర్వేశ్వరుడు అనంతుడు, దివ్యగుణోపేతుడు సర్వాంతర్యామి, సచ్చిదానందస్వరూపుడు, షడ్గుణ పరిపూర్ణుడు, జగత్కారణుడు. ఈ లక్షణాలను తులసీదాసు "రామచరితమానస్"లో సమర్థించాడు.

**అనంతుడు**

**దేస్ కాల్ దిసిబిది బహుమాహీ, కహహు సో కహాఁ జహాఁ ప్రభు నాహీ–**

అంటే – ఆ స్వామి దేశకాలాలకు అతీతుడు. ఆయన లేని స్థలమే లేదు.

**దివ్యగుణోపేతుడు**

**రామ్ అమిత గుణ్ సాగర్, యాహ్ కి పావై నహి కోఇ–**

అంటే – పరాత్పరుడైన ఆ రామచంద్రుడు అనంత దివ్యగుణసాగరుడు. ఆయన చివరను ఎవరూ తెలుసుకొనలేరు.

**సర్వాంతర్యామి**

**రామ్, ఉమా సబ్ అంతర్ జామీ,**
**– అంతర్ జామీ రామ్ సియ్ –**

అంటే – "ఓ పార్వతీ, రామచంద్రుడు సర్వాంతర్యామి"
రామచంద్రుడు, సీతాదేవి సర్వాంతర్యాములు"–

లక్ష్మీవిశిష్టుడైన శ్రీమన్నారాయణుడు సర్వాంతర్యామి అని అర్థము.

**సచ్చిదానందస్వరూపుడు**

**"సుద్ధ సచ్చిదానంద మయ కంద భానుకులకేతు"–**
**"రామ్ సచ్చిదానంద దినేసా"–**

అంటే – "సూర్యవంశానికి అలంకారప్రాయమైన శ్రీరాముడు సచ్చిదానంద స్వరూపుడే"

**షడ్గుణపరిపూర్ణుడు**

**జ్ఞాన్ : "జ్ఞాన్ అఖండ్ ఏక్ సీతా హర్"**



జ్ఞానం అంటే – సీతాపతి అయిన శ్రీరామచంద్రుడు అఖండ జ్ఞానసంపన్నుడు.

**భక్తి : "అఖిల అమోఘ భక్తి భగవానా"**

భక్తి అంటే – భగవానుడు అమోఘమైన అఖిల శక్తి సంపన్నుడు.

**బల్ : "మరుత్ కోటి సత్ విపుల్ బల్"**

బలా అంటే – శతకోటి మరుత్తులతో సమానమైన విపుల బలసంపన్నుడు.

**ఐశ్వర్య : "రోమ్ రోమ్ ప్రతి లాగే కోటికోటి బ్రహ్మాండ్"**

ఐశ్వర్యం అంటే – రోమరోమాల్లో కోట్లకొలది బ్రహ్మాండాలు కలిగిన ఐశ్వర్యవంతుడు.

**వీర్య : పురుష సింహా దోఉ వీర్... తథా విధి సబ్ కోటి సృష్టినిపునాఈ"**

వీరం అంటే – వీరులిద్దరు (రామలక్ష్మణులు) పురుషసింహులు. సింహపరాక్రమము కలవారు. శతకోటి సృష్టలను సృష్టించుటలో నిపుణులు.

**తేజ్ : రామ్ తేజ్ బల్ బుద్ధి నిపుణీ, సేష్ సహన్ సత్ సబ్ హి గాఈ"**

తేజం అంటే – రాముడు తేజస్సులో, బుద్ధిలో, బలంలో ఎంతో నిపుణుడు. సహస్రశతశేషులైననూ ఆయన తేజస్సును కీర్తించలేరు.

**జగత్కారణుడు**

**జేహి సృష్టి త్రిబిధిబనాయీ, సంగ్ సహాయన దూనా**

అంటే "త్రివిధచేతనాచేతన సృష్టిని సృష్టించినవాడు. వాటిని తన స్వాధీనములో ఉంచుకొనినవాడు. ఈ సృష్టికార్యములో మరొకరినీ ఎవరినీ సహాయకులుగా తీసికొనినవాడు కాడు."

ఇలా విశిష్టాద్వైతసిద్ధాంత లక్షణాలను తులసీదాసు సమర్ధించి వర్ణించాడు. ఇలాంటి పరమాత్మయొక్క నిర్హేతుకకృపాకటాక్షముచేతనే

చేతనునకు సద్బుద్ధి కలిగి సర్వేశ్వరుడైన శ్రీరామచంద్రుని అనన్యభక్తితో కీర్తించి ప్రపత్తిచేయవలయుననెడి కోరిక కలుగుతుంది - అని విశ్వసించినవాడు "తులసీదాసు".

**తులసీదాసు "రామచరితమానస్"లో అనుసరించిన విధానం**

విభిన్న సంప్రదాయ అభియాయులు తమ తమ సంప్రదాయాలకు తగిన అంతస్సాక్ష్యాలను వెదకి వెదకి గ్రహించి "రామచరితమానస్"లో తులసీదాసు ఆ యా సంప్రదాయాలను సమర్ధించాడు అని చెప్తూ ఉంటారు. ఇప్పుడు మనం ఆయన అనుసరించిన విధానం ఏమిటో తెలుసుకుందాం.

బ్రహ్మసూత్రాలను, భగవద్గీతను వివిధ సంప్రదాయాల వారు తమ తమ సంప్రదాయలకు అనుగుణంగా ఎలా వ్యాఖ్యానించటం జరిగిందో అలాగే "రామచరితమానస్"లో కూడ ఎవరెవరి సంప్రదాయాలకు తగినట్లు వారు వారు వ్యాఖ్యానించారు.

తులసీదాసు, విశిష్టాద్వైత సంప్రదాయాన్ని అనుసరించి 'రామచరితమానస్'ను రచించినాడని తెలుసుకున్నారు. పరబ్రహ్మను తెలుసుకొనలేక వేదశాస్త్రాలు "నేతి, నేతి" (న+ఇతి= నేతి (ఇదికాదు) ఇదికాదు అనే ఉపమానాలను పరిహరిస్తూ) ఘోషించినాయి. అందుచే ఆ పరబ్రహ్మరూపం, గుణాలు అగోచరాలు. అయినా ఆయన తన భక్తుల కోసం సగుణుడుగానే అవతరించి శిష్టరక్షణ, దుష్టశిక్షణ చేశాడు.

"అందువలన నా ఉద్దేశ్యంలో (తులసీదాసు సదుద్దేశ్యంతో) సగుణరూపుడై అవతరించిన ఆ పరమాత్మ అయిన శ్రీరామచంద్రుని నామాన్ని జపిస్తే ముక్తిని పొందుతారు అని అనుకుంటున్నాను" అని తన వివిధ గ్రంథాల్లో కూడ చెప్పి తాను అనుసరించిన విధానాన్ని తెలియపరచాడు.



అయితే దీనిని బట్టి తులసీదాసు వేదశాస్త్ర పురాణాలను అనుసరించలేదు. తిరస్కరించ లేదు. వాటికి అనుగుణంగానే తన రచన కొనసాగించాడు. - "నిగమాగమసమ్మత" అని "రామచరితమానస్"లో ప్రారంభంలోనే చెప్పినాడు.

అందుకే

**బహుమత్ సుని, బహు పంథ్ పురానని జహా తహా ఝగరీసో-**
**గురు కహియో రామ్ భజన్ నీ కోమోహిలాగత్ రాజ్ డగరీసో**

అంటే - "వివిధ మతాలలోని, వివిధమార్గాలను పరిశీలించగా వాటిలో అక్కడక్కడ వివాదశాస్త్ర విషయాలు కనిపిస్తున్నాయి. అందుచేత గురువు బోధించిన రామనామం జపించటమే రాజమార్గం అనిపిస్తున్నది" అనినాడు. ఇదే ఆయన తన గురువు ద్వారా పొందిన ఉపదేశం.

పై వివరణలను బట్టి తులసీదాసు సిద్ధాంతం, "రామచరితమానస్" లోని సిద్ధాంతం "రామభక్తి" మాత్రమే అని విశదమవుతున్నది. ఈ రామభక్తినే తులసీదాసు తన ప్రబంధంలో ఇతర గ్రంథాలలో వ్యక్తీకరించాడు.

## 4. తులసీదాసు - భక్తిమార్గము

హిందీసాహిత్యంలో భక్తకవులు రెండు శాఖలుగా ఉన్నారు. 1. నిర్గుణ భక్తిశాఖవారు 2. సగుణ భక్తిశాఖవారు. సర్వాంతర్యామి "నిర్గుణుడు" అనేది మొదటి శాఖ. సర్వాంతర్యామి "సగుణుడు" అనేది రెండవశాఖ. ఉపాసనాభేదం వల్ల ఈ శాఖలు ఏర్పడినాయి.

నిర్గుణశాఖ రెండువిధాలు. జ్ఞానాశ్రయీశాఖ, ప్రేమమార్గీశాఖ అని. యోగాభ్యాసాదులతో జ్ఞానాన్నిపొంది, దాని ద్వారానే సర్వాంతర్యామిని పొందవచ్చు అనేది జ్ఞానాశ్రయశాఖ. సర్వాంతర్యామిని పొందటానికి జ్ఞానం అవసరం అయితే కావచ్చు. కాని, ఆ స్వామిని ప్రేమపూర్వకంగా ఆరాధిస్తేనే

ఆయనను పొందగలుగుతాము అనేది ప్రేమాశ్రయీశాఖ. జ్ఞానాశ్రయీ శాఖలో ప్రధానమైన కవి "మహాత్మా సంత్ కబీర్‌దాసు". ప్రేమమార్గీశాఖలో ప్రధానమైన కవి "మాలిక్ మొహమ్మద్ జాయసీ" అని సాహిత్యకారుల అభిప్రాయం.

అలాగే సగుణభక్తిశాఖ కూడ రెండువిధాలు. రామభక్తిశాఖ, కృష్ణభక్తిశాఖ అని. నిర్గుణ పరబ్రహ్మ అంటే హేయగుణరహిత పరబ్రహ్మ. భక్తులహితం కోరి శిష్టరక్షణకోసం, దుష్టశిక్షణకోసం అవతారం స్వీకరిస్తాడు. అలాంటి అవతారమే "రామావతారము" ఇలాంటి రామచంద్రుని భక్తి ప్రపత్తులతో కొలిచి ఆత్మసమర్పణం చేస్తే సాయుజ్యం లభిస్తుంది అని రామభక్తిశాఖకు చెందినవారి అభిప్రాయం. కృష్ణభక్తిశాఖవారి ఉద్దేశ్యంకూడ ఇదే అయినా ఆ పరబ్రహ్మ అవతరించే అవతారం "శ్రీకృష్ణుడు". ఇలాంటి శ్రీకృష్ణుని భక్తి ప్రపత్తులతో సేవించి ఆత్మసమర్పణం చేస్తే సాయుజ్యం లభిస్తుంది అని కృష్ణభక్తిశాఖవారి అభిప్రాయం.

రామభక్తిశాఖలో ప్రధానమైన కవీశ్వరుడు "తులసీదాసు". ఈయన తమ సంప్రదాయాన్ని ప్రజలకు తెలియచేయటానికి "అవధీభాష"ను (హిందీ సాహిత్యంలో ఒకరకం) సాధనంగా గ్రహించి, "రామచరితమానస్" అని ప్రబంధాన్ని రచించాడు.

కృష్ణభక్తిశాఖలో ప్రధానమైన కవీశ్వరుడు "సూరదాసు" ఈయన తమ సంప్రదాయాన్ని ప్రజలకు తెలియచేయటానికి "వ్రజభాష"ను (హిందీ సాహిత్యంలో ఒకరకం) సాధనంగా గ్రహించి "సూరసాగర్" అనే గ్రంథాన్ని రచించాడు.

ఇక మనం "తులసీదాసు" భక్తిమార్గాన్ని గురించి తెలుసుకుందాం.

తులసీదాసు భక్తిమార్గం "రామభక్తి" మార్గం. రామభక్తి ద్వారానే ముక్తి లభిస్తుంది అని ఆయన గ్రంథాల్లో విశదపరచాడు.



**ఏక్ భరోసో, ఏక్ బల్, ఏక్ ఆస్, బిస్వాస్**
**ఏక్ రామ్ ఘన శ్యామ్ హిత, చాతక్ తులసీదాస్.** అని అన్నాడు.

అంటే కేవలం శ్రీరామచంద్రుడు మాత్రమే నాకు బలము. ఆయనకే నాభారాన్ని అప్పగించి, ఆయనయందే ఆశను ఉంచుకొని, ఆయనయందే విశ్వాసం ఉంచి, ఆ ఘనశ్యాముని కొరకే చాతకపక్షి నీటి బిందువుల కొరకు ప్రతీక్షించినట్లు, తులసీదాసు అను నేను నిరీక్షిస్తున్నాను – అని అనినాడు. ఆత్మసమర్పణం చేసినాను అనినాడు. భరన్యాసమే తను అనుసరిస్తున్నాను అన్నాడు.

తులసీదాసు సమయంలో నిర్గుణ భక్తిశాఖ (గుణరహితమనే వాదం) వారి ప్రాబల్యం బాగున్నది. కబీర్‌దాసు–

**పాహన్ పూజే హరి మిలై, తోమై పూజూ పహాడ్**

అంటే "ఒకరాతిని పూజిస్తే భగవానుడు లభిస్తాడు అనుకుంటే నేను ఒక పెద్ద పర్వతాన్నే పూజిస్తాను–" అని అవహేళన చేశాడు కూడ. దీనికి వ్యతిరేకంగా సూరదాసు తన **"సూరసాగర్"** గ్రంథంలో "భ్రమరగీతలు" చెప్పిన సందర్భంలో ఉద్ధవునితో గోపికలు –

**నిర్గుణ కౌన్‌దేస్ కే బాసీ–**

అంటే "నిర్గుణుడు అనేవాడు ఎక్కడ, ఏ దేశంలో ఉన్నాడు?" అని ప్రశ్నించారు.

ఈ విధంగా జ్ఞానమార్గీశాఖవారికి, భక్తి, ప్రేమమార్గీశాఖ వారికీ వివాదం జరుగుతున్న రోజులు.

ఈ పరిస్థితిని తొలగించడం ముఖ్యం అని తులసీదాసు భావించాడు. మిథ్యా జ్ఞానంవల్ల కలిగిన మోహం అనే మానసిక అంధకారాన్ని తొలగించటంకోసం దివాకరుని కిరణజాలంతో సమాన తేజస్సు కలిగిన "రామగుణగానమే" అవసరం అని తలచి తులసీదాసు గానంచేశాడు.

అయితే తులసీదాసు ఈ ప్రక్రియలో జ్ఞానానికి ఎంతో ప్రాముఖ్యాన్ని చూపిస్తూనే ఉన్నాడు. అయితే జ్ఞానమార్గం కఠినం కనుక అది వ్యవహారదశలో ఉపయోగించదని తులసీదాసు అభిప్రాయం. అయితే ఈ అభిప్రాయం వల్ల తులసీదాసు జ్ఞానానికి ఎక్కడా అవహేళన కలిగించలేదు. భక్తిమార్గానికే అధిక ప్రాధాన్యాన్ని ఇస్తూ వచ్చాడు.

తులసీదాసు తన ఈ భావాన్ని ఒక ఉపదేశకుడిగా బోధించలేదు. తన రచనలలోని పాత్రలసంభాషణలద్వారా, ఆచరణల ద్వారా వ్యక్తీకరించాడు. జ్ఞాన, భక్తులకు సాపేక్ష మహత్త్వం చూపించాడు. అంటే ఒకటి కాక మరొకటి లేదు అనే సాపేక్షమహత్త్వం.

ఎంత సాపేక్షమహత్త్వం చూపినా జ్ఞానం కంటె భక్తియే శ్రేష్ఠతరం అని తులసీదాసుద్వారా నిరూపించబడింది. ఆ భక్తిమార్గం "రామభక్తిమార్గమే" అని వేరుగా చెప్పనవసరంలేదు. ఎందుకంటే తులసీదాసు "రామభక్తుడు" కదా! భక్తివల్ల అమానిత్వము, నిరభిమానము, సారళ్యము కలుగుతుంది కాబట్టి, అలాంటి భక్తి కలిగిన వ్యక్తికి సహజంగానే ఆత్మ సమర్పణబుద్ధి కలుగుతుంది.

జ్ఞానమార్గం ఎంతో కష్టం అయింది. స్వార్జనద్వారా ధనాన్ని సంపాదించటం ఎంత కష్టమో అంత కష్టసాధ్యమైనది. కాని, భక్తిమార్గం పైతృక ధనం వలె అనుభవించటానికి ఎంతో సులువయింది.

భక్తి భగవత్ కృపాకటాక్షంతోటే కలుగుతుంది. ఆ కృపాకటాక్షం నిర్హేతుకమే. ఆ భక్తిపై మోహము, లోభము, కామము మొదలైనవాటి ప్రభావంపడదు. భక్తికలుగగానే అవిద్యనశిస్తుంది. నిష్కామ కర్మాచరణతో ఆత్మసమర్పణం చేసి జీవుడు పరమాత్మ సాయుజ్యాన్ని పొందుతాడు. ఇది ఎంత సులభమో చూడండి. అలాంటి భక్తిభావాన్ని కలుగచేయమని పరమాత్మను వేడుకోవటమే జీవుడు చేయవలసిన పని.



అందుకే తులసీదాసు ఈ భక్తిమార్గాన్నే ప్రతిపాదించాడు. ఆ భక్తి మార్గం కూడ రామభక్తి మార్గమే అని ఆయన "రామచరితమానస్"లోను, ఇతర అనేక గ్రంథాల్లోను స్పష్టపరచాడు.

భక్తి నవవిధాలుగా ఉంటుందని ప్రసిద్ధి–

**సంస్కృతం : "శ్రవణం కీర్తనం చైవ, స్మరణం పాద సేవనం ।**
**అర్చనం వందనం దాస్యం సఖ్యమాత్మ నివేదనం ॥"**

– అని నవవిధ భక్తిమార్గాలు

శ్రీరాముడు "శబరి" వద్దకు వెళ్లినప్పుడు ఆమెతో నవవిధ భక్తులను గురించి "రామచరితమానస్"లో ఇలా వ్యక్తీకరించాడు. అయితే కొంచెం మార్చి చూపించాడు.

**"ప్రథమ భగతి సన్తన్హ కర్ సఙ్గ్, దూసరీ రతి మమ కథా ప్రసంగా**
**గురు పద పంకజసేవా, తీసరీ భగతి అమాన్**
**చౌథి భగతి మమగునగాన్, కర ఉ కపట్ తజి గాన్**
**మంత్రజప మమదృఢ బిస్వాస్, పంచమ భజన్ సో వేద ప్రకాసా**
**ఛట్ దమ్ సీలవిరతి బహు కర్మా, నిరత్‌నిరంతర్ సజ్జన ధర్‌నా**
**సాత్‌వా సమ్‌మోహిమయ జగ్‌దేఖా, మోతే అధిక్ సంత్‌కర్ వేఖా**
**ఆఠ్‌వా జథా నామ్ సంతోషా, సప్ నెహ్నా హిదేఖ ఇపర్‌దోషా**
**నవమ్‌సరల్ పబ్‌జక్ ఛక్‌హీనా, మన్ భరోస్ హియహరీక్ష నదీనా**

భక్తుడికి మానసికి, ఆధ్యాత్మిక వికాసానికి కావలసిన సోపానాలే ఈ నవవిధభక్తులు. ఆ సోపానాలద్వారా భక్తుడు తన లక్ష్యాన్ని చేరుకుంటాడు.

సత్పురుషుల సాంగత్యంతో మనస్సు భగవంతునివైపు మరలుతుంది. దానిఫలితంగా దేవుని కథలవైపు ఆసక్తి కలుగుతుంది. ప్రేమ కలుగుతుంది. తరువాత నిరభిమాని అయి ఆ సాధకుడు (భక్తుడు) గురువును ఆశ్రయిస్తాడు. గురువుద్వారా భగవత్తత్త్వాన్ని తెలుసుకుంటాడు. భగవత్‌తత్త్వం తెలిసిన

తరువాత భక్తుడు భగవద్గుణాలను కీర్తించటం ప్రారంభిస్తాడు. దీనివల్ల భక్తుని వాక్కు పవిత్రం అవుతుంది. అందువల్ల భగవంతునికి సంబంధించిన సంస్కారం భక్తుని మనస్సుపై అంకితం అవుతుంది. అప్పుడు భగవానుని విషయంలో అతని విశ్వాసం దృఢం అవుతుంది. అప్పుడు ఆచరణ విధానమే భగవత్‌సంబంధితం అయిపోతుంది. అతని మనస్సు వివిధ కర్మల విషయంలో శూన్యం అవుతుంది. ఉచితమైన కర్మలయందేలగ్నం అవుతుంది. తరువాత ఆ భక్తునకు విశ్వంలో అణువణువునా భగవానుడే వ్యాప్తిచెంది ఉన్నాడని అనిపిస్తుంది. ప్రతి వస్తువులో భగవద్రూపాన్నే దర్శించగలుగుతాడు. అప్పుడు అతనికి "తాను" అనే స్వార్థచింతన ఉండనే ఉండదు. అంతటా తన ప్రభువునే దర్శిస్తూంటాడు. జగత్తు అంతా సీతారామమయంగానే అనిపిస్తుంది. అలాంటి స్థితిలో ఆ భక్తుడు ఇతరులలో దోషాలు ఉన్నాయని తలచనే తలచదు. అప్పుడు ఆ భక్తుడు సంతుష్టాంతరంగుడు అవుతాడు. తన లక్ష్యాన్ని చేరుకుంటాడు.

"అనన్యభక్తి" అంటే ఏమిటో శ్రీరామచంద్రుడు ఆంజనేయస్వామితో ఇలా చెప్పాడు. అనన్యభక్తుని లక్షణం ఎలా ఉంటుందో చెప్పాడు.

**"సో అనన్య జాకే అసి, మతి, న టరై హనుమంత్ ।**
**మై సేవక్ సచరాచర్, రూప్ స్వామి భగవన్త ॥"**

అంటే – జగత్తులోని అన్ని వస్తువులలో తమ ప్రభువుయొక్క రూపాన్నే చూడకలగాలి. అదే అనన్యభక్తి. ఆ భావం విచలితం కాకూడదు – అని శ్రీరామచంద్రుడు హనుమంతునితో చెబితే –

"స్వామీ! నేను సర్వచరాచరవస్తువులలో నా స్వామియైన భగవంతుని రూపాన్నే చూస్తున్నాను. చరాచరవస్తువులన్నిటికి నేను సేవకుడను" – అని అనినాడు హనుమ.

ఇదే భక్తుని మానసిక వికాసానికి చరమోత్కర్షదశ.



ఈవిధంగా భక్తుని జీవన వ్యవహారాలలో సదా భగవద్దర్శనాన్నే చేసుకుంటూఉంటాడు. అదే భక్తుని జీవిత లక్ష్యం అవుతుంది.

దీనినే "సర్వాత్మని శరణం" అంటారు. ఇలాంటివారిని సదా భగవానుడు రక్షిస్తూఉంటాడు.

**సంస్కృతం : "అనన్యాశ్చింతయంతో మాం, యేజనాః పర్యుపాసతే,**
**తేషాంనిత్యాభియుక్తానాం, యోగక్షేమంవహామ్యహం"**

అని గీతాచార్యుని అభయహస్తం కదా!

**సంస్కృతం : "సర్వధర్మాన్ పరిత్యజ్య, మామేకం శరణం వ్రజ ।**
**అహంత్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మాశుచః ॥"**

అని కదా గీతాచార్యుని ఆశ్వసనం.

ఇలాంటి భగవత్ వాక్యాలను దృష్టిలో ఉంచుకొనే తులసీదాసు సగుణభక్తిని ఆశ్రయించి, సుగుణ విశిష్టుడైన శ్రీరాముని, సకల సుగుణాభిరాముని ఆదర్శ అవతారపురుషుని అర్చించి, ఆయన గుణగణాలను కీర్తించి, లోకకల్యాణానికి మార్గదర్శకత్వం వహించి ప్రబంధరూపంలో "రామచరితమానస్" గ్రంథాన్ని రచించి శ్రీగోస్వామి తులసీదాసు ధన్యజీవుడైనాడు.

## 5. "రామచరితమానస్"లో ప్రబంధ సౌష్ఠవం

శ్రీ గోస్వామి తులసీదాసు రచించిన "రామచరితమానస్" ఒక ఉత్కృష్టమైన ప్రబంధము అని మనం తెలుసుకున్నాము. ప్రస్తుతం ఆ ప్రబంధంలోని సౌష్ఠవాన్ని గురించి తెలుసుకుందాము.

మార్మిక ప్రకరణాలు అంటే మన హృదయాలను కదలించివేసే సన్నివేశాలు, వర్ణన పటుత్వం, భావుకత, ప్రకృతివర్ణనలు, ఆలంకారికత,

రసాత్మకత, ఉక్తి వైచిత్ర్యం, ఛందస్సు, అప్రియప్రసంగాలను సూచనామాత్రంగా తెలుపుతూ కొనసాగటం – అనేవి ప్రబంధపటుత్వానికి ప్రధానం – ఇవి ప్రబంధ సౌష్ఠవానికి ముఖ్యమైన అంశాలు అని సాహిత్య వేత్తల అభిప్రాయం.

ప్రసిద్ధమైన కథావస్తువు ప్రబంధానికి కావలసిన మొదటి అంశం. "రామచరితమానస్"లో జగత్ప్రసిద్ధుడు, మానవ రూపధారి అయిన పరమాత్మ శ్రీరామచంద్రుని చరిత్ర వర్ణితమైనదని మనకు తెలుసు.

పరమాత్మ మానవరూపంలో అవతరించటానికి కారణం శిష్టరక్షణ, దుష్టశిక్షణ – దానవుల దురాగతాలకు ముఖ్యంగా రావణాసురుని క్రూరకర్మలకు శిష్టులు అనేక బాధలుపడుతున్నారు. అందుచేత దేవతలు శ్రీమహావిష్ణువును శిష్టరక్షణకోసం, దుష్టశిక్షణకోసం భూమిపై అవతరించమని విన్నవించుకొనినారు. రావణుడు నరులవలనకాని, వానరులవలన కాని తనకు మరణము సంభవించునట్లు బ్రహ్మదేవుని నుండి వరమును పొందలేదు. నరులనినా, వానరులనినా "ఆ క్షుద్రప్రాణులు నన్ను ఏమి చేస్తాయనే" అనే చులకన భావమే ఇలా బ్రహ్మ నుండి వరమును పొందకపోవటానికి కారణం. అందుచేత తాను నరరూపములోను, దేవతలు తమ తమ అంశలతో వానరరూపములలోనూ భూమిపై అవతరించవలెనని నిర్ణయించుకొని దేవతలకు ఈ విషయమే చెప్పి ఓదార్చి పంపినాడు.

అదే సమయంలో సమస్తప్రజానీకం, తమను రక్షించేవాడికోసం ప్రార్థిస్తూ ఎదురుచూస్తున్నారు. వార్ధక్యంలోకి ప్రవేశించినా సంతానం కలుగని కోసలాధీశుడు దశరథుడు పరితపించి పరితపించి అనేక యజ్ఞయాగాదులు చేస్తున్నాడు. సకల చరాచరాలు తమ రక్షకుడికోసం ఎదురు చూస్తున్నాయి.

వీటినన్నిటిని గమనించే స్వామి తాను మానవరూపంలో అవతరించటానికి నిర్ణయించుకొనినాడు. అవతరించినాడు.



కథానకం ఇలా అభిరుచి కలిగే రీతిగా శ్రీరామచరితం రామజననంతో ప్రారంభం అయింది. ఇలాంటి ఉత్కంఠాభరితమైన సన్నివేశాలతో "రామచరితమానస్" చివరవరకు కొనసాగుతూ వచ్చింది. కథానకంలో పటుత్వం ఏమాత్రం సన్నగిల్లలేదు. అవిచ్ఛిన్న కథా ప్రవాహం ప్రవహించింది.

కథావస్తువు, పాఠకుడికి అభిరుచిని కలిగించేలా ఉండాలి. ఉత్కంఠను రేకెత్తించేలా ఉండాలి. హృదయాన్ని కదలించే సన్నివేశాలతో ఉండాలి. అందుకు ఏమి చేయాలో తులసీదాసుకు బాగాతెలుసు. అవసరమైనవి అని తలచిన స్థలాల్లో ఉచితరీతిగా వర్ణనలుచేస్తూ అనావశ్యకమైనవాటి విషయాలకు వచ్చినప్పుడు సూచనామాత్రంగా చెప్పుతూ తన రచన కొనసాగించాడు.

## హృదయంగమ సన్నివేశాలలో కొన్ని ఇవి

రామలక్ష్మణులు మిథిలానగర దర్శనం, పుష్పవాటికలో సీతారాములు మొట్టమొదట ఒకరినొకరు చూడటం, ధనుర్యజ్ఞం, శ్రీసీతారామకళ్యాణం, రామవనగమనం, శ్రీరామభరతుల కలయిక, సీతాపహరణం తరువాత రాముని విలాపం, లక్ష్మణుడు శక్తిచే సమ్మోహితుడై పడిపోయినప్పుడు రాముని సంతాపం, రామ రావణయుద్ధం, రామపట్టాభిషేకం, రామరాజ్యం – వీటిని మనం ప్రధానంగా చెప్పుకోవచ్చు.

సహజంగానే వైరాగ్యభావం కలిగి ఉన్న జనకమహారాజు కూడ రాముని సౌందర్యంచూడగానే దిగ్భ్రాంతుడైపోయినాడు. ధనుర్యజ్ఞ సందర్భంలో వచ్చిన రాజన్యుల విషయం చెప్పనవసరమేలేదు. అందరినీ శ్రీరాముని ముగ్ధమోహన సౌందర్యం ముంచెత్తింది. పురజనులు తమ జీవితాలు ధన్యమైనవని భావించారు.

పుష్పవాటికలో చాటుచాటుగా శ్రీరాముని దర్శించినప్పుడు సీతాదేవి కన్నులు చెదరి మూసుకొనిపోయినవట. మానసికంగానే ఆ సౌందర్య మాధుర్యాన్ని అనుభవించిందట.

ప్రక్కనే ఉన్న చెలికత్తెతో "చెలీ నేను అంత అందమైన పురుషునిగా మారి నారీ మానసచోరుడను అయితే బాగుండునే!" అన్నదట. వాక్ వైదగ్ధ్యం కల ఆ చెలి – "నీవు అయిపోతే అటు శ్రీరామచంద్రుడు కూడ నీవలె"నే ఆలోచించి తాను సుందరనారీమణిగా మారుదామని అనుకుంటాడట. మీరు ఎలామారినా మీ శృంగార లీలలకు ఎలాంటి అభ్యంతరం ఉండదు కదా" – అని చమత్కరించిందట. సీతారాముల సౌందర్యం అలాంటిది.

ధనుర్భంగ సమయంలో రాజన్యులు – **"బడ్ ప్రభావ్, దేఖత్ లఘు అహహీ"**

అంటే "మూర్తి చిన్నది, స్ఫూర్తి గొప్పది" అని తలచారు.

సీతారాముల కల్యాణం పూర్తి అయిపోయింది.

తరువాత పరశురామ గర్వభంగ ప్రసంగంలో శ్రీరాముని అపరిమిత శక్తిని దర్శింపజేసి, అలౌకిక ప్రతిభ పరిచయం చేయబడింది.

శ్రీరాముని యౌవరాజ్యపట్టాభిషేక సంరంభం కైకేయి, దశరథునకు తన వరాలను గుర్తుచేయటం దశరథుని పరితాపం చకాచకా సాగిపోయాయి.

రాముని అరణ్యవాసం నిశ్చయం అయిపోయింది. **"నిత్యానపాయిని"** అయిన సీతాదేవి రామచంద్రుని వీడి ఉండలేక తాను కూడ పయనమయింది. లక్ష్మణుడు శేషాంశసంభూతుడు కదా! రాముని విడచి ఎలా ఉంటాడు? తానుకూడ బయలుదేరినాడు. రామునికి సర్వవిధ పరిచర్యలు చేయాలి కదా! అరణ్యాలకు వెళ్లినారు. ఇది ఎంతో విషాదకర సంఘటన.

భరతుడు అరణ్యానికి వచ్చినాడు. సీతారామలక్ష్మణులను చూచి ఎంతో దుఃఖించినాడు. చిత్రకూటంలో సమావేశం జరిగింది.

భరతుని చరిత్ర ఉత్కృష్ట స్థితికి చేరిన సన్నివేశం ఇది. భరతుని త్యాగశీలత, కర్తవ్యపరాయణత, దృఢ వ్రతదీక్ష మొదలైనవాటి వలన సమావేశంలో ఉన్న పెద్దలందరు దిగ్భ్రాంతులైనారు.



ఇటు శ్రీరామచంద్రుని పితృవాక్య పరిపాలనా దృఢత్వం, అటు భరతుని దృఢనిర్ణయం, వీటి మధ్యజరిగిన సంఘర్షణ వారిద్దరి ఉత్తమ చరిత్రలకు మచ్చుతునకలుగా నిలచాయి.

చివరకు పితృవాక్యపరిపాలనే ముఖ్యమనే స్థాయికి భరతుణ్ణి శ్రీరామచంద్రుడు తెచ్చినాడు. తనకు బదులుగా తన పాదుకలను ఇచ్చి భరతుని ఓదార్చి సంతృప్తి పరచినాడు.

శ్రీరామచంద్రుని ప్రతినిధిగా ఆయన పాదుకలనే సింహాసనంపై ఉంచి తాను సేవకునిగా పరిపాలన చేయవలయుననే భరతుడి నిర్ణయం. అటు సమావేశంలోని సదస్యుల హృదయాలను, ఇటు పాఠకుల హృదయాలను కదలించివేసింది.

ఇక్కడ ఒక విచిత్ర సన్నివేశాన్ని తులసీదాసు వర్ణించినాడు. దానిని విన్నవిస్తాను.

చిత్రకూటంలోని శ్రీరామభరతుల సమ్మేళనంచూచి దేవతలు ఎంతో భయపడినారట. శ్రీరాముడు భక్తపరవశుడు అయిన పరమాత్మకదా! భరతుడు పరమభాగవతోత్తముడు కదా! శ్రీరామచంద్రుడు భరతుని కోరికను తీరుస్తాడేమో అని భయపడినారట. వారు తమ భయాన్ని సరస్వతీదేవికి విన్నవించుకున్నారు. భరతుడు తన కోర్కెవిషయములో మరీ పట్టుపట్టకుండా చేయమన్నారట. భరతుని కోర్కెను శ్రీరామచంద్రుడు మన్నించకుండా చేయమనినాడట. ఒక వేళ అలా జరగకపోతే తమలక్ష్యమైన రావణసంహారం శ్రీరామచంద్రునిద్వారా జరిగే అవకాశం లేదని విన్నవించుకున్నారట. సరస్వతీదేవి ఎట్టకేలకు దేవతలకోర్కెను మన్నించి, చిత్రకూట సమావేశానికి "అదృశ్యరూపం"లో వచ్చి శ్రీరామచంద్రునకు నమస్కరించి నిలుచున్నదట. పరమాత్మ అయిన శ్రీరామచంద్రుడు గమనించినాడు. సరస్వతీదేవి మనోభావాన్ని అవగతం చేసుకున్నాడు. తన కన్ను సంజ్ఞతోటే ఆమెను తన ప్రక్కన కూర్చోమని చెప్పినాడట. సరస్వతీదేవి అలాగే ఆసీనురాలు అయినది.

అటు భరతుడు పరమభాగవతోత్తముడు. ఇటు శ్రీరామచంద్రుడు పరమాత్మయే. వీరిద్దరిలో ఏ ఒక్కరిపైకూడ తన ప్రభావం చూపించలేనని తలచి శ్రీరాముని శరణు వేడినది. ఆమె మనోభావాన్ని, అశక్తతను, శ్రీరాముడు గుర్తించి తన ప్రక్కనే కూర్చోమని చెప్పినాడట.

సమావేశం పూర్తి అయిన తరువాత ఆ సమావేశంలో జరిగిన నిర్ణయాన్ని చూచి సంతోషించి, అలాగే అదృశ్యరూపంలోనే శ్రీరామచంద్రునకు నమస్కరించి సత్యలోకానికి వెళ్లిపోయింది. విషయాన్ని దేవతలకు చెప్పింది. ఎంత విచిత్ర సన్నివేశం?

భరతుడు వెళ్లిపోయినాడు. రాముడు సీతాలక్ష్మణులతో కలిసి దండకారణ్యంలోకి ప్రవేశించినాడు. గోదావరీ తీరంలో లక్ష్మణునితో పర్ణశాలను నిర్మింపచేసుకొని సీతారామలక్ష్మణులు నివసించుచున్నారు.

దండకారణ్యంలోనికి ప్రవేశించగానే ఖరదూషణాదులను వధించటం కబంధమోక్షం జరిగిపోయినాయి. మునులు సంతోషించి సుఖజీవనం కొనసాగించినారు.

పర్ణశాలలో నివసించుచున్నప్పుడు శూర్పణఖ పరాభవం, రావణుడు మారీచుని మాయలేడిగా పంపటం, సీతాదేవి దానినికోరటం, శ్రీరాముడు దానిని తేవటానికి దానివెంటనంటి పయనించి తుదకు ఆ లేడిని సంహరించటం, మారీచుని ఆక్రోశనంవిని సీతాదేవి నిష్ఠూరవాక్యాలు పలుకగా లక్ష్మణుడు రామునివద్దకు వెళ్లటం, సీతాదేవి ఒక్కతే ఉన్న పర్ణశాలవద్దకు మారువేషంతో వచ్చి రావణుడు సీతాదేవిని అపహరించటం, రామలక్ష్మణులు మరలివచ్చి శూన్యంగా ఉన్న పర్ణశాలను చూచి దుఃఖిస్తూ సీతాన్వేషణకు బయలుదేరటం మొదలైన సంఘటనలు జరిగిపోయినాయి.

మానవమాత్రుడుగా శ్రీరామచంద్రుడు పడినవేదనను తులసీదాసు మన కళ్లకు కట్టినట్లు చిత్రించాడు. ఆయన వేదనను చూచి మన హృదయాలు ద్రవించిపోతాయి.



యుద్ధరంగంలో ఇంద్రజిత్తుయొక్క శక్తిబాణంతో లక్ష్మణుడు మూర్ఛితుడు అయినప్పుడు తన వ్యక్తిత్వాన్ని కూడ మరచిపోయి, గాంభీర్యాన్ని కోల్పోయి శ్రీరాముడు లక్ష్మణుని కోసం సామాన్యమానవునివలె పరితపిస్తూ పలికిన విషాద వచనాలు పాఠకుల హృదయాలను కదలించివేస్తాయి.

రామ రావణ యుద్ధసందర్భంలో శ్రీరాముని పరాక్రమాన్ని ఎంతో అద్భుతంగా తులసీదాసు వర్ణించాడు. శ్రీరాముని "సర్వశ్రేష్ఠ ధనుర్ధారి" రూపాన్ని మన కళ్ల ఎదుట కనిపించేలా వర్ణించాడు.

పట్టాభిషేక మహోత్సవ సందర్భాన్ని చదివి మనం తన్మయులం అవుతాము. ధన్యులం అయినామని తలుస్తాము.

ఇలా తులసీదాసు పాఠకుల హృదయాలను కదలించే సన్నివేశాలను అతిమనోహరంగా చిత్రించాడు. వాస్తవికత ఉట్టిపడేలా వర్ణించాడు.

అవసరం అనుకున్న స్థలాల్లో, ఆ సంఘటనలను వివరంగా వర్ణిస్తూ, మనోహరంగాలేని వాటిని తగు మాత్రమే సూచిస్తూ తులసీదాసు తన రచనను కొనసాగించాడు.

ఇలా కథానిక నిర్వహణలో, ఉత్కంఠతకు ఏ మాత్రం లోపం రాకుండా తులసీదాసు "రామచరితమానస్" రచన కొనసాగించాడు.

### శీలనిర్మాణం (చరిత్ర చిత్రణం)

శీలనిర్మాణం (चरित्र चित्रण) విషయాన్ని తీసికుంటే ప్రధాన పాత్రలు అయిన శ్రీరాముడు, భరతుడు, లక్ష్మణుడు, దశరథుడు, విశ్వామిత్రుడు, కౌసల్య, సీతాదేవి, హనుమంతుడు, రావణుడు మొదలైన వారి స్వభావాలను, గుణగణాలను, వైశిష్ట్యాలను, వాస్తవికతను ఎంతో ఆదర్శంగా చిత్రించాడు. ఆ యా సమయాలలో ఆ యా వ్యక్తుల భావనా ప్రకర్షను చక్కగా వర్ణించాడు.

మిథిలానగరంలో పురజనులు శ్రీరాముని మొట్టమొదట చూచినపుడు, వారి వారి మనోభావాలను చక్కగా చిత్రించాడు – బాలురు, పురుషులు

రామలక్ష్మణుల వెంటపడి నడచారట. స్త్రీలు మేడలపైనుండి గవాక్షముల చాటునుండి చూచారట. సీతకు తగిన వరుడేనే అని ఒకరికొకరు చెప్పుకున్నారట – కాని ఆ శివధనుస్సును ఎక్కుపెట్టాలికదా! ఇంత సుకుమారుడు ఆ ఘనకార్యం ఎలా చేస్తాడో అనుకున్నారట. సీతామనోరథం ఎలా నెరవేరుతుందో అని దిగులుపడ్డారట.

అరణ్యానికి వెళ్లినప్పుడు ఆ వన ప్రదేశాల్లో నివసించే స్త్రీలు సీతాదేవిని – “ఆ ఇద్దరు ఎవరమ్మా?” – అని అడిగినారట. అలా అడగటం సహజమే అనుకోండి అప్పుడు సీతామహాతల్లి తన భావనాప్రకర్షను వ్యక్తంచేస్తూ–

**సహజ్ సుభాయ్, సుభగ్ తన్ గోరే, నామ్ లఖన్ లఘుదేవార్ మోరే**
**బహురి బదన్ బిధు అంచల్ ఢాంకీ, పియ్ తన్ చితై భౌహి కలిబాంకీ**
**ఖంజన్ మంజు తిరచేనైనని నిజపతి కహెఉ తిన్హహి సియనైనని ॥**

అంటే గౌరవర్ణంలో ఉన్న ఆ సుందరుడు నా చిన్నమరది. పేరు లక్ష్మణుడు అని చెప్పి చంద్రముఖి అయిన సీతాదేవి కొంగుకప్పుకొని ఆ నీలమేఘశ్యాముని వైపు క్రీగంటితో చూస్తూ సంజ్ఞలతోనే ఆ ప్రక్కనే ఉన్న ఆయన నా పతిదేవుడు అని సూచించిందట.

ఎంతని వాక్ వైచిత్రి! ఎంతటి భావనా ప్రకర్ష! చూచారా? ఇలా అనేక స్థలాల్లో భావోత్కర్షను మనం గమనిస్తాము.

గుహుడు – “స్వామీ! నీవు పడవను ఎక్కకు. నీ పాద రేణువుల స్పర్శతో ఇదివరకే ఒక రాయి ఉత్తమస్త్రీగా మారినదట. ఇప్పుడు నా యీ నావకూడ స్త్రీ అయిపోతే నాకు జీవనాధారం లేకుండా అవుతుంది. అందుకని నేను నీ పాదాలను కడుగుతాను. శుభ్రంగా తుడుస్తాను. తరువాతనే నీవు నా నావపై కాలుమోపు” – అని అన్నాడట. పాదసేవనం చేయటానికి గుహుడు ఎంతచక్కగా తన భావాన్ని వ్యక్తం చేశాడో చూడండి. ఇదీ భావుకతాయుక్త కవితారీతి.



విస్తారభీతితో మిగిలిన అనేక సంఘటనలను వదలుచున్నాను. మన్నించండి.

ప్రకృతి వర్ణనలు ఎంతో మనోరంజకంగా ఉన్నాయి. పంపాసరస్సును ఇలా వర్ణించాడు.

**బికసే సరసిజ నానారంగా, మధు ముఖర గుంజత్ బహు భంగా ।**
**బోలత్ జలకుక్కుట కలహంసా, ప్రభు విలోకి జను కరత్ ప్రసంగా**
**చక్రవాక బకఖగ సముదాయీ, దేఖత్ బన ఇ బరని నహి జాఇ ।**

-------------------------------------

**నవ పల్లవ కుసుమిత తరునానా, చంచరీక పటలీ కర్ గానా ।**
**సీతల్ మంద్ సుగంద్ సుభా ఊ, సంతత్ బహై మనార్ హర్ బా ఊ**
**కుహూ కుహూ కోకిల ధుని కరహీ, సుని రవ్ సారన్ ధ్యాన్ ముని పిరహీ ॥**

అంటే అనేక రంగుల పద్మాలు వికసించి ఉన్నాయి... కలహంసలు కూయుచున్నాయి. చక్రవాకాలు, కొంగలు, మిగిలిన అనేక పక్షి సముదాయాలు శ్రీరామచంద్రుని చూచి ముచ్చటించుకుంటున్నట్లు ధ్వనులు చేయుచున్నాయి. భ్రమరసమూహాలు గానంచేస్తున్నాయి. వృక్షములు, నవ విసలయాలతో, నవకుసుమాలతో మనోహరంగా ఉన్నాయి. చల్లని పిల్లగాలులు సుగంధ పరిమళాన్ని తెస్తూ వీస్తున్నాయి. కోయలలు కుహూ కుహూ అని సరసమైన ధ్వనులు చేస్తూ ఉంటే ఆ మధుర ధ్వనులు చెవినపడగా మునుల ధ్యానము కూడ భంగమయినది. అంటే ధ్యానంలో ఉన్న మునులుకూడ ఆ కోయిలస్వరాలను ఆలకిస్తున్నారన్నమాట–

ఇలాంటి ఎన్నో మనోహరమైన ప్రకృతి వర్ణనలతో “రామచరితమానస్” నిండి ఉన్నది. మనుష్యేతర ప్రాణుల మానసిక స్థితులను కూడ తులసీదాసు హృదయంగమంగా వర్ణించాడు.

"రామచరితమానస్" లో "రసాత్మకతకు" కొదవేలేదు. ఆ యా ప్రసంగాలు వచ్చినప్పుడు వివిధ రసాలను పోషిస్తూ పాఠకుల మనస్సులను రంజింపచేశాడు.

అయితే ఇక్కడ మనం ఒక విషయాన్ని గుర్తుంచుకోవాలి. తులసీదాసు తన పాండిత్య ప్రకర్షను వ్యక్తం చేయటానికి ఇలా వివిధరసాలను కావాలనే వర్ణించాడని, వివిధ అలంకారాలను పొందుపరచాడని భావించరాదు. ఎందుచేతనంటే ప్రబంధ ప్రారంభంలోనే తులసీదాసు –

**మతి అనురూప రామ్‌గున్ గాన్ –**

అంటే తన బుద్ధికి తోచినట్లు రామగుణగానం చేయటమే తన లక్ష్యమని, అదే రామచరితమానస్ రచనా ప్రయోజనమని చెప్పినాడు. ఆ రామచంద్ర గుణగానతీతాదాత్మ్యంతోనే వివిధ రసాలు, వివిధ అలంకారాలు, వివిధ భావాలు సహజంగానే తులసీదాసు కలంనుంచి జాలువారినాయి.

వియోగ శృంగారానికి ఒక ఉదాహరణ –

సీతాపహరణం తరువాత శ్రీరాముని విలాపాన్ని ఇలా దర్శింపచేశారు–

**పూఫల్ చలే లతా తరుపాతీ**
**హేఖగ, మృగ, హే మధువర్ శ్రేనీ, తుమ్ దేఖీ సీతామృగనయనీ**

ఓ పక్షులారా, ఓ లేళ్లల్లారా? ఓ వృక్షాల్లారా, ఓ లతా సమూహాల్లారా, మీరు నా సీతను, లేడి కన్నులవంటి కన్నులు లీల "మృగనయని"ని చూచినారా" – అని ప్రశ్నిస్తూ విలపించారు. వసంత ఋతుశోభను చూచి రామచంద్రుడు తన ఆవేదనను, తన విరహవ్యధను లక్ష్మణునితో ఇలా చెప్పుకున్నాడు.

**దేఖ ఉ తాత్, బసన్త సుహాగా, ప్రియా హీన్ మోహి భయ్ ఉపజావా**
–



అంటే ఓ లక్ష్మణా! మనోహరమైన ఈ వసంతశోభనుచూచి, ప్రియాహీనుడను అయిన నాకు భయంకలుగుతున్నది – అని చెప్పుకున్నారు.

సీతాస్వయంవర సభలో నారదుడు కూడ పాల్గొనినాడు. కాని "మర్కటముఖం"తో అలాంటి ముఖం పెట్టుకొని అతిలోక సుందరి అయిన సీతాదేవిని అకర్షించటానికి వచ్చాడా! అని సభికులందరు చిరునవ్వులు నవ్వుకున్నారట. ఇది సుతిమెత్తని హాస్యరసం.

లంకాదహన సమయంలో భీభత్సం చూపబడింది. పిశాచాలు ఆ దృశ్యాన్ని చూచి నాట్యం చేశాయట.

యుద్ధకాండ మొత్తం వీరరసం పరాకాష్ఠకు చేరిన ప్రసంగాలే. ఉత్సాహభరిత సంఘటనలే. సర్వశ్రేష్ఠ ధనుర్ధారి అయిన శ్రీరామచంద్రుని ధనుష్టంకారాలే. లక్ష్మణుని సింహనాదాలే. హనుమంతుని వీరోత్సాహమే. కపి ప్రముఖుల భయంకర విన్యాసాలే.

సంజీవనీ పర్వతాన్ని హనుమంతుడు తెస్తూ ఉన్నప్పుడు, ఆ అత్యద్భుత దృశ్యాన్ని తులసీదాసు మన కళ్లకు కట్టినట్లు వర్ణించి అద్భుతరసాన్ని పోషించాడు.

దశరథుని మరణానంతరం అయోధ్యానగరంలోని పరిస్థితులు, చిత్రకూట సమ్మేళనంలో జనకమహారాజు మరియు మిగిలిన వారందరి మనస్సులు కూడ శ్రీరామచంద్రభరతుల మనోభావాలను చూచి కరుణారస భావభరితాలు అయిపోయాయి. ఆ ఇరువురి సోదరుల ఆ వేదనాభరిత ప్రసంగాలను విని ఒకరుమరొకరికోసం ఎలా పరితపించారో చూచి కరుణారసార్ద్ర హృదయులు అయిపోయారు.

ఇలా వివిధ స్థలాల్లో, సహజమైన రీతిలో వివిధ రసాలను పరిచయం చేస్తూ తులసీదాసు "రామచరితమానస్"లో రసాత్మకతను ఎంతో పోషించారు.

ఇవి అలంకారాలు–

“రామచరితమానస్”లో అలంకారాలకు ఒక ప్రత్యేకత ఉన్నది. ఆ యా అలంకారాలు స్వాభావికమైన సౌందర్యాన్ని ఉత్కృష్ట స్థితికి తీసికొని వెళ్లటానికి సహాయపడినాయి. “కావ్యశోభాకరాన్ధర్మన్ అలంకారాః ప్రచక్షతే” అని ఆలకారికులమాట! – అని కాదా!

శబ్దాలంకారాలైన అనుప్రాస యమకాలంకారాలను చూడండి–

**మాతుపితా, భగినీ ప్రియభాయీ, ప్రియపరివార్ సుహృద్ సముదాయీ**

**సాస్ ససుర్ గురు సజన్ సహాయీ సుత సుందర్ సుశీక్ సుఖ్దాయీ**

**ధర్మ ధురీన్ ధీర నయనాగర్ సీల్ సనేహ సత్య సుఖసాగర్**

రేఖాంకిత శబ్దాలు అనుప్రాసకు ఉదాహరణలు–

**మూరతి మధుర మనోహర్ రేఖీ, భయెహు బిదేహ బిదేహ బిసేఖీ**

**అస్ మానస్ మానస్ చరన్ చాహీ, భిఇ కవి బుద్ధి బిమల్ అప్శాహీ**

**భవ భవ విభవ పరాభవ, కరని బిస్వ బిమోహని స్వబిన్ విహరిని ॥**

రేఖాంకిత శబ్దాలు యమకానికి ఉదాహరణలు–

తులసీదాసు తన “రామచరితమానస్”లో అర్థాలంకారాలను కూడ ఉచిత రీతిలో చాలా స్థలాల్లో ఉపయోగించాడు. అయితే వీటిలో సాదృశ్యమూలక అలంకారాలే ఎక్కువగా కనిపిస్తాయి. వీటిలో కూడ ఉపమాలంకారము, ఉత్ప్రేక్షాలంకారము, రూపకాలంకారము అనేవే ఎక్కువగా కనిపించుతాయి. సంస్కృతంలో కాళిదాసమహాకవివలెనే హిందీలో ఉపమాలంకారాలను వ్యక్తం చేయటంలో తులసీదాసును చెప్పవచ్చు.

చిత్రకూట సన్నివేశంలో ఆ దైవిక మాయా పరవశులై....

**రామ్ హి చిత్వత్ చిత్ర లిఖోసో, సమచత్ బోలత్ బచన్ సిఖే సో**



చిత్రాల్లోని బొమ్మలవలె ఉండిపోయి ఏమీ మాట్లాడలేకపోయారట. జనకమహారాజురాజర్షి. అలాంటి మహానుభావుడు ఉన్న ఆ చిత్రకూట సమావేశంలో భరతుని వినయప్రసంగాన్ని విని, ఆయనమీద అసలే కోపంగా ఉన్నవాడు కాబట్టి తన ప్రతాపాన్ని ఇలా ప్రకటించాడు–

**జౌ తుమహర్ అను శాసన్ పావై, కన్దుక్ ఇవ్ బ్రహ్మాండ్ ఉఠావౌ**

**కాంచే ఘట్ జిమిదాకా ఫేరీ, సౌంకా మేరుమూలక్ జిమితోరీ**

మీరు అనుమతి ఇస్తే బ్రహ్మాండాలను బంతులుగా చేసి ఆడుకుంటాను. మేరుపర్వతాన్ని మట్టికుండలాగా తునాతునకలు చేస్తాను– అని తన ప్రతాపాన్ని వ్యక్తీకరిస్తాడు – జనకుడు.

చిత్రకూటానికి భరతుడు, శత్రుఘ్నుడు సేనాసమేతంగా శ్రీరాముణ్ణి కలవటానికి వస్తున్నారు. లక్ష్మణుడు చూచాడు. ఉత్తేజితుడైనాడు. వారి రాకను ఇలా అంటున్నాడు–

**జిమి కరినికర్ దల ఈ మృగరానూ, లేయి లపేట్ లవా జిమి బాజూ**

**తైసెహి భరత్ హి సేనసమేతా, సానుజ్ నిదర్ నిపేత ఉ ఖేతా**

సేనాసమేతంగా వస్తున్న భరతునిచూచి ‘‘करि निकर’’ (ఏనుగుల సమూహం) అని అంటూ, వాటిని అణచి వేయటానికి తనను ‘‘मृग राज’’ (మృగములకురాజు) అయిన సింహంతో పోల్చుకొని, భరతుణ్ణి ‘‘लवा’’ (బియ్యపుగింజ) అని, శత్రుఘ్నుణ్ణి ‘‘बाज’’ (సజ్జగింజ) అని అంటూ, అలా ఉన్నవారిని అణచి వేస్తానని లక్ష్మణుడు అనినాడు. ఈ పోలిక ఎంత మనోహరంగా ఉన్నది!

ఇలాంటి అనేక స్థలాల్లో ఉపమాలంకారలను మనం గమనిస్తాము.

మనువు భగవంతుణ్ణి ఇలా వరం కోరుతాడు–

**“మని బిను ఫని జిమి, జల్ బిగు మీనా**

**మమ జీవన్ తిమి తుమ్హహి అధీనా”**

సర్పము మణివిహీనమై ఎలా జీవించలేదో, చేప నీరు లేకుండా ఎలా జీవించలేదో అలాగే నీవు ఆధారంగా లేనినాడు నేను జీవించలేను. అలాంటివరం నాకు ఇవ్వు భగవాన్ అని కోరుతాడు. విన్నవించుకుంటాడు.

కైకేయికి దశరథుడు వరం ఇచ్చిన ఫలితంగా శ్రీరాముని వనవాస గమనం నిశ్చయం అయిపోయింది. దశరథుడు వ్యాకులమనస్కుడైనాడు. అప్పుడు దశరథుడు కూడ ఇలాగే అనినాడు–

**జిఅఇ మీన బరు బారి బిహీనా, మని బిను ఫనిక జియ ఇ దుఖ్‌దీనా,**
**కహఉ సుభావు, న ఛల్ మన్ మాహీ, జీవన్ మోర్ రామ్ బిను నాహీ**

నీరులేకుండా చేపలు నివసిస్తే నివసించకలుగుతాయేమో, మణి లేకుండా సర్పము దుఃఖిస్తూ అయినా జీవించి ఉండకలుగుతుందేమో, ఎందుకంటే వాటిస్వభావాలు చంచలమైనవి కావచ్చు. కాని నేను మాత్రం దృఢచిత్తంతో చెబుతున్నాను. నా జీవితం శ్రీరాముడు లేకుండా ఉండనే ఉండదు. నేను జీవించనే జీవించను – అని అనినాడు.

పుష్ప వాటికలో సీతాదేవి శ్రీరామచంద్రుని చూచినప్పుడు ఆమె లజ్జాభరితస్థితి ఎలా వర్ణించాడో చూడండి–

**చిత్ వతి చకిత చహూదిస్ సీతా, కహc గయే నృపకిశోర్ మనుచింతా।**
**జహ బిలోక మృగసావక్ – నైనీ, జనుతహ బిరషి కనుల–సిత్–శ్రేనీ ॥**

చంచలమైన చూపులతో సీతాదేవి, ఆ నృప కిశోరుని కోసం నాలుగు దిక్కులా చూచింది. ఎటువైపు ఉన్నాడా అని చూచింది. లేడిపిల్ల కన్నులవంటి కన్నులుకల ఆ సీతాదేవి ఎటుచూస్తే అటు కమలముల వర్షం కురుస్తున్నదా అనిపించింది.

ఆహా ఎంత చక్కటి ఉత్ప్రేక్ష!



ఇలా ఎన్నో ప్రసంగాలను ఉత్ప్రేక్షాలంకారానికి ఉదాహరణలుగా మనం రామచరితమానస్‌లో చూడగలుగుతాము. మరొక్కటి–

యుద్ధవీరుడైన శ్రీరాముని శరీరం గాయాలతో నిండిపోతే ఆ సౌందర్యాన్ని ఇలా వర్ణించాడు.

**"సిర్ జటాముకుట్ ప్రసూన్ బిచ్‌బిచ్ మనోహర్ రాజహీ**
**జను నీల గిరిపర్ తపిత్–పటల్ సమేత ఉడుగన్ భ్రాజహి"**

జటాజూటములో మధ్య మధ్య అలంకారం కోసం శ్రీరామచంద్రుడు పుష్పములను ఉంచుకొనినాడు. ఆ పువ్వులు వాడకుండానే, అంటే అంత తేలిగ్గానే శ్రీరాముడు సంగరభీముడైనాడు. ఆ పుష్పాలు, నల్లనిపర్వతంపై మెరుపుతీగలు, నక్షత్రాలతో కలసి ప్రకాశించుచున్నవా అన్నట్లు ఉన్నాయి – అని ఎంతచక్కటి ఉత్ప్రేక్ష!

ఇదేవిధంగా అనేక స్థలాల్లో రూపకాలంకారం కూడ వర్ణించబడింది.

**కవితా – సరితా, రఘువర్ బాలసూర్య, కరుణా సరితా, జ్ఞాన్ దీపక్ భక్తిమని....** అని కవితాసరస్సు – రఘువర బాలసూర్యుడు, కరుణా సరస్సు – జ్ఞానదీపము – భక్తిమణి – వంటి అనేక శబ్దాలతో వివిధ పరిస్థితులలో తులసీదాసు రూపకాలంకార శోభను చూపించాడు.

ఇలాగే అనేక అలంకారాలు రామచరితమానస్‌లో సహజమైన రీతిలో పొందుపరచబడినాయి. వాస్తవిక కథాకథనానికి శోభను చేకూర్చినాయి.

ఇక ఛందస్సు విషయానికి వస్తే –

"రామచరితమానస్"లో ప్రతిసోపానం (కాండ) ప్రారంభంలో సంస్కృతశ్లోకాలు, వివిధ వృత్తాలలో రచించబడినాయి. మిగతా గ్రంథం అంతా ''अवधी'' (అవధీ) భాషలోని అనేక ఛందస్సులు ఉపయోగింప బడినాయి.

ఆ ఛందస్సులలో ప్రధానమైనవి ''दोहा'' (దోహా)లు. ''चौपाई'' (చౌపాయీ)లు. ఇవి అవధీభాషలో ఉపయోగింపబడే ఛందోరూపాలు. ఈ రెండు ఛందస్సులే ''రామచరితమానస్''లో ప్రధానంగా ఉపయోగింపబడినాయి. అక్కడక్కడ ''सोरठा'' (సోరఠా) అనే ఛందస్సు కూడ ఉపయోగించబడింది.

ఒక్కొక్క దోహా కింద చౌపాయీలు రచించబడినాయి, ఈ చౌపాయీలు కూడ కొన్ని ఎనిమిది పంక్తులుగా చాలా, కొన్ని కొన్ని స్థలాల్లో 10గా, 12గా, 14గా, 16గా, 18గా, 20గా – ఇలా ఎక్కువ సంఖ్యలో ఉన్నాయి.

ఇదేవిధంగా దోహా, చౌపాయీల మధ్య కొన్ని స్థలాల్లో "హరిగీతికా" అనే ఛందస్సు కూడ ఉపయోగించబడింది. అక్కడక్కడ ఒక దోహాకు బదులు 2,3,4 ఇంకా ఎక్కువ దోహాలు ఉపయోగింపబడినాయి.

ప్రధానంగా దోహాచౌపాయీలనే ఉపయోగించినా "హరిగీతికా" ఛందస్సు కూడ ప్రధానంగానే కనిపిస్తుంది.

ఈ మూడు ఛందస్సులేకాక అక్కడక్కడ ''तोमर'' (తోమర్) అనే ఛందస్సు కూడ ఉపయోగించడింది.

కొన్నిచోట్ల ఆ ఛందస్సు పేరు తెలుపకుండా ''छंद'' (ఛంద్) అనో ''छं'' (ఛం) అనో వ్రాయబడి కూడ ఉన్నాయి.

ఏమైనా కథా ప్రవాహానికి అడ్డురాని రీతిలోనే తులసీదాసు తన గ్రంథంలో ఛందస్సులు ఉపయోగిస్తూ వచ్చాడు.

ఈ విధంగా గోస్వామి తులసీదాసు తన "రామచరితమానస్"లో శ్రీరామచంద్రుని కేవలం లోకనాయకునిగానే కాకుండా ఆధ్యాత్మికతతో కూడిన వర్ణన వైచిత్రితో వర్ణిస్తూ ఆ స్వామిని పరమాత్మ స్వరూపుడుగానే



సిద్ధాంతీకరిస్తూ తన ఉద్దేశ్యాన్ని సఫలీకృతం చేసుకున్నాడు. ధన్యుడు అయినాడు. హృదయానందాన్ని అనుభవించాడు. మనకు మనోహ్లాదాన్ని కలిగిస్తూ మనలో భక్తిభావం అంకురించి పల్లవితం, పుష్పితం అయ్యేలా చేశాడు. తన ఉద్దేశ్యాన్ని సఫలీకృతం చేసుకున్నాడు.

ఆదర్శవంతమైన సుస్థిర రామసామ్రాజ్యాన్ని స్థాపించాడు.

* * * * *

# 1. సూరదాస్ పరిచయం

15, 16 శతాబ్దాలలో వైష్ణవ ధర్మం దేశంలోని నలుమూలల్లో వ్యాపించి ఉన్నది. ఉత్తరభారతదేశంలోని వైష్ణవ ధర్మప్రచారకులలో "శ్రీవల్లభాచార్యులు" ఒకరు. ఇటు దక్షిణభారతదేశంలోకాని, అటు ఉత్తర భారతదేశంలోకాని వైష్ణవధర్మానుయాయుల ముఖ్యలక్ష్యం పరమాత్మ సగుణ బ్రహ్మమే, ఆయన సర్వాంతర్యామి అని ప్రతిపాదించటమే. ఆయనయే భక్తుల ఉపాసనా సౌలభ్యం కోసం వివిధ అవతారాలరూపంలో మనమధ్య అవతరిస్తూ ఉంటాడు.

శ్రీవల్లభాచార్యులు ప్రేమప్రధానమైన భక్తి మార్గమే సర్వేశ్వరుని చేరటానికి సాధనం అన్నాడు. అలాంటి భక్తి జీవుడికి భగవానుని అనుగ్రహం కలిగినప్పుడే కలుగుతుంది. ఆ అనుగ్రహాన్నే "పుష్టి" అంటారు. "పోషణము" అంటారు అని అనినాడు. అందుకే వల్లభాచార్యుని భక్తిమార్గాన్ని "పుష్టి" మార్గం అన్నారు. ఈ పుష్టిమార్గాన్ని గురించి వివరంగా తరువాత తెలుసుకుందాం.

వల్లభాచార్యుల సంప్రదాయాన్ని అనుసరించిన మహాకవియే సూరదాస్. సూరదాస్ భక్తిమార్గాల సగుణ భక్తిమార్గం – పుష్టి సంప్రదాయం అని – ఈ సంప్రదాయం ప్రకారం పరమాత్మ శ్రీకృష్ణపరమాత్మే. ఆయనయే గోకులంలో దర్శనం ఇచ్చాడు. ఆయన కల్యాణగుణ పరిపూర్ణుడు – భక్త సులభుడు – అని సూరదాస్ ప్రతిపాదించాడు. శ్రీకృష్ణుని లీలావిభూతిని వర్ణిస్తూ జీవితం గడపటమే జీవితసార్థక్యం అని సూరదాసు అభిప్రాయం.

సూరదాసును గురించిన వివరాలు కొంతవరకు మాత్రమే లభ్యం అవుతున్నాయి. चौरासी वैष्णवों की वार्ता (చౌరాసీ వైష్ణవోంకీవార్తా) అనే గ్రంథం ఆధారంగా సూరదాసు జన్మతః అంధుడే అని తెలుస్తున్నది. ఈయన ఆగ్రా – మధుర మధ్యలో ఉన్న "గవూఘాట్" అనే చోట ఒక సాధువుగా



ఉంటూ, తన వద్దకు వచ్చిన కొంతమంది శిష్యులకు బోధన చేస్తూ ఉండేవాడని తెలుస్తున్నది.

ఆ ప్రాంతంలో "గోవర్ధన గిరి" అనే ఒక పర్వతం ఉన్నది. ఆ పర్వతంపై "శ్రీనాథమందిరం" అనే ఒక దేవాలయం నిర్మింపబడి ఉన్నది. ఈ మందిరాన్ని – "పూరన్‌మల్‌ఖత్రీ" – అనే మహానుభావుడు 1576 విక్రమశకం అంటే 1524 క్రీ.శకంలో నిర్మించాడట. ఆ దేవాలయ పర్యవేక్షణను ఆ "ఖత్రీ" మహాశయుడు వల్లభాచార్యులకు ఒప్పగించాడు.

వల్లభాచార్యులు ఒకసారి ఆ శ్రీనాథమందిరానికి వెళ్లుతూ దారిలో ఉన్న "గవూఘాట్"కు వెళ్లాడు. వల్లభాచార్యులను కలవటానికి సూరదాసు ఆయన వద్దకు వెళ్లినాడు. తాను గానం చేయుచున్న భగవద్గీతాలను సూరదాసు ఆయనకు వినిపించాడు. ఆ గీతాలలోని భక్తిభావపారతంత్ర్యాన్ని గమనించి వల్లభాచార్యులు, సూరదాసును తన శిష్యునిగా స్వీకరించాడు. భాగవత కథలను గీతాలుగా పాడుతూ, గానం చేస్తూ ఉండమని సూరదాసును ఆదేశించాడు. ఆ గీతాల్లోని మాధుర్యాన్ని భక్తి భావాన్ని విని వల్లభాచార్యులు సూరదాసును శ్రీనాథమందిరంలో **"కీర్తనసేవ"**కు నియమించాడు. అప్పటి నుంచి సూరదాసు శ్రీనాథమందిరంలో ఉంటూ వచ్చాడు.

ఇక ఇప్పుడు సూరదాసు జన్మించిన కాలాన్ని గురించి తెలుసుకుందాం.

వల్లభాచార్యులు 1587 వి.శకం (1535 క్రీ.శకం)లో పరమపదించాడు. 1524 క్రీ.శకంలో శ్రీనాథమందిర నిర్మాణం పూర్తి అయింది. ఆ నిర్మాణంపూర్తి అయిన తరువాత 11 సంవత్సరాలకు వల్లభాచార్యులు పరమపదించినాడు– 1528 క్రీ.శకం ప్రాంతంలో సూరదాసు వల్లభాచార్యుల శిష్యునిగా దీక్షాగ్రహణం చేశాడు.

సూరదాసు ప్రధానగ్రంథం "సూరసాగర్" – తరువాత అనేక గ్రంథాలు సూరదాసు రచనలని ప్రసిద్ధిలోకి వచ్చాయి. కాని ప్రామాణికంగా మాత్రం

**"సూరసారావళి" "సాహిత్యలహరి"** అనే గ్రంథాలు మాత్రమే అని విద్వాంసుల నిర్ణయం. 1555 క్రీ.శకంలో "సూరసారావళి" వ్రాయించటం పూర్తి అయింది. అప్పటి వరకు తన వయస్సు 67 సంవత్సరాలు అని చెప్పుకున్నాడు.

ఈ అంతఃసాక్ష్యాలవల్ల సూరదాసు జననం 1488 క్రీ.శకంలో అయిందని తెలుస్తున్నది. ఆయన మరణించినది 1568 క్రీ.శకంలో. కాబట్టి సూరదాసు జీవించి ఉన్నది 80 సంవత్సరాలు అని తెలియుచున్నది. ఈ సంవత్సరముల సంఖ్యలు సుమారుగా సుమారుగా అనే తెలుపబడియున్నది. కాబట్టి సూరదాసు 80, 82 సంవత్సరాలు జీవించి ఉండవచ్చునని సాహిత్యకారుల నిర్ణయం.

సూరదాసు పృథ్వీరాజు ఆస్థానంలో ఉండే **"చంద్‌బర్దాయీ"** అనే "బ్రహ్మభట్టు" వంశానికి చెందిన ఆయన ఉండేవాడు. తను ఆయన వంశం అయిన "బ్రహ్మభట్ట" వంశానికి చెందిన వాడనని "సాహిత్యలహరి" గ్రంథంలోని ఒకపదంలో సూరదాసు చెప్పుకున్నాడు. కాబట్టి సూరదాసు "బ్రహ్మభట్ట" వంశానికి చెందినవాడు.

సూరదాసు జన్మతః అంధుడే అని తెలుసుకున్నాము కదా! ఆయన తల్లిదండ్రులు ఆ రోజులలో జరిగే ముస్లిములదాడిలో చనిపోయినారు. అనాథుడై తిరుగుతూ ఒకసారి ఒక నీరులేని బావిలో పడిపోయినాడు. ఆరు రోజులు ఆ బావిలోనే భగవంతుని ధ్యానిస్తూ ఉండిపోయాడు. ఏడవ రోజు శ్రీకృష్ణపరమాత్మ ఆయనకు ప్రత్యక్షం అయి, కన్నులు కనిపించే విధంగా చేసి దర్శనం ఇచ్చాడు. సూరదాసు ఆ ముగ్ధమనోహర రూపాన్ని దర్శించుకున్నాడు. **"నీయీ రూపాన్ని దర్శించుకున్న ఈ కన్నులతో ఇంకా దేనినీచూడను. అలా వరమివ్వు"** అని అర్థించినాడు. శ్రీకృష్ణుడు "తథాస్తు" అనినాడు. అదృశ్యుడు అయిపోయినాడు. సూరదాసు అంధునిగానే ఉండిపోయాడు. ఎవరో పుణ్యాత్ములు ఆయనను ఆ బావిలో నుండి బయటకు తీసినారు.



సూరదాసు తన భక్తిగీతాలను గానం చేస్తూనే తిరిగాడు. క్రమంగా కొందరు ఆయన అనుయాయులు అయి శిష్యులు అయినారు. ఈ శిష్యులు సూరదాసు గీతాలను గ్రంథస్థం చేస్తూవచ్చారు. సూరదాసు దినచర్య కేవలం భగవద్గుణగానమే అయిపోయింది.

సూరదాసు తన ప్రధానగ్రంథమైన "సూరసాగర్"లో కాని, మరే ఇతర గ్రంథాలలోకాని ఉన్న గీతాలలోని భావాలు, వర్ణనలు, దృశ్యాలు, పరిస్థితులు అన్నీ ఆయన తన అంతశ్చక్షువులతో దర్శించి వర్ణించినవే అని సాహిత్యకుల నిర్ణయం.

ఇలా ప్రారంభమైన సూరదాసుజీవితం వల్లభాచార్యుల శిష్యత్వం స్వీకరించినప్పటినుండి ఆచార్యుల "పుష్టి" మార్గాన్నే అనుసరిస్తూ "శుద్ధాద్వైత" సంప్రదాయాన్నే (ఇది ఒక వైష్ణవ సంప్రదాయం) ప్రచారం చేశాడు.

తరువాతి కాలంలో వల్లభాచార్యుల కుమారుడు, తమ శిష్యులలో నుండి యోగ్యులైన 8 మంది శిష్యులను ఎన్నుకొని ''अष्ट छाप'' "అష్టఛాప్" అని పేరుపెట్టిన 8 మందిలో "సూరదాస్" ప్రధానుడు.

## 2. "సూరదాసు" దార్శనిక సిద్ధాంతం

మహాకవి "సూరదాసు" హిందీసాహిత్యంలో "సగుణ భక్తి" శాఖకు సంబంధించిన "కృష్ణభక్తి" శాఖకు చెందినవాడు. ఈయన మహాప్రభు వల్లభాచార్యుని శిష్యులలో ప్రధానుడు అని కూడ తెలుసుకున్నాము. ప్రస్తుతం "సూరదాసు" యొక్క దార్శనిక సిద్ధాంతాన్ని గురించి తెలుసుకుందాము.

సూరదాసు ఒక భక్త కవి. దార్శనిక సిద్ధాంతాలను వ్యాఖ్యానించటం ఆయన లక్ష్యంకాదు. సూరదాసుకు అలా దార్శనిక సిద్ధాంతాలను వ్యాఖ్యానించటానికి తగిన సంస్కృత జ్ఞానపరిచయం కూడలేదు. సంస్కృతంలో ఉన్న వేదాంత గ్రంథాలను, శాస్త్రాలను ఆయన చదవనూలేదు. విననైనాలేదు.

కనీసం వ్యాసభగవానుని శ్రీమహాభాగవతాన్ని కూడ చదువలేదు. నేత్రములులేవు కదా! కాని, వల్లభాచార్యుని శిష్యత్వం స్వీకరించిన తరువాత, ఆయనద్వారానే భాగవతాన్ని వినినాడు. ఆ ఉద్గ్రంథంలోని కథాంశాన్ని తెలుసుకున్నాడు. వల్లభాచార్యుల ఆలోచనావిధానం ప్రకారమే ఆ గ్రంథసారాంశాన్ని ఆయన నుండి సూరదాసు తెలుసుకున్నాడు.

ఆచార్య వల్లభుని సంప్రదాయం **"పుష్టి మార్గ సంప్రదాయం"**. కాబట్టి తన సంప్రదాయానికి తగినట్లు ఆయన భాగవత కథను వినిపించగా సూరదాసు వినినాడు. దీనితోపాటు వల్లభాచార్యుల వద్దకు వచ్చిన పండితుల గోష్ఠిలో చేరి వారి దార్శనిక తత్త్వాన్ని వినినాడు. వారి వారి తత్త్వాల సారాంశాన్ని కూడ వల్లభాచార్యులద్వారా వినినాడు.

అందుచేత వల్లభాచార్యుల దార్శనిక సిద్ధాంత ప్రభావం తప్పక సూరదాసు పైపడటం సహజమే కదా! దీని ప్రభావంవల్లనే సూరదాసుయొక్క ప్రముఖగ్రంథమైన "సూరసాగర్"లోని అనేక "పదాల"లో వల్లభాచార్యుల సిద్ధాంతానుగుణమైన విషయాలే కనిపిస్తాయి. జీవుడు, పరబ్రహ్మ, మాయ అనే వాటివిషయంలో అనేక స్థలాల్లో ఆ సిద్ధాంత వివరణలనే గమనిస్తాము. అందువల్ల వల్లభాచార్యుల దార్శనిక సిద్ధాంతమే సూరదాసు దార్శనిక సిద్ధాంతం అనవచ్చు. అయితే తన కవితా ప్రౌఢిమతో కొంత కొంత మార్పుకూడ కనిపిస్తుంది.

మొదట వల్లభాచార్యుల సిద్ధాంతాన్ని – దానినే శుద్ధాద్వైత సిద్ధాంతం అంటారు దీన్ని తెలుసుకొని, తరువాత సూరదాసు దార్శనిక సిద్ధాంతాన్ని తెలుసుకుందాం.

వల్లభాచార్యుని సిద్ధాంతం "శుద్ధాద్వైత" సిద్ధాంతం. ఈ సిద్ధాంతం ప్రకారం జగత్తు, జీవుడు పరమాత్మకంటె వేరైనవికావు. ఆ పరబ్రహ్మ అచేతనమైన ప్రకృతి, చేతనమైన జీవుల రూపంలో పరిణమించినా, శుద్ధ



బ్రహ్మ శుద్ధ బ్రహ్మగానే ఉంటాడు. అందుకే ఈ సిద్ధాంతాన్ని "శుద్ధాద్వైతం" అంటున్నారు.

వల్లభాచార్యుని సిద్ధాంతం ప్రకారం ఆ పరబ్రహ్మ "శ్రీకృష్ణుడే". శ్రీకృష్ణునిలోనూ పరబ్రహ్మలోనూ ఏమీ భేదంలేదు. ఆయన గుణాలు సత్, చిత్, ఆనందాలు. వాటివల్లనే జీవుడు, ప్రకృతి ఉత్పన్నమయినాయి. "జీవునిలో" శ్రీకృష్ణ పరమాత్మయొక్క "సత్", "చిత్" గుణాలు ఉంటాయి. కాని "ఆనందం" అనే గుణం తిరోహితం అవుతుంది. ఇదేవిధంగా "ప్రకృతి"లో కేవలం "సత్" తత్త్వము మాత్రమే ఉంటుంది. "చిత్" "ఆనందం" అనే గుణాలు తిరోహితాలు అవుతాయి. అనగా పరబ్రహ్మ సత్, చిత్, ఆనంద స్వరూపుడు. జీవుడు "సత్", "చిత్" గుణోపేతుడే. ప్రకృతి "సత్" గుణోపేతము మాత్రమే. ఈ మూడున్నూ పరబ్రహ్మయొక్క భేదాలే. వీటిలో "మాయ" అనేది ఏదీ ఉండదు. వల్లభాచార్యుని సిద్ధాంతం ప్రకారం పరబ్రహ్మ ఎంత సత్యమో జీవుడు కూడ అంత సత్యమే. ఈ రెంటిలో ఏమీ భేదం లేదు. జీవుడు పరబ్రహ్మ యొక్క అంశమాత్రమే కాబట్టి జీవుని శక్తి పరిమితమైనదే. పరబ్రహ్మ పూర్ణుడు కాబట్టి ఆయన శక్తి అపరిమితము. ప్రకృతి కూడ జీవునివలెనే పరబ్రహ్మయొక్క అంశయే. ఈ మూడున్నూ నిత్యములే. ఆ పరబ్రహ్మ శ్రీకృష్ణుడే. **"కృష్ణస్తు భగవాన్ స్వయం"** అని కదా ప్రసిద్ధి. పరబ్రహ్మ అనంతకల్యాణగుణగణౌఘమహార్ణవము. శ్రీకృష్ణుడునూ అంతే.

వల్లభాచార్యులు ఆత్మలను 3 రకాలుగా పేర్కొనినారు. 1. ముక్తియోగిని 2. నిత్యసంసారిణి 3. తమోయోగిని. వీటిలో ముక్తియోగిని అయిన ఆత్మలు ముక్తిని పొందకలుగుతాయి. అయితే ఈ ఆత్మలు కూడ భగవదనుగ్రహం లేకుండా ముక్తిని పొందజాలరు. ఎందువల్ల నంటే వీటిపై కూడ "మాయ" యొక్క ప్రభావం ఉంటుంది. భగవదనుగ్రహం వల్ల ఈ ఆత్మలు మాయావిముక్తం అవుతాయి. భ్రమ దూరం అవుతుంది.

నిత్యసంసారిణి, తమోయోగిని ఆత్మలు ముక్తిని పొందటం చాల కష్టం. అయితే ఈ ఆత్మలపై కూడ భగవత్కటాక్షం ప్రసరిస్తే, వాటికి తమలో భగవద్భక్తిభావం అంకురిస్తుంది. తరువాత అవికూడ ఎంతో కొంత కాలానికి ముక్తియోగిని స్థాయికి చేరుతాయి. అప్పుడు వాటిపై కూడ భగవదనుగ్రహం కలుగుతుంది. మాయామోహం నుండి విముక్తులు అవుతాయి. ముక్తిని పొందగలుగుతాయి. అంతవరకు సంసారచక్రంలో పరిభ్రమిస్తూనే ఉంటాయి. ఈ భగవదనుగ్రహాన్నే వల్లభాచార్యులు "పుష్టి" అనినాడు.

కాబట్టి, భగవద్భక్తి ద్వారా భగవదనుగ్రహం పొందటమే మానవులు తమలక్ష్యంగా తలచాలి.

వల్లభాచార్యులు ఈ పుష్టిని 4 రకాలుగా వర్ణించాడు. 1. ప్రవాహపుష్టి 2. మర్యాదపుష్టి 3. పుష్టిపుష్టి 4. పుష్టి (శుద్ధపుష్టి).

"ప్రవాహపుష్టి" మార్గం ప్రకారం భక్తుడు సంసారంలో ఉంటూ కూడ శ్రీకృష్ణుని కీర్తిస్తూ ఉంటాడు.

"మర్యాదపుష్టి" మార్గం ప్రకారం భక్తుడు సంసారిక సుఖాలనుండి తన మనస్సును మళ్లిస్తాడు. శ్రీకృష్ణుని గుణగానంలో లీనం అవుతాడు.

"పుష్టిపుష్టి" మార్గం ప్రకారం భక్తుడు శ్రీకృష్ణుని అనుగ్రహాన్ని అయితే పొందుతాడు. కాని అలా పొందటానికి భక్తుడు సాధనాన్ని కూడ అనుసరించి ఉంటాడు.

"శుద్ధపుష్టి" మార్గం ద్వారా భక్తుడు భగవానునిపై పూర్తిగా భారంవేసి ఆయనకు ఆశ్రితుడై ఉంటాడు. అంటే ఆత్మ సమర్పణం చేస్తాడు. భగవానుని ఆవ్యాజకృపాకటాక్షం కోసమే ప్రతీక్షిస్తూ ఉంటాడు. భగవానుడు తప్పక అతనిని కరుణిస్తాడు. ఇలాంటి అనుగ్రహాన్ని పొందిన తరువాత ఆ భక్తుడు భగవంతుని లీలల్లో మునిగిపోతాడు. తాదాత్మ్యం పొందుతాడు.



వల్లభాచార్యుని పుష్టిమార్గంలో ఈ "శుద్ధపుష్టి" కే పరమోచ్చ స్థానం ఇవ్వబడింది.

"మాయ" విషయంలో వల్లభాచార్యుల సిద్ధాంతం శ్రీ శంకరాచార్యుల వారికంటె భిన్నమైనది. జగద్గురువు శంకరాచార్యులవారు "జీవాత్మ మరియు పరమాత్మలో భేదం మాయవల్లనే గోచరిస్తుంది. అన్నారు. నిజంలో ఈ భిన్నత్వం మిథ్యయే అన్నారు" – వల్లభాచార్యులు. "జీవాత్మ పరమాత్మకంటె భిన్నమైనదే. ఈ భిన్నత్వానికి కారణం పరమాత్మయే. "మాయ" కాదు అన్నాడు. ఈ "మాయ" అనేది పరబ్రహ్మ శక్తుల్లో ఒకటి అన్నాడు.

వల్లభాచార్యుల శుద్ధాద్వైత సిద్ధాంతం సంక్షిప్తంగా ఇదే –

ఇక మనం "సూరదాసు" యొక్క దార్శనిక సిద్ధాంతాన్ని గురించి తెలుసుకుందాం–

"సూరదాసు" సిద్ధాంతం ప్రకారం శ్రీకృష్ణుడే పరబ్రహ్మ. ఈయన సగుణుడు, నిర్గుణుడు కూడ. భగవానుడే స్వయంగా ఇలా అన్నాడు– అనాద్యుడు. ఆదిమధ్యాంతరహితుడు.

**కోమాతా, కోపితా హమారే**
**కబ్ జనతమ్ హమ్‌కో తుమ్ దేఖ్యో?**
**హఁసీ లగత్ సుని వచన్ తుమ్హారే –**

అంటే "నాకు తల్లి ఎవరు? తండ్రి ఎవరు? నేను ఎప్పుడు జన్మించానో మీరు చూశారా? మీ మాటలు వింటూ ఉంటే నాకు నవ్వు వస్తున్నది."

**పితా మాతా ఇన్ కే నహి కోఈ**
**ఆపుహి కర్‌తా, ఆపుహి హర్‌తా**
**నిర్గుణ గయే తే రహత్‌హై జోయీ**

అంటే "ఈయనకు తల్లిలేదు. తండ్రిలేదు. ఈయనయే కర్త. ఈయనయే హర్త. అంటే ఈయనయే సృష్టికారకుడు. ఈయన లయకారకుడు. అందుకే ఈయనను కొందరు నిర్గుణుడు అంటారు" అన్నాడు సూరదాసు.

సూరదాసు తన గీతి కావ్యమైన "సూరసాగర్"లో అనేక స్థలాల్లో విష్ణు, హరి అనే శబ్దాలను ఉపయోగించాడు. రామునిచరిత్రను కూడ వర్ణించాడు. రాముని కూడ కృష్ణునితో సమానంగా స్వీకరించాడు. సూరదాసు ఉద్దేశ్యంలో విష్ణు, హరి, రామ... ఇలాంటి భగవానుని పేర్లన్న కృష్ణునికి పర్యాయపదాలే. వీరందరు నిర్గుణ పరబ్రహ్మయొక్క సగుణ రూపాలు. వాస్తవంలో వీరందరూ ఒకటే. విష్ణువే పరబ్రహ్మ. ఆయనయే శ్రీకృష్ణుడు. ఆయనయే సామాన్య ప్రజలకోసం వివిధ అవతారరూపాలలో అవతరించాడు. సామాన్యులు అగోచరమైన తనను ఊహించను కూడ లేరని సగుణరూపం ధరించాడు. కాబట్టి సగుణ పరబ్రహ్మనే నేను ఉపాసిస్తాను. అని చెప్పి సూరదాసు స్వీకరించాడు.

**అవిగత్ గతి కఛు కహత్ న పావై**
**జ్యొ గూంగే మీఠే ఫల్ కో రస్ అన్తర్ గతహీ భావై**
**× × × × × × × × ×**
**రూప్, రేఖ్, గున్, జాతి, జుగతి బిను నివలంబ మన్ చకత్ ధావై**
**సబ్ విధి అగమ్ విచారహి, తాతే సూర్ సగున్ లీలా పద్ గావై**

అంటే నిరాకార పరబ్రహ్మను ఎలా తెలిపేది? మూగవాడు ఒక తియ్యని పండును తిని దాని తీపిని చెప్పలేనట్లే నేను ఆ నిర్గుణ పరబ్రహ్మను గురించి చెప్పలేను. రూపం, గుణం, జాతి మొదలైనవి లేని ఆ పరబ్రహ్మను గురించి ఆలోచించాలి అంటేనే మనస్సు చంచలమై ఎటో పరుగెత్తుతుంది. ఇలా అనేక రకాలుగా ఆలోచించే సూరదాసునైన నేను సగుణపరబ్రహ్మయొక్క లీలలనే గానం చేస్తున్నాను – అని అర్థం.

అందుకే సూరదాసు సగుణ పరబ్రహ్మనే ఉపాసించాడు. ఆయన గుణగణాలనే కీర్తించాడు. లీలలనే గానం చేశాడు. మనోనేత్రంతో ఆ సగుణపరబ్రహ్మనే దర్శించాడు. ఆనందానుభూతిని పొందాడు.



"సూరదాసు" యొక్క దార్శనిక సిద్ధాంతాన్ని పరిశీలిస్తే మనకు ఈ విషయాలు తెలుస్తున్నాయి.

సూరదాసు శ్రీకృష్ణుని రెండు రూపాలను మనముందు ఉంచాడు. ఒకటి "నిరాకార" రూపం. రెండవది "సాకార" రూపం. వాస్తవంలో శ్రీకృష్ణ పరమాత్మ పూర్ణపురుషుడే. ఆయనయే భక్తుల హితం కోరి వివిధ లీలారూపాలతో అవతరిస్తూ ఉంటాడు. ఇలా మనం ఆ నిర్గుణ బ్రహ్మయే సగుణ పరబ్రహ్మ అని భావించాలి. "నిర్గుణ" అనగా హేయగుణరహిత అని భావించాలి. భక్తులభావన కూడ ఇదే. వారు సగుణ పరబ్రహ్మనే ఆరాధిస్తారు.

"మాయ" విషయానికి వస్తే సూరదాసు "మాయ"ను 3 రకాలుగా భావించాడు. 1. దార్శనిక రూపం 2. సాంసారిక రూపం 3. రాధారూపం ఆయన సిద్ధాంతం ప్రకారం "మాయ" పరబ్రహ్మయొక్క వశంలోనే ఉంటుంది. పరబ్రహ్మకంటె వేరుకాదు. మహాప్రళయం తరువాత ఈ "మాయ" పరబ్రహ్మ పాదాలలో విలీనం అవుతుంది.

### 1. దార్శనిక రూపం

"మాయ" పరబ్రహ్మ అంశమే. కాని, తన త్రిగుణాత్మకమైన రూపంతో బ్రహ్మను ఆశ్రయించి ఉంటుంది. అవసరం అయినప్పుడు సత్యాన్ని మరుగున పడవేసి అసత్యాన్ని (అవిద్యను) ఉత్పన్నం చేస్తుంది. ఆ స్థితిలో పరబ్రహ్మ అంశ అయిన జీవాత్మ "మాయా" ఆవరణప్రభావం వలన ఆ "మాయనే" "సత్యం" అని తలుస్తుంది. అందుకే **"మాయ"కు రెండో పేరుగా "అవిద్య"** అన్నారు. అందుచేతనే సూరదాసు భగవానుని ప్రార్థిస్తూ,

**సూర్‌దాస్ కి సబై అవిద్యా దూర్‌కరో నందలాల్–** అన్నాడు.

అంటే నాలో ఉన్న "అవిద్య"ను పూర్తిగా తొలగించు ఓ నందగోపాలా! అని "మాయ"కు ఒక ఆధారంలేదు. భగవల్లీలమాత్రమే. కాబట్టి దానిని భగవద్భక్తికి

ఒక దృఢమైన ఆధారంగా కూడ సూరదాసు భావించాడు. భగవానుడు "మాయ"ను ఒక **"నల్లగొంగళి"**వలె కప్పుకున్నాడు అని సూరదాసు అన్నాడు.

**యెహ్ కమరీ కమరీ కరి జానతి**
**జాకే జితనీ బుద్ధి హృదయ్ మే సో తితనీ అనుమానతి**
**యా కమరీ కే ఏల్ రోమ్‌పర్ బారౌ నీలపతంబర్**
**సో కమరీ తుమ్ నిందతి గోపీ, జో తీన్ లోక్ ఆడంబర్**
**కమరీ కే బల్ అసుర్ సంహారే, కమరహితే సబ్ యోగ్**
**జాతి పాంతి కమరీ సబ్‌మేరీ 'సూర్' సబహియెహ్ యోగ్ ॥**

అంటే ఈ "మాయ" అనేది ఒక "నల్ల గొంగళి" అని తెలుసుకొనండి. ఎవరెవరి జ్ఞానాన్ని బట్టి వారు వారు దీనిని తలుస్తూ ఉంటారు. అటువంటి గొంగళిలో ఉండే ఒక "రోమం" అయినా నల్లటిపట్టుబట్ట కంటె గొప్పది అని తలచండి. అలాంటి గొంగళినే నీవు నిందిస్తున్నావా గోపికా! ఈ గొంగళే ముల్లోకాలను ఆవరించి ఉంటుంది. (మాయ ఆవరించి ఉంటుంది) దీని సహాయంతోటే భగవానుడు అసురులను సంహరించాడు. (మాయా మోహితులను చేసె). ఈ గొంగళే అన్నిటికి మూలం. దీనినే **"యోగమాయ"** అని కూడ అంటాము. జాతులు, మానమర్యాదలు మొదలైనవి అన్నీ భగవన్మాయద్వారా కల్పితాలే. అన్నిటికీ మూలం ఈ "మాయ" యే అని నేను చెప్పుతున్నాను అన్నాడు సూరదాసు.

శ్రీకృష్ణుని ఈ "గొంగళి" ఎంత రహస్యమయమో చూశారా? ముల్లోకాలు ఈ కంబళి (గొంగళి) తోటే ఆవరింపబడి ఉన్నాయి. అసురసంహారంలోనూ, రసానందమయ భగవల్లీలల్లోనూ, ఈ గొంగళే ఆవరించి ఉన్నది. ఈ కంబళే యోగము, భోగము, శక్తి. అందుచేత ఈ కంబళిని తెలుసుకుంటే శ్రీకృష్ణుణ్ణి తెలుసుకోవటానికి దారి దొరికినట్లే.



భగవానుని తెలుసుకోవటానికి ఈ గొంగళి ఒక సాధనమే. ఇదే శ్రీకృష్ణుని యోగ మాయ – **"మమ మాయా దురత్యయా–"** అని గీతాచార్యుడు స్వయంగానే చెప్పాడు కదా! దీనిని మనం మనకు ఉన్న జ్ఞానంవల్ల అనేక విధాలుగా తెలుసుకో కలుగుతాము. ఇలా మనం తెలుసుకొనే జ్ఞానం భగవానుని అవ్యాజకరుణాకటాక్షం వల్లనే కలుగుతుంది. ఈ గొంగళి అంటే "మాయ" అని వేరే చెప్పాలా?

సూరదాసు ఈ "మాయ"ను (అవిద్యను) చాలా చక్కగా అనేక స్థలాల్లో వర్ణించాడు. ఈ మాయా ప్రభావంవల్లనే వేదాలను గూర్చి కూడ తర్కం ప్రారంభం అయింది. వేదాలను గురించి తర్కించటం మంచిదికాదు అని తెలిసినా ఆ మాయా ప్రభావం వల్లనే జ్ఞానులు కూడ మోహితులు అయి అలా తర్కించారు. ఇది మాయయొక్క దార్శనికరూపం.

### 2. రెండవది "మాయ"యొక్క సాంసారిక రూపం

ఈ "మాయ" సాంసారిక రూపంతో మనలను మోహింపచేస్తుంది. ఇది సహజంగా స్త్రీ సౌందర్యాన్ని ఆశ్రయించి ఉంటుంది. దీనివల్ల భక్తుని సాధన భగ్నం అవుతూ ఉంటుంది. మహానుభావుడు అయిన విశ్వామిత్రుని సాధన కూడ భగ్నం అయింది కదా! ఈ మాయయొక్క రూపం ఉచ్ఛృంఖలమైనది. ఉత్పాతాలను సృష్టించుతుంది. దీని విషయంలో అతిజాగ్రత్తగా ఉండాలి.

### 3. మూడవది రాధారూపం

"మాయ"ను ఎలా అయితే భగవానుని రూపంగా భావిస్తున్నామో అలాగే శ్రీకృష్ణభగవానుని అనుగ్రహరూపంగా "రాధ"ను భావించాలి. "రాధ" భగవానుని శక్తిరూపం. "మాయ" యొక్క అనుగ్రహరూపం. అంటే "మాయ" అయినా అనుగ్రహాన్నే చూపుతుంది. అని తలచాలి. లక్ష్మీ, సరస్వతీ, పార్వతులు వరుసగా శ్రీమన్నారాయణుడు, చతుర్ముఖబ్రహ్మ, పరమశివుడు అయిన

తమ స్వాములతో ఎలా అభిన్నంగా ఉంటారో అలాగే "రాధ" కూడ శ్రీకృష్ణపరమాత్మతో అభిన్నంగా ఉంటుంది. వారి ఇద్దరిది శాశ్వత సంబంధం. ఆధ్యాత్మిక సంబంధం. ప్రకృతి పురుషుల సంబంధం.

అందుకే సూరదాసు తనకు భక్తిని ప్రసాదించమని "రాధ"నే వేడుకుంటాడు. రాధకు ఇలాంటి దార్శనిక సంబంధాన్ని కల్పించటం సూరదాసుయొక్క ప్రత్యేకత. మౌలికత.

సూరదాసు సిద్ధాంతం ప్రకారం ముక్తికి సాధనం "భక్తి" మాత్రమే. ఈ భక్తినే సూరదాసు "పుష్టి" అన్నాడు. "మర్యాద" అన్నాడు. దీనిని బట్టి భక్తి విషయంలో తన గురువు అయిన వల్లభాచార్యుల ప్రభావం పూర్తిగా సూరదాసుపై ఉన్నదని భావించవచ్చు. మానవునిలోని కామక్రోధాదులు భగవానుని అనుగ్రహం ద్వారానే నశిస్తాయి అని సూరదాసు సిద్ధాంతం. ఇదే "శుద్ధాద్వైతం". ఈ సిద్ధాంతం ప్రకారం "సాన్నిధ్యముక్తి"యే కావాలని నిర్ణయం. సాయుజ్యముక్తి కాదు. సాన్నిధ్యముక్తిలో జీవుని అస్తిత్వం యధాతధంగా ఉంటుంది. ఇదే శుద్ధాద్వైతం.

సంక్షిప్తంగా సూరదాసుయొక్క దార్శనిక సిద్ధాంతం ఇదే.

## 3. సూరదాసు "భక్తిపద్ధతి"

"సూరదాసు" ఒక గొప్ప భక్తుడు. శ్రీకృష్ణభగవానుని తన ఇష్టదైవంగా భావించి, ఆయన లీలలను వర్ణించినాడు. శ్రీకృష్ణుడే పరబ్రహ్మగా అంటే పరమాత్మగా భావించినవాడు.

అయితే సూరదాసు కేవలం భక్తుడే కాదు. ఒక గొప్ప కవీశ్వరుడుకూడ. ఆయన కవిత్వం ఉన్నత శ్రేణికి చెందినది. అలాంటి ఉన్నత శ్రేణికి చెందిన ఆయన కవిత్వం, భక్తి భావనను ఉన్నత శిఖరంపై అధిష్ఠించేటట్లు చేసింది. పూర్ణదశలో ప్రతిష్ఠితం చేసింది. అందుకే సూరదాసును గురించి ప్రవచించే



విద్వాంసులు ఆయన కవిత్వాన్ని భక్తి పక్షంగానూ, కావ్య పక్షంగానూ గమనించి ప్రవచిస్తూ ఉంటారు. మనం ప్రస్తుతం సూరదాసుయొక్క "భక్తి పక్షాన్ని" గురించి తెలుసుకుందాం.

సూరదాసు భక్తికి "ఆలంబనం" శ్రీకృష్ణుడు. ఆశ్రయం శ్రీకృష్ణలీలలు. ఆయన రూపం, ఆయన గుణాలు ఉద్దీపన విభావాలు. సూరదాసు మనోగతం ప్రకారం శ్రీకృష్ణుడు అనంతుడు, అగమ్యుడు, అనాద్యుడు, పరబ్రహ్మ, తనకు తల్లితండ్రులు లేరని తాను ఎప్పుడు జన్మించాడో ఎవరికీ తెలియదని శ్రీకృష్ణుడే గోపికలతో చెప్పినాడు కదా!

అయితే అలాంటి అనాద్యుడు, అనంతుడు, నిర్గుణుడు అయిన పరమాత్మతో భక్తి సంబంధం పెట్టుకోవటం సాధ్యపడదని సూరదాసు తలచినాడు. ఆయనను తెలుసుకోవటంకాని, భక్తితో కొలవటంకాని, ఉపాసించటంకాని అతికష్టం అని సూరదాసు భావించినాడు. అందుకే అలాంటి పరమాత్మ రూపమయిన శ్రీకృష్ణుని "సగుణ పరబ్రహ్మ"గానే భావించి కీర్తించినాడు. ఆ పరమాత్మ సగుణరూపంలో అవతరించటం కేవలం భక్తుల కొరకే అని భావించాడు, వర్ణించాడు, ప్రతిపాదించాడు.

**"భక్త హేతు అవతార్ దరయో"** – అన్నాడు. భక్తుల కొరకే తాను అవతరిస్తున్నట్లు చెప్పాడు భగవానుడు. తన నామ సంకీర్తనం చేసే భక్తుల వద్దనే తాను ఉంటానని భగవానుడు చెప్పాడు.

శ్రీ మహాభాగవత పురాణంలో కూడ భగవానుడు నారదునితో ఇలా చెప్పాడు కదా!

**"నాహం వసామి వైకుంఠే, యోగినాం హృదయే నచ**
**మద్భక్తాః యత్ర గాయంతి, తత్ర తిష్ఠామి నారద–"**

భక్తుడు అన్యభావంతో భగవానుని కీర్తిస్తూ ఉంటే తప్పక అక్కడ భగవంతుడు తిష్ఠవేసి ఆ భక్తుని యోగక్షేమాలు వహిస్తూ ఉంటాడు.

సూరదాసుభక్తి అనన్యభక్తి శ్రీకృష్ణుని విషయంలో సూరదాసు తన అనన్య భక్తిని ఇలా చెప్పాడు-

**మేరామన్ అనత్ కహాఁ సుఖ్ పావై?**
**జైసే ఉడి జహాజ్ కో పంఛీ పుని జహాజ్ పై ఆవై**
**× × × × × × × × ×**
**సూర్‌దాస్ ప్రభు కామధేను త్యజి ఛేరీ కాన్ దుహావై**
**× × × × × × × × ×**
**స్యామ్ బలరామ్ కో సదా గా ఊఁ**
**స్యామ్ బలరామ్ బిను దూసరే దేవ్‌కో స్వప్నహూఁ నహి ఊర్‌లాహూఁ**

అంటే "నా మనస్సు మరొకచోట ఎలా సుఖాన్ని పొందుతుంది? సముద్ర మధ్యలో ఉన్న ఓడపై ఉన్న పక్షి పైకి ఎగిరినా, ఎగిరి ఎగిరి తిరిగి ఆ ఓడపైనే వాలుతుంది కదా (అలాగే నా మనస్సు కూడ చాపల్యంవల్ల అటు ఇటు పరుగెత్తినా మళ్లీ ఆ శ్యామసుందరుని వైపే మళ్లుతుంది). కామధేనువు దగ్గర ఉండగా ఆ కామధేనువుయొక్క పాలను త్రాగకుండా మేకపాలను పితుకుకొని త్రాగుతారా? నీల మేఘశ్యాముణ్ణీ, బలరాముణ్ణి మాత్రమే భజిస్తూ ఉంటాను. వారిని విడచి ఇతర దేవతలను నా కలలో కూడ మనసులో భావించను" – అన్నాడు.

ఈ విధంగా సూరదాసు భక్తి పద్ధతిలో అనన్య భావాన్ని ప్రతిస్థలంలో గమనిస్తాము. కొందరు ఈ భక్తి పద్ధతిని **"వినయపద్ధతి"** అని, **"సఖ్యపద్ధతి"** అని అంటారు. కాని సూరదాసు భక్తి పద్ధతి **"అనన్యభక్తియే" శరణాగతియే.**

**తుమ్‌తజి ఔర్ కౌన్‌పై పాఊఁ**
**కాకై ద్వార్ జా ఇ సిర్ నా ఊఁ పర్‌కర్ కహాఁ బికా ఊఁ**
**ఐసే కో దాతా సమరథ్ హై? జాకేదియై అఘాఊఁ?**
**అన్తకావ్ తుమ్హరై సుమిరన్ గతి, అనత్ నహిఁ పా ఊఁ?** – అన్నాడు.



అంటే "భగవన్ నిన్ను విడచి నేను ఎవరి పాదాలను పట్టుకొనేది? ఎవరి దగ్గరకు వెళ్ళి శిరస్సు వంచి నమస్కరించేది? ఇతరులకు నన్ను నేను అమ్ముకుంటానా? నీ కంటె సమర్థుడైన దాత ఎవరున్నారు? అంత్యకాలంలో కూడ నీ స్మరణమే నాకు గతి. శరణ్యము. ఇతరత్రా ఎక్కడా నేను శరణుపొందలేను అన్నాడు.

భక్తుడు భగవత్‌కృపాకటాక్షాన్ని ఆకాంక్షించాలి. తానుగా ప్రయత్నించి ఏమి ఫలం? భగవానుడు అవ్యాజంగానే కృపను కటాక్షించేవాడు కదా! అనే సూరదాసు ఆకాంక్షించి అనన్యభావంతో స్వామి శరణువేడుతాడు. ఈ కృపాకటాక్షాన్నే తన ఆచార్యుడైన వల్లభాచార్యులు, తాను కూడ (సూరదాసు) "పుష్టి" అనే అన్నారు. "పుష్టి" అంటే "పోషణం" పోషణం తదను గ్రహః – అన్నారు. భగవదనుగ్రహమే పుష్టి కాదా పోషణం.

భగవానుని కృపాకటాక్షం లేకుండా ఎవరిలో కూడ "భక్తి" అనేది అంకురించనే అంకురించదు. సూరదాసు రచనలలో భగవానుని భక్తవాత్సల్యం. గుణగానం లేని స్థలం ఒక్కటి కూడ లేదు.

అయితే ఇలాంటి భక్తివలన భక్తుడు ముక్తిని పొందుదామని ఉద్దేశ్యమా? కాదు. కేవలం భక్తుడు భగవానుని భక్తి తనకు ఉండాలనే కోరుతాడు.

**"అప్నీ భక్తి దేహు భగవాన్" –** అని అంటాడు. హేభగవాన్ నాకు భక్తినే ప్రసాదించు, భక్తి కలిగి ఉండేలాచేయి అని అంటాడు.

ఇలాంటి భక్తి 9 రకాలు అని మనకు తెలుసు – శ్రవణము, కీర్తనము, స్మరణము, పాదసేవనము, అర్చన, వందనము, దాస్యము, సఖ్యము మరియు ఆత్మనివేదనము.

**శ్రవణం, కీర్తనం చైవ, స్మరణం, పాదసేవనం ।**
**అర్చనం, వందనం, దాస్యం, సఖ్య, మాత్మనివేదనం ॥** – అని

సూరదాసు భగవత్కథలను గురుముఖతః వినినాడు. "నామ సంకీర్తనం" సరేసరి. ఆయన గాయకుడే కదా!

ఇలా నామ సంకీర్తనం భక్తి సాధనమే. దానిని సూరదాసు 4 రకాలుగా విభజించుకున్నాడు. 1. గురుభక్తి 2. భగవల్లీలాగుణము 3. నిత్యనైమిత్తిక కర్మాచరణం 4. ధ్యానము. ఈ నాలుగు విధాలైన సంకీర్తనాన్ని సూరదాసు రచనలలో మనం స్పష్టంగా చూడకలుగుతాము.

సూరదాసు తన ఇష్టదైవమైన శ్రీకృష్ణుని లౌకిక నాయకుడు కాదని భావించాడు. తన ఇష్టదైవం యొక్క ప్రతిచర్య, ప్రతిలీల ఆధ్యాత్మికతతో కూడినదే అని భావించాడు. అందుచేత భగవానుని విషయంలో "అనురక్తి" ఉండటం సహజం. ఈ అనురక్తిని, శాంతము, ప్రీతి, ప్రేమ, దయ, మధుర అనే 5 రకాలుగా భావించాడు. వీటిలో శాంత భక్తిరూపం **"శాంతి"** ప్రీతిభక్తి యొక్క రూపం **''దాస్యము''**, ప్రేమభక్తిరూపం **''సఖ్యము''** దయ (అనుగ్రహము) యొక్క రూపం **వాత్సల్యము**, మధుర భక్తియొక్క రూపం **మాధుర్యం** అని పండితులు నిర్వచించారు. సూరదాసు భక్తిభావంలో ఇవన్నీ స్పష్టంగా కనిపిస్తాయి.

శాంత భక్తిలో వైరాగ్యానికి ప్రాధాన్యం ఉంటుంది. దాస్యభక్తిలో వినయానికి ప్రాధాన్యం ఉంటుంది. సఖ్యభక్తిలో సఖాభావం ఉంటుంది. అంటే భగవానుని భక్తుడు ఒక సఖునిగా భావిస్తాడు. గోపికలతో స్వామి విహారము, గోపకులతో గోపాలకుడుగా సంచరించటం అనే సందర్భాలలో ఈ సఖాభక్తిని పూర్తిగా గమనిస్తాము. "మధురభక్తి"ని భక్తికి పరాకాష్ఠగా సూరదాసు భావించాడు. దీనిలో భక్తునికి భగవానునిలో అతిదగ్గరగా సంబంధం ఉంటుంది. ఈ దశలో భక్తుడు తనను "పరకీయ" నాయికగా భావించి ఆరాధించే స్థాయికి చేరుతాడు. ఇది ఒక ఆధ్యాత్మిక మాధుర్య భావనయే.



శ్రీవైష్ణవ సంప్రదాయంలో శ్రీశఠకోప యతీంద్రులు, ఆండాళ్‌తల్లి, ప్రముఖంగా ఇలాంటి భక్తి భావాన్నే పొంది, అనుభవించి, వర్ణించారని మనం ఈ సందర్భంలో గుర్తుకు తెచ్చుకోవచ్చు.

ఇవన్నీ శాస్త్రీయ పద్ధతి ప్రకారం వర్ణించబడిన భక్తి పద్ధతులే.

సూరదాసు తన "సూరసాగర్" కావ్యంలో సఖాభక్తినే వాత్సల్యభక్తిగానూ, దయా భక్తి రూపాన్ని కూడ వాత్సల్య భక్తిగానూ, భావించి ఎంతో ఉన్నతంగా ప్రతిపాదించాడు. నందయశోదల భక్తిభావం పూర్తిగా ఇలాంటి వాత్సల్యభక్తియే. శ్రీకృష్ణుని బాల్యలీలలు అన్నీ కూడ ఈ వాత్సల్య భక్తితో కూడినవే. అందుచేతనే "వాత్సల్యభక్తి"ని ప్రతిపాదించటంలో సూరదాసు పరాకాష్ఠకు చెందినవాడు అని కీర్తింపబడినాడు. ఈ వాత్సల్యాన్ని ఒక రసస్థాయికి తెచ్చి **"వాత్సల్యరససమ్రాట్"** అని సూరదాసు కీర్తింపబడినాడు.

ఈ విధంగా సూరదాసు రచనలలో ''గీతికావ్యం'' అయిన "సూరసాగర్"లో భక్తియొక్క అన్ని రూపాలు వర్ణింపబడినాయి. అయితే వాత్సల్య భక్తి పూర్ణరూపం దాల్చింది.

సంక్షేపంగా సూరదాసు భక్తి పద్ధతిని గురించి ఇలా తెలుసుకున్నాము.

## 4. ''సూరసాగర్''లో ప్రతిపాద్యవస్తువు

15, 16 శతాబ్దాలలో మనదేశంలో సమాజం అల్లకల్లోంగా ఉన్నదని మనం తెలుసుకున్నాము. హిందువులకు స్వాతంత్ర్యం పోయింది. దేశమంతా ఇస్లాం సంస్కృతితో నిండిపోయింది. ఇక కవులు హిందువుల వీరగాథలను ఎలా గానంచేయగలుగుతారు? ప్రజలపై ఉదాసీనత ఆవరించిపోయింది. **राम और रहीम**(రామ్ ఔర్ రహీమ్ = రాముడు రహీము) ఒకటే అనే ఏకేశ్వర వాదం ప్రబలిపోయింది.దీని ప్రభావంవల్ల హిందువుల కట్టెదుట భీభత్సం ప్రతినిత్యం జరిగిపోతూ ఉండేది. నష్టపోయిన స్వాతంత్ర్యాన్ని

రక్షించుకుందామనే ఆకాంక్ష మాత్రం హిందువులలోనుండి తొలగిపోలేదు. తన సంస్కృతిని రక్షించుకోవటంకోసం హిందువులు భగవంతుని అవతారమైన శ్రీరాముణ్ణి, శ్రీకృష్ణుణ్ణి ఆలంబనంగా గ్రహించారు.

ఈ భావం దేశం అంతటా కనిపిస్తుంది. బెంగాలులో చైతన్య మహాప్రభువు, ఉత్తరభారతదేశంలో రామానందుడు, వల్లభాచార్యులు, దక్షిణభారత దేశంలో ఆళ్వారులు, నాయన్మారులు మొదలైనవారు, ప్రేమభావాన్ని కలిగించే కళాత్మక దృక్పథాన్ని అనుసరించి ప్రజలకు ఆనందాన్ని కలిగించే ప్రయత్నం చేశారు. ప్రేమసంగీతధారాప్రవాహం పెల్లుబికింది. "జయదేవుని" భక్తి గీతాలు ఇందుకు ఎంతో సహకరించాయి. మంచి అవకాశం లభించిందని దేశభాషల్లో ఇలాంటి సాహిత్యం వెల్లివిరిసింది. మిథిలా ప్రాంతంలో **"విద్యాపతి" గీతాలు** వ్యాపించాయి. వ్రజ భూమిలోని కుంజాలలో "వ్రజ" భాష మూగబోయిన మనస్సుల పై చిరుజల్లులు చల్లి ప్రేమభావాన్ని అంకురింపచేసింది. ఒకేసారి 8 వీణలు మ్రోగినాయి. ఈ కవులనే **"అష్టఛాప్"** అనినారు. వీరిలో ప్రధానుడు "మహాకవి సూరదాసు". ఈయన అంధుడే. అయినా తన గీతికావీణా తంత్రులతో ప్రేమభావాన్ని పలికించాడు. నిర్గుణ ఉపాసన విషయంలో అనాసక్తతను చాటుతూ సగుణ పరబ్రహ్మ అయిన శ్రీకృష్ణుని లీలావిశేషాలను చాటి వినిపించాడు.

సూరదాసు ప్రబంధకవి కాదు. ఆయన గీతి కవి. అంటే తన నాయకుడిని ఆయన లీలలను రకరకాల భావపరంపరలతో, రకరకాల సంగీతాత్మక ధ్వనులలో కీర్తించటమే ఆయన ధ్యేయం. గీతికావ్యంలో నాయకుని బేరితంలోని తనకు అత్యంత ప్రియతమమైన భాగాన్ని గ్రహించి దానిని మాత్రమే విశదంగా వ్యక్తీకరించటం జరుగుతుంది. "సూరసాగర్" కూడ అలాగే జరిగింది.

శ్రీమద్భాగవతంలోవలెనే సూరదాసుకూడ తన కావ్యాన్ని 12 స్కంధాలుగా విభజించుకొనినాడు. ఒకటవ స్కంధం నుంచి 12వ



స్కంధంవరకు కూడ భాగవతంలో వలెనే అనేక విషయాలను కీర్తించారు. అయితే దశమస్కంధాన్ని ప్రత్యేకంగా గ్రహించారు. దానిలో కూడ పూర్వభాగంలోని విషయాలను గానం చేయటంలోనే ప్రత్యేకతను చూపించారు "సూరసాగర్"కు. ఇదే "సూరసాగర్"కు ప్రాణం. దీనిలో శ్రీకృష్ణుని జననం మొదలుకొని ఆయన "మధురా" నగరం వెళ్లి ఉద్ధవుని ద్వారా వ్రజభూమిలోనే నివసించుచున్న గోపికల సమాచారాన్ని తెలుసుకొనేంతవరకే ఉన్నది. ఈ భాగాన్నే సూరదాసు విపులంగా రచించి గానం చేశారు. ఈ భాగంలోనే సూరదాసు ప్రముఖంగా భావించే వాత్సల్య, శృంగార రసాలకు ప్రాధాన్యం ఉన్నది. శ్రీకృష్ణలీలలను లౌకిక దృష్టితో చిత్రిస్తూనే అలౌకికతను కూడ ప్రతిపాదించారు. శ్రీకృష్ణుని సగుణ పరబ్రహ్మగా భావించిన సూరదాసు ఇలా ప్రతిపాదించటం సహజమేకదా!

సూరదాసుయొక్క "సూరసాగర్"లో ప్రతిపాద్యవస్తువు సగుణ పరబ్రహ్మ అవతారమైన శ్రీకృష్ణుని లీలలను గానం చేయటమే. అది కూడ ఆయనకు అత్యంతము ప్రియమైన శ్రీకృష్ణుని బాల్యలీలలు, యౌవనలీలలు మాత్రమే. ఆయన లక్ష్యం. శ్రీకృష్ణ పరమాత్మ యొక్క సంపూర్ణ జీవితాన్ని చిత్రించి లోక కల్యాణార్థం తన రచనను కొనసాగించటంకాదు. ప్రతి లీలలోనూ లోక కల్యాణభావననే చూడగలగటం వారివారి దృక్పథం అయితే కావచ్చు. సూరదాసు లక్ష్యం మాత్రం, తన మానసిక చక్షువులకు గోచరించే శ్రీకృష్ణుని లీలావిభూతిని హృదయంగమంగా భావించి ఆనందానుభూతిని పొందడమే. అయితే "రాసలీల"వంటి సంయోగ శృంగార వర్ణనలో ఏమాత్రం విశృంఖలతకు స్థానం ఇవ్వకుండా ఆధ్యాత్మిక భావననే ఆ లీలలో ప్రధానం అని తెలిపారు. వియోగ శృంగారానికి పరాకాష్ఠను పొందిన "భ్రమరగీతలు" అనే భాగంలో అన్యాపదేశంగా వ్యంగ్యోక్తులతో ప్రసంగిస్తూ గోపికలు, ఉద్ధవునితో తమ లక్ష్యమైన సగుణ పరబ్రహ్మ శ్రీకృష్ణుడే అని నిష్కర్షగా చెప్పి వారి ప్రేమపూరిత హృదయాల నిర్ణయాన్ని చూచి ఉద్ధవుని మనసుకరిగేలా చేశారు.

రాసలీల, భ్రమరగీతలు అనే వాటిని తరువాత తెలుసుకుందాం. ఏవ్యక్తి జీవితంలోనైనా, బాల్యకాలము, యౌవనకాలము ఎంతో మనోహరమైనవి అని తలుస్తాముకదా! కాబట్టే సూరదాసు శ్రీకృష్ణుని బాల్యాన్ని, యౌవనాన్ని మాత్రమే ప్రముఖంగా గ్రహించి, ఆ కాలాల్లో ఆ మహానుభావుని లీలలను కన్నులకు కట్టినట్టు చిత్రించాడు. వాత్సల్యానికి కూడ "రసస్థాయి"ని కల్పించి సూరదాసు, **"వాత్సల్యరససమ్రాట్"** అని కీర్తింపబడినాడు.

అయితే ఒకవ్యక్తి జీవితాన్ని సంపూర్ణంగా స్వీకరించి ఆలోచిస్తే మాత్రం, సూరదాసు దృక్పథం పరిమితం అనే అనిపిస్తుంది. కాని, ఆ పరిమితక్షేత్రంలోనే ఆయన ప్రతిభను పరిశీలిస్తే ఎంతో గొప్పది అని గ్రహించగలం.

శ్రీకృష్ణుని బాల్యలీలలకు సంబంధించిన పదాలు వాత్సల్యరసభరితాలు. అయితే అక్కడక్కడ అంటే పూతనను, తృణావర్తుని, శకటాసురుని ఇలా కంసునిచే పంపబడిన రాక్షసులను వారి వారి మాయారూపాలను గ్రహించి వారిని ఆ చిన్నివయసులో వధించటం అనే విషయాల్లో శ్రీకృష్ణుని అమానుషచర్యలు, అలౌకికత్వంకూడ వర్ణింపబడినాయి.

గోపికలప్రేమ సంబంధిత పదాలు శృంగార భరితాలు. ఆ శృంగారం భగవద్విషయకమైన రతిభావమే అని మనకు స్పష్టంగా తెలుస్తుంది. ఆయన వర్ణించిన శృంగారం విశృంఖలమైనదికాదు. అలౌకికమైనదే. భగవద్విషయక మైనదే.

శ్రీకృష్ణుని ప్రత్యేక లీలలను, ప్రత్యేక ప్రసంగాలను. ప్రత్యేక పదాలలో సూరదాసు చిత్రించారు. ఒక్కొక్కసారి, ఒకసారి వర్ణించిన సంఘటనలే, లీలలే మరొకసారి మరొకచోట కూడ ఆయన పదాలలో మనం గమనిస్తాము. ఇలా జరగటం కేవలం సూరదాసు మానసిక పరిపక్వత అని మాత్రమే తలచాలి. ఆ భావంలో లీనమైపోయి, అవే లీలలను ఎన్నిసార్లు పాడినా తనివితీరని స్థాయికి సూరదాసు మానసిక స్థితి వచ్చిఉంటుంది.



అని మాత్రమే తలచాలి. కాని ఈ పునరుక్తులు ఏమిటి? అని విసుగు పడకూడదు. ఆయన పదాలు దేనికి అదే స్వతంత్రమైనవి.

శ్రీకృష్ణుని చేష్టలు, బాల్యలీలలు, నవనీత చౌర్యం, అల్లరితనం, గోచారణలు మొదలైన వాటిని వాత్సల్యరసప్రధానంగానూ, శ్రీకృష్ణుని సౌందర్య వర్ణనం, రాధసౌందర్యవర్ణనం, యమునాతీర విహారాలు, నికుంజవిహారాలు, వనవిహారం మొదలైన వాటిని శృంగార రసప్రధానంగానూ, సూరదాసు గ్రహించాడు. రాసలీలను సంయోగశృంగారానికి ప్రతీకగాను, భ్రమరగీతలను వియోగశృంగారానికి ప్రతీకలుగానూ గ్రహించి వర్ణించారు.

అంతేకాదు మనం మరొక విషయాన్ని గుర్తుంచుకోవాలి. సూరదాసు కవిమాత్రమేకాదు. గొప్పసంగీతజ్ఞుడు కూడ, భగవత్ గుణగానం కీర్తించే వాడుకదా! ఒకే భావాన్ని విభిన్నమైన రాగరాగిణులతో వర్ణించాడు. దీనివల్ల వస్తుపరంగా ఆలోచిస్తే పునరుక్తి అనిపిస్తుందేమో కాని సంగీతపరంగా చూస్తే విభిన్నత్వమే కదా!

సూరదాసు లక్ష్యం సమాజంకాదు. శ్రీకృష్ణపరమాత్మయొక్క బాల్య యౌవన లీలలను చిత్రించటమే ఆయన ప్రధానధ్యేయం.

## 5. "సూరసాగర్"లో వాత్సల్య శృంగారాలు

సూరదాసు తన గీతికావ్యమైన "సూరసాగర్" గ్రంథంలో వాత్సల్యం. శృంగార రసాలకే ప్రాధాన్యతను ఇస్తూ శ్రీకృష్ణపరమాత్మ లీలలను వర్ణించాడని తెలుసుకున్నాము. ఇప్పుడు ఆ రెంటిని ఎలా పోషించాడో చూద్దాం-

### వాత్సల్యం

వాత్సల్యానికి ఆలంబనం బాలకృష్ణుని బాల్యలీలలు. ఆ బాల్యలీలలకు స్థానం ప్రముఖంగా నందయశోదల గృహమే. దానితోపాటు ఆ చుట్టు ప్రక్కల ఉండే గోపకుల గృహాలు కూడ శ్రీకృష్ణుని బాల్యలీలలతో ప్రభావితం అవుతాయి.

కృష్ణుడు తన చిన్ని చిన్ని పాదాలతో ఇంట్లో అటూ ఇటూ అడుగులువేస్తూ నడవటం, యశోదకు దొరకకుండా పారిపోతూ ఉండటం, వెన్నపెట్టుమని తల్లిని మారాం చేయటం మొదలైన లీలలు నందయశోదలను పులకితులను చేస్తాయి. మృద్భక్షణ చేసి తల్లికి తన నోరు చూపి సమస్త విశ్వాన్ని యశోదకు చూపే సంఘటన అత్యంత అపురూప దృశ్యం. ఆ దృశ్యం లౌకిక ఆనందంతో పాటు అలౌకిక ఆనందాన్ని కూడ కలుగచేస్తుంది.

పొరుగు ఇళ్లకు వెళ్లి వారి ఇళ్లలోనికి ప్రవేశించి వెన్నను దొంగిలించటం, ఆ సమయంలో ఒకవేళ పట్టుబడితే మా ఆవుదూడ ఎటో వెళ్లిపోయింది. మీ ఈ దుత్తలో ఉన్నదేమో అని వెదుకుతున్నాను అని సంజాయిషీ చెప్పుకొని, ఆ గోపికను చమత్కరించి నవ్వించటం, కోడలు ముఖాన వెన్నపులిమి తానే వెన్నతిని తన పై నీ కోడలు నేరం మోపుతున్నదని అత్తకు ఫిర్యాదు చేయటం మొదలైన బాల్యలీలలు, అల్లరి లీలలు ఇరుగుపొరుగు వారిని పులికితులను చేస్తాయి. ఆ యా సన్నివేశాలను చదివి మనం కూడ పులకించిపోతాము.

**సోభిత కర్ నవనీత్ లియే**
**ఘుట్ రవ్ చలత్, రేణు తన్ మండిత,**
**ముఖ్ దధి లేపలియే–**

అనే బాలకృష్ణుని వర్ణన మధురాతిమధురం. చేతిలో వెన్నముద్ద, శరీరం అంతాదుమ్ము, నోటికి పెరుగు పూసుకొని పారాడుతున్న ఆ శ్రీకృష్ణుని ముగ్ధమనోహర రూపాన్ని సూరదాసు ఎంత చక్కగా వర్ణించాడో చూశారా?

ఈ సందర్భంలో

**చేత వెన్నముద్ద చెంగల్వ పూదండ**
**బంగరు మొలత్రాడు పట్టు దట్టి.....**

అనే మహాకవి పోతనామాత్యుని చిత్రాత్మక శ్రీకృష్ణ దృశ్యం గుర్తుకువస్తున్నది కదా!



**కిల్ కిల్ కన్హ ఘుట్రుపని ఆవత్**

కిలకిలా నవ్వుతూ కన్నయ్య పారాడుతూ చకచకా వస్తున్నాడు... మన దగ్గరికి కన్నయ్య వస్తున్నట్లే ఉన్నది.

**మని మయ కనక నందకే ఆంగన్, బింబ పకరివే ధావత్**

నందుని భవనం కనక, మణిమయం, ఆ మణులతో తన ప్రతిబింబాన్ని చూస్తూ. ఆ ప్రతిబింబాన్ని పట్టుకోవటానికి శ్రీకృష్ణుడు పరుగెత్తుచున్నాడు.

ఈ సందర్భంలో శ్రీరాముని బాల్య సంఘటన ఒకటి గుర్తుకు వస్తున్నది. ఒకసారి శ్రీరాముడు బాల్యంలో ఉన్నప్పుడు, ఆకాశాన ప్రకాశించే చంద్రుణ్ణి పట్టుకుంటానని మారాం చేశాడట. ఏమి చేయాలో తోచక కౌసల్యాదేవి ఒక అద్దం ఆ బాలుని ఎదుట పెట్టిందట. చంద్రుడే దిగి వచ్చాడని తలచి ఆ బాలరాముడు ఆ చంద్రుణ్ణి పట్టుకోవటానికి ప్రయత్నించాడట. అప్పుడు ప్రేమతో "రామచంద్రా" అని పిలిచిందట. అప్పటి నుండి శ్రీరాముని "శ్రీరామచంద్రుడు అనే పేరు రూఢి అయిందట.

**యశోదా హరి పాలనే ఘలావై**
**హల్‌రావై, దులరావై, మల్హావై జోయి కోయి కఛుగావై**

యశోద శ్రీకృష్ణుని ఊయలలో పడుకోబెట్టింది. జోలపాట పాడుతున్నది. జో జో అంటూ ఉండగానే కన్నయ కన్నులు మూసుకున్నాడు. ఆ బాలుడు నిద్రలేస్తాడేమో అనుకున్న యశోద "ఏదోపాడుతున్నది". అన్నాడు సూరదాసు. అంటే పాటచివరన జోజో అంటూనే ఉహూ, ఉహూ, ఉహూ అని నెమ్మదిగా కూనిరాగంతీస్తూ జోలపాట పాడి పూర్తిచేసి ఆపింది – అని అర్థం. బాలకృష్ణుని నిద్రాభంగిమను, జోలపాటను ఇలా కన్నులకు కట్టినట్లు సజీవంగా చిత్రించటం **వాత్సల్యరస సమ్రాట్** అయిన సూరదాసుకే తగును.

ఈ సందర్భంలో

**"అధరం మధురం.... మధురాధిపతే రఖిరం మధురం–"**

అనే జయదేవుని అష్టపది గుర్తుకువస్తున్నది. వర్ణించి, వర్ణించి, చివరకు "అఖిలం మధురం" అన్నాడు. ఈ "అఖిలం" అంటే ఏమిటో రసజ్ఞులైన పాఠకులు వారి వారి స్థాయిని బట్టి ఊహించకలుగుతారు. ఇలాంటి జయదేవుని ప్రభావం సూరదాసుపై ఉన్నదని ఇదివరకే మనవిచేశాను.

ఇలాంటి బాలకృష్ణుని వర్ణనలు సూరసాగర్‌లో కోకొల్లలు-

**కాన్హ చలత్ పద్ ద్వై ద్వై ధరనీ**

కన్నయ్య ఇప్పుడిప్పుడే ఒక్కొక్క అడుగు భూమిపై వేస్తూ నడుస్తూ ఉన్నాడు.

**మయ్యా మైనహీం మాఖన్ ఖాయో**

అమ్మా! నేను మన్ను తినలేదే...

**మయ్యా మోహి దాఊ బహుత్ ఖిజాయో**

అమ్మా! నన్ను బలరాం అన్నయ్య ఏడిపిస్తున్నాడే!! - అని ఫిర్యాదు చేశాడు.

శ్రీకృష్ణుడు నీలమేఘశ్యాముడు కదా! బలరాముడు గౌరవర్ణుడు. దీన్ని ఒక కారణంగా తీసికొని బలరాముడు శ్రీకృష్ణునితో "కృష్ణా! నీవు నందయశోదలకు జన్మించిన వాడవుకాదురా. నిన్ను ఎక్కడినుంచో తీసికొని వచ్చి పెంచుకున్నారు రా" - అని అప్పుడప్పుడూ ఏడిపిస్తూ ఉండేవాడట. అందుకని - "అమ్మా! నన్ను రామన్నయ్య చాలా ఏడిపిస్తున్నాడు!" అని ఫిర్యాదు చేస్తాడు - ఎంత చక్కని బాలమనోవిజ్ఞానం!

ఇలా, వాత్సల్య రసప్రవాహంలో మనను సూరదాసు ఓలలాడించాడు. శ్రీకృష్ణుడు బాల్యజీవితాన్ని మూలమూలలా శోధించి వర్ణించి, ఆనందించి, తన్మయుడై, సూరదాసు మనను తన్మయులను చేశాడు.

ఇక మనం రెండవదైన "శృంగార"రసాన్ని గురించి తెలుసుకుందాం-



## శృంగారం

నవరసాలలో "శృంగార" రసం ప్రముఖమైనదని విజ్ఞులకు తెలిసినదే. ఈ శృంగార రసంకూడ సూరదాసు గీతికావ్యమైన "సూరసాగర్"లో పరిపక్వత చెంది ఉన్నది.

శృంగార రసం రెండు విధాలు. 1. సంయోగ శృంగారం 2. వియోగ శృంగారం. ఈ రెండురకాల శృంగార రసాలను సూరదాసు స్పృశించి తనివితీర వర్ణించాడు. పాఠకుల మనస్సులు ఆ యా భావపరంపరలలో తన్మయం అవుతాయి.

## సంయోగ శృంగారం

రాధాకృష్ణుల ప్రేమ ప్రసంగాలు, గోపికాకృష్ణుల ముచ్చట్లు, "సంయోగ శృంగారానికి" సంబంధించినవి. చిన్నతనంనుంచి రాధతో గోపికలతో కృష్ణుడు ఆడుకుంటూ ఉండేవాడు. అలా అలా వారిమధ్య ఆకర్షణ అధికమైంది. ప్రేమభావాలు అంకురించాయి. తరువాత జరిగిన సంఘటనలు అన్నీ ఈ భావాలకు దోహదం చేశాయి. యమునాతీర విహారం, కుంజవిహారం, జలకేళి, గోపికావస్త్రాపహరణం, దానలీల, ఊయలలు ఊగటం (ఊంజల్‌సేవ), రాసలీల మొదలైన ఎన్నో సంఘటనలు రాధాకృష్ణుల ప్రేమకలాపాల్లో గోపికలతో విహారాల్లో మనకు కనిపిస్తాయి. వీటినన్నిటిని సూరదాసు సజీవంగా చిత్రించాడు. ఇవన్నీ మానవీయాలగానే కనిపించినా ప్రతిదీ అలౌకికమే.

**"మేరే మన్ గోపాల్ హర్ యో రీ**
**చిత్‌వన్ హీ ఉర్ బైఠి, నైన్ మగ్ న జానౌ ధౌ కహా కర్ జోరీ"**

నా మనస్సును గోపాలుడు హరించాడే. ఆయన క్రీగంటి చూపులే నాకు ఎప్పుడూ గుర్తుకు వస్తున్నాయే. ఆయన నా మనస్సులోనే ఉన్నాడే... అని

రాధ తన తోటి గోపికతో చెప్పుకుంటుంది. ఆ గోపిక కూడ ఇలాగే తలుస్తూ ఉంటుందని రాధకు తెలియదేమో! ఎందుచేతనంటే గోవిందుడు తనవాడే అని భావిస్తున్నది కదా! గోవిందుడు అందరివాడు అనే భావమే రాధకు రాదు కదా!

శ్రీకృష్ణుని లీలల్లో ప్రధానమైనదిగా భావింపబడే "రాసలీల" అనే లీలను గురించి సంక్షిప్తంగా తెలుసుకుందాం.

రాసలీల అంటే "రసానికి సంబంధించిన లీల" అని అర్థం. "రసం" అంటే సాక్షాత్తు భగవానుడే – **"రసోవైసః"** – కదా! కాబట్టి రసస్వరూపుడైన భగవానుని లీలయే **"రాసలీల"** – రసస్వరూపుడైన ఆ భగవానుడు "ఆనందస్వరూపుడే" దివ్యానందముయొక్క అనుభూతియే "రాసలీల".

భౌతిక దృక్కోణంతో చూస్తే ఇదొక సామాన్య లీలే. కాని, లౌకిక దృక్కోణంతో పరిశీలిస్తే మాత్రం, భగవానుని అనంతకల్యాణ గుణాలను, భక్త పరవశతను విశదపరచే ఒక అద్భుతలీల, పవిత్రాతిపవిత్ర లీల.

"రాసలీల" ఒక నృత్య భంగిమ. రంగస్థలంపై అనేక నర్తకీమణులతో కలసిచేసే నృత్యం. అని వైదికసాహిత్యాన్ని బట్టి తెలుస్తుంది. రాసలీలనృత్యం శరత్ పూర్ణిమనాడు జరిగిందని భాగవత పురాణం నుండి మనకు తెలుస్తుంది. "బృందావనం"లో గోపికలతో కలసిచేసిన నృత్యమే "రాసలీల"గా వర్ణింపబడింది. **"రాసలీల" నాటికి శ్రీకృష్ణుని వయస్సు 8 సంవత్సరాలు. ఆ పురాణ పురుషునకు, ఆ శాశ్వత పరబ్రహ్మకు వయస్సేమిటి?** ఆ మహానుభావుడు దేవకీవసుదేవుల నందనుడై, వాసుదేవుడై అవతరించి 8 సంవత్సరాలు అని భావించాలి.

గోపికలు కాత్యాయనీ వ్రతంచేసి శ్రీకృష్ణుని తమకు భర్తగా చేయమని అంతకు పూర్వము ప్రార్థించినారు. ఆ విషయం శ్రీకృష్ణుని స్ఫురణకు వచ్చింది.



శ్రీరామావతార కాలంలో శ్రీరామచంద్రుని మోహనరూపాన్ని చూచి ఋషి పుంగవులు, తమకు ఆశ్లేష సౌభాగ్యాన్ని ప్రసాదించమని ప్రార్థించినారట. శ్రీరాముడు "పుంసాం మోహనరూపుడు" కదా. "ముందువచ్చే కృష్ణావతార సమయంలో మీ కోరికను తీరుస్తానని వాగ్దానం చేసినాడట. అందువలనే గోపికలు ఆ ఋషుల అవతారములేనట. ఋషులకు ఇచ్చిన వాగ్దానమును నెరవేర్చవలెనని శ్రీకృష్ణుని స్ఫురణకు వచ్చింది.

శరత్ పూర్ణిమ నాటి రేయి మనోహరమైన ఆ రాసనృత్యానికి తగిన సమయం అని శ్రీకృష్ణుడు భావించినాడు. వారికోర్కెను నెరవేర్చదలచినాడు. గోపికల సాహచర్యాన్ని అభిలషించాడు. వారిని ఆనందింపచేయదలచాడు.

శ్రీకృష్ణుని ఈ "రాసలీల" సాధారణ యువతీ యువకులు చేయు నృత్యము కాదు. సామాన్య దృష్టితో చూస్తే ఈ నృత్యము భౌతికపరిధిలో కనిపిస్తుంది. కాని ప్రత్యేకమైన అంతర్ దృష్టితో పరిశీలిస్తే ఈ నృత్యము కేవలం ఆత్మ, పరమాత్మల సాయుజ్యమే.

ఈ అసాధారణ రాసలీలా నృత్యం – శ్రీకృష్ణుని వేణునాదంతో, ప్రణవనాదంతో ఆకర్షింపబడి శ్రీకృష్ణుని చేరిన గోపికలు, ఆ స్వామితో కలిసిచేసే ఈ అసాధారణ నృత్యం – గోపికలదివ్యవాంఛాసంతృప్తి మూలకమే అని గుర్తించవలెను. **పరమాత్మను తృప్తిపరచటానికి పరమాత్మ ద్వారా తాము (ఆత్మలు) తృప్తిచెందటానికి ఉపకరించే ఈ "రాసలీల" ఆధ్యాత్మిక నృత్యమే కాని, భౌతికనృత్యం కాదని తలచవలెను.**

శ్రీకృష్ణుడు తన 8 సంవత్సరముల వయసులోనే గోపికలతో కలసి రాసలీలానృత్యమును జరిపినాడని తెలుసుకొనినాము – వచ్చిన ఆ గోపికలలో కొందరు వివాహితలు, కొందరు సంతానవతులు, కొందరు కన్యలు – వీరందరు శ్రీకృష్ణుని భర్తగా కోరి రాసలీలకు వచ్చినారనుట ఎంత అశ్లీలము? కాబట్టి వీరి భర్తృవాంఛ భౌతికమైనది కాదు.

భగవానునితో భక్తునకు, పరమాత్మతో జీవాత్మకు కల నవవిధ సంబంధాలలో "భర్తృభార్యా సంబంధము" కూడ ఒకటి. ఆత్మలను భరించేవాడు పరమాత్మయే. ఈ యధార్థమునే రాసలీలా ప్రసంగములో గుర్తుంచుకొనవలెను. గోపికలు సర్వాత్మనా శరణాగతులైన వారు. అలాంటి ఆత్మలు. ఈ ఆత్మ పరమాత్మల సాయుజ్యస్థితికి మరొకరూపమే ఈ రాసలీల.

శ్రీకృష్ణుని మురళీ గానము గోపికలను మైమరపించింది. గోపికల గీతములు మిన్నుముట్టినవి. ఒక్కొక్క గోపికకు ఒక్కొక్క కృష్ణుడుగా శ్రీకృష్ణుడు రాసలీలను నిర్వర్తించినాడు. వారిని ఆనందపులకితులను చేసినాడు. గోపికలందరు తమ దివ్యదేహములతోనే నృత్యము చేసినారు. వారి వారి పాంచభౌతిక శరీరములు ఎక్కడివి అక్కడే ఉన్నాయి. భగవానునికి చెందిన ఆధ్యాత్మిక శరీరములు – అవే దివ్యశరీరములు – ఆత్మలు – శ్రీకృష్ణునితో నృత్యము చేసినాయి. రాసలీలలో పాల్గొనినాయి. తాదాత్మ్యం పొందినాయి.

బృందావనం ఒక సహస్రదళ కమలం. గోపికలు జీవులు కృష్ణపరమాత్మ ముక్తపురుషోత్తముడు. ఈ జీవులు అట్టి పరమాత్మతో క్రీడిస్తూ, ఆ స్వామికి ఆనందాన్ని కలిగిస్తూ, తాము ఆనందిస్తూ ఉంటారు. భగవానుడు మధ్య చుట్టూ గోపికలు. భగవానునితో రాధ, ఇలా అంతా కృష్ణమయమే. ఈ రాసలీలలో పాల్గొనటానికి దేవగంధర్వులు, శివపార్వతులు కూడ వచ్చినారట.

మధ్యలో రాధకు గర్వం కలుగుతుంది. తానే ఈ రాసలీలకు ప్రధానం అనే భావం కలుగుతుంది. శ్రీకృష్ణ పరమాత్మ గుర్తించాడు. ఆమె గర్వాన్ని తొలగించటానికి స్వామి వెంటనే అదృశ్యం అయినాడు. రాధ దిగ్భ్రాంతురాలు అయింది. తన మానసిక చాంచల్యాన్ని, తన గర్వాన్ని తెలుసుకున్నది. అంటే నిజంగా ఇలాంటి గర్వము భక్తునికి కలిగినప్పుడు భగవంతునినుంచి భక్తుణ్ణి ఆ గర్వం వేరుచేస్తుంది అని గుర్తించాలి. రాధ పశ్చాత్తప్తురాలు అవుతుంది. శ్రీకృష్ణుడు ప్రత్యక్షం అవుతాడు. అంటే భక్తుడు తన అపరాధాన్ని తెలుసుకొని



పశ్చాత్తప్తుడు అయితే, భగవానుడు అతనిని కనికరించి ప్రత్యక్షమై మళ్లీ యధారూపంలో ఉంటాడని అర్థం.

ఇలా సూరదాసు "రాసలీల" అనే లీలను అతిమనోహరంగా, అత్యుదాత్తంగా, అధ్యాత్మికంగా చిత్రించాడు. సంయోగశృంగారానికి ఆధ్యాత్మికతను మేళవించి ఆ సన్నివేశాన్ని ఉత్తమోత్తమం చేశాడు.

ఇలాగే మిగతాకొన్ని లీలలను సంక్షిప్తంగా తెలుసుకుందాం.

మరొకటి గోపికా వస్త్రాపహరణలీల. ఈ లీలలో గోపికలను ఆవరించియున్న మాయా ఆవరణం తొలగించబడి సర్వస్వం భగవానునిదే అనే నిర్ణయానికి గోపికలువచ్చే ఆత్మ సమర్పణ భావం వర్ణించబడింది.

మరొకటి దానలీల. భగవానుని అనుగ్రహం కలగటానికి మనం మన ఇంద్రియ వ్యాపారాలన్నిటినీ ఆయనకు మనం దానం చేయాలి. అప్పుడే మనం సుఖదుఃఖాలనుండి నిర్లిప్తులం అవుతాము. భగవానుని అనుగ్రహం లభిస్తుంది. ఈ లీలచివరలో శ్రీకృష్ణుడు గోపికల వద్దకు వెళ్లి పాలు, పెరుగులను స్వీకరిస్తాడు. వారినుండి లాక్కుంటాడు. భగవంతునికి భక్తునికి భేదమేలేని స్థితి వస్తుంది.

మరొకటి **పన్‌ఘట్‌లీల** – అంటే యమునాతటం వద్ద జరిగే లీల. ఈ లీల విచిత్రమైనది. ఒక గోపకుని తమ మధ్యలో నిలబెట్టి అతనిని ఒక వైపు గోపికలు, మరొకవైపు శ్రీకృష్ణుడు లాగుతూ ఉంటారు. ఒక వైపు సంసారబంధం, మరొకవైపు పరమాత్మతో కలిగే సుఖం. ఈ రెంటి మధ్య ఉండి ఆ భక్తుడు అయోమయంలో పడిపోతాడు. ఈ ఆట కొంతసేపు సాగుతుంది. తరువాత శ్రీకృష్ణుడు దయతలచి ఆ భక్తుణ్ణి బలంగా తన వైపుకులాగుకుంటాడు. ఆ భక్తుడు అమితానందాన్ని పొందుతాడు.

మరొకటి **ఊంజల్ లీల** – అంటే ఊయల లీల. ఈ లీలలో భగవానుని శ్రీకృష్ణుని నాట్యభంగిమలు వర్ణింపబడినాయి. తాను నృత్యలీలలను

ప్రదర్శించటానికి విశ్వకర్మను ఒక ఊయలను తయారు చేయమన్నాడు. ఊయల సిద్ధమై వచ్చినది. శ్రీకృష్ణుడు రాధతో కలిసి ఆ ఊయలపై కూర్చొని ఊగుతాడు. లలిత, విశాఖ అనే సఖులు ఆ ఊయలను ఊపుతూ ఉంటారు. దేవతలు కూడ ఈ ఊయలలీల చూడటానికి వస్తారట. అందరూ తన్మయులు అవుతారు.

ఈ ఊయల లీల నిత్యమైనదే. వైకుంఠధామంలో పరమాత్మ ప్రతిరోజు ఊగుతూ నిత్యసూరుల సేవలు స్వీకరిస్తూ ఉండేదే. దానినే ఇప్పుడు ఇక్కడ బృందావనంలో కూడ కల్పించుకొని శ్రీకృష్ణపరమాత్మ ఊగినాడు. ఈ ఊంజల లీలను చదివి మానసిక చక్షువులతో దర్శించి, పాఠకుడు తానుకూడ పరమాత్మ సేవలో పాల్గొనినట్లే భావిస్తాడు.

ఇలాగే సంయోగశృంగారంలో సాగే ప్రతిలీల ఆధ్యాత్మికతో కూడినదే. మానవీయ లీలలకు అతీతమైనదే.

## వియోగ శృంగారం

సంయోగశృంగార వర్ణనలవలెనే వియోగశృంగార వర్ణనలను కూడ సూరదాసు ఉత్తమోత్తమంగా చిత్రించాడు. దీనిని “విప్రలంభ శృంగారం” అని కూడ అంటారు.

ఎనిమిదేండ్ల వయస్సులో రాసలీలాఘట్టం పూర్తయిన తర్వాత శ్రీకృష్ణుడు మధురానగరానికి వెళ్లిపోయాడు. అక్కడి దుష్టశిక్షణ, శిష్టరక్షణ పూర్తి అయినాయి. ఇక అక్కడి రాజకీయాల్లో మునిగిపోయాడు. అప్పుడప్పుడూ గోపికలు, బృందావన క్రీడలు జ్ఞాపకంవస్తూనే ఉండేవి. ఇటు గోపికలు, నంద యశోదలు కూడ శ్రీకృష్ణుని ఎడబాటుతో దుఃఖసాగరంలో మునిగిపోయారు.

మొదట మనం వ్రజ భూమిలో ఉండే వారి విషయం చూద్దాం.

గోపికలు శ్రీకృష్ణ విరహంలో పడిపోయారు. విరహంతో ఉన్న గోపికలతోపాటు, రాధతోపాటు బృందావనంలోని లతలు కూడ



వాడిపోయినాయట. యమునానదీజలం విరహతాపంతోటే నల్లబడిపోయిందట (యమునానదీ జలం నీలి రంగులో కనిపించటం ప్రసిద్ధి) ఆవులు కృష్ణవిరహంతో క్షీణించిపోయినాయట. వ్రజభూమిపై ఉన్న సస్యశ్యామలమైన ప్రదేశాలన్నీ శుష్కించిపోయాయట. ఇలా ప్రకృతి పూర్తిగా సూరదాసుయొక్క హృదయగతమైన విరహాన్నే అనుసరించింది. కృష్ణుడు మధురకు వెళ్లే సమయంలోకాని తరువాతకాని వ్రజనివాసుల హృదయస్థితి వర్ణనాతీతం. హృదయాలను ద్రవింపచేస్తుంది.

యశోదానందుల పరిస్థితి చెప్పనలవేకాదు. పుత్రా, పుత్రా, అనుకుంటూ యశోద మూర్ఛిల్లేపోయింది. గోపికలు, రాధ, చిత్ర ప్రతిమలుగా ఉండిపోయారు. ఎవరూ మరొకరితో మాట్లాడే స్థితిలోనే లేరు. కన్నీరు మున్నీరై ప్రవహించింది. అక్కడినుంచి ఇళ్లకు వెళ్లాలంటే పాదాలను కదలించలేకపోయారు. వారి మనస్సు కృష్ణునితోనే వెళ్లిపోయింది. ఆనందాన్ని కలిగించే వస్తువులు కూడ దుఃఖాన్నే కలిగించాయి. ఇదీ శ్రీకృష్ణుని మధురానగర ప్రయాణసన్నివేశము. శ్రీకృష్ణుడు మధురకు వెళ్లిపోయాడు.

గోపికల ఆవేదన చూడండి–

**బిను గోపాల్ బైరిని భయీ కుంజై**

గోపాలకృష్ణుడు లేనందువలన పొదరిళ్లు అన్నీశూన్యం అయి చిన్నపోయినాయి.

**తబ్ యే లతా లగతి అతి శీతల్,**
**అబ్ భయీ విషమ్ జ్వాల్ కి పుంజై**

అప్పుడు శ్రీకృష్ణుడు మావద్ద ఉన్నప్పుడు ఇక్కడి లతాకుంజాలు ఎంతో చల్లగా అనిపించేవి. ఇప్పుడు అవే ఆయన వియోగంలో భీషణమైన అగ్నిజ్వాలలను చిమ్ముతున్నట్లున్నాయి.

ప్రకృతిని చూసి గోపికలు నిష్ఠూరాలు ఆడుతారు.

**మధువన్, తుమ్ కహత్ హరే**

ఓ మధువనమా! నీవు ఇంకా ఎందుకు పచ్చగా ఉన్నావు? కృష్ణుని విరహంలో నీవు వాడిపోవటంలేదా - అని నిష్ఠూరాలు ఆడుతారు.

ప్రియుడు లేనందున రాత్రి, పామువలె నల్లగా కనిపిస్తున్నది అంటారు.

**పియా బిన్ సాంపిన్ కాలీ రాత్**

రాత్రింబగళ్లు మా కన్నులు వర్షిస్తూనే ఉన్నాయి - అంటారు గోపికలు.

**జబ్ హి కట్యో యే స్వామ్ నహీ**
**నిసిదిన్ బర్సత్ నైన్ హమారే**
**పరీమూరఛి ధరనీ బ్రజబాలా జో తహీనహీం సునాహీం**

ఘనశ్యాముడు లేడా! అనుకుంటూ గోపికలు మూర్ఛపోయి నేలమీద ఎక్కడివారు అక్కడే పడిపోయారు.

ఇలా విరహపక్ష వర్ణనలు అన్నీ హృదయవిదారకాలే.

ఇలాంటి వర్ణనలు ఏకపక్షంగా గోపికలవరకే పరిమితమైలేవు. మధురకు వెళ్లిపోయిన తరువాత శ్రీకృష్ణుని మానసిక పరిస్థితి కూడ ఇలాగే ఉన్నదని సూరదాసు వర్ణించాడు. తననుండి దూరం అయిన ఆత్మల విషయంలో పరమాత్మ ఎలా ఆందోళన చెందుతాడో దీనిని బట్టి మనం గమనించవచ్చు.

“సూరదాసు” గ్రంథంలో అతిముఖ్యంగా భావించబడే సన్నివేశం “భ్రమరగీతలు”. ఈ భ్రమరగీతల ప్రసంగాన్ని కృష్ణభక్తి సాహిత్యంలో చాలా మంది వర్ణించారు. కాని, సూరదాసు ..... “భ్రమరగీతలు” ఒక విలక్షణతను సంతరించుకున్నాయని సాహిత్యవేత్తల అభిప్రాయం.

శ్రీకృష్ణుడు మధురకు వచ్చినాడని (వెళ్లిపోయినాడని) చెప్పుకున్నాం కదా! అప్పటినుండి ఆయన మళ్లీ గోకులానికి వెళ్లనే వెళ్లలేకపోయాడు.



కాబట్టి, అప్పుడప్పుడు గోకులం జ్ఞాపకంవస్తూ ఉండేది. ఎంతో బాధపడేవాడు. శ్రీకృష్ణుడు తన మానసిక పరిస్థితిని మధురలో తనకు ప్రియ మిత్రుడైన ఉద్ధవునితో ఇలా చెప్పుకున్నాడు.

**సునహు ఉపంగసుత్ మోహి నబిరురత్ బ్రజబాసీ సుఖ్‌దాయీ,**
**యహ్ చిత్‌హాత్ జా ఊం మై అచ్‌హీ, యహాం నహీం మన్ లాగత్-**

ఉద్ధవా! నామాట కొంచెం విను. నాకు ఎంతో సుఖాన్ని కలిగించిన ఆ వ్రజభూమిని మరువలేకున్నాను. ఇప్పటికిప్పుడే అక్కడ వాలిపోదామని అనిపిస్తున్నది. ఇక్కడ (మధురలో) నా మనస్సు ఏమీ బాగాలేదు” - అని అన్నాడు.

**గోప సుగ్వాల్, గాయ్, బన్‌చారన్, అతి దుఖ్‌పాయో త్యజత్,**
**కహాం మాఖన్‌చోరి, కహాం జసుమతి పుత్‌జేంబ్ కరి ప్రేమ్**

ఆ గోపబాలకులు ఆ ఆవులను కాయటం, ఆ వెన్న దొంగిలించటం, యశోద పుత్రప్రేమ - ఇవన్నీ జ్ఞాపకంవస్తే ఎంతో దుఃఖం కలుగుతున్నది. ఇక గోపికలు గుర్తుకు వచ్చారు. విహారాలు గుర్తుకు వచ్చాయి అన్నాడు.

**వహ్ లతాగన్ సంగ్‌గోపిన్ సుధికరత్ పఛతాత్,**
**కహాం వహ్ కృషభాను - తనయా, పరమసుందర్‌గాత్**
**సురతి ఆయే రాస్ - రస్‌కీ, అధికజియ అకులాత్**

ఆ లతాగృహాలు గోపికలతో అక్కడి విహారాలు, గుర్తుకువస్తే, ఎంతో బాధ కలుగుతున్నది. వృషభాను కుమారి అయిన రాధసౌందర్యం గుర్తుకు వస్తే ఎంత ఆవేదన కలుగుతున్నదో! - అని శ్రీకృష్ణుడు ఉద్ధవునితో తన విరహ వ్యధను చెప్పుకున్నాడు.

అక్కడ గోపికలు కూడ తన వలెనే విరహవ్యధ భరిస్తూ ఉండవచ్చు అని శ్రీకృష్ణుడు తలచాడు. వారికి ఓదార్పుగా ఉంటుందని తాను ఒక సందేశాన్ని పంపుదామని అనుకున్నాడు. దానికి ఉద్ధవుడే తగిన వ్యక్తి అని

తలచాడు. ఆయన వాక్ప్రౌఢిమ చాలా గొప్పది, విరహవేదనతో ఉన్న గోపికల వేదనను తన మాటలతో తగ్గించకలడేమో చూద్దాం అనుకున్నాడు.

శ్రీకృష్ణుడు ఇలా ఉద్ధవుణ్ణే పంపటానికి మరోకారణంకూడ ఉన్నది. నిర్గుణవాదంలో తాను మహాపండితుడనని, ఎటువంటి సగుణవాదులనైనా తన వాక్చాతుర్యంతో పరాజితులను చేసి తన వాదాన్నే అంగీకరించేటట్లు చేయగలననే అహంకారం ఉండేది. శ్రీకృష్ణపరమాత్మ ఆయనయొక్క ఆ అహంకారాన్ని తొలగించాలి అని అనుకున్నాడు.

శ్రీకృష్ణుడు గోపికలపేరుతో ఒక ఉత్తరం వ్రాశాడు. దాన్ని ఉద్ధవునితో గోకులానికి పంపాడు.

ఉద్ధవుడు గోకులం వచ్చాడు. మొదట యశోదానందులను కలిశాడు. మీక్షేమ సమాచారం తెలుసుకొని రమ్మని శ్రీకృష్ణుడు తనను పంపాడని చెప్పాడు. శ్రీకృష్ణుని సమాచారం తెచ్చిన ఆ ఉద్ధవుణ్ణి చూచి ఆదరించారు. శ్రీకృష్ణుణ్ణి చూచినంత సంతోషించారు.

తరువాత గోపికల వద్దకు వెళదామని అనుకున్నాడు. ఇంతలో గోపికలందరు ఉద్ధవుడి రథాన్ని చూచి కృష్ణుడే వచ్చాడని తలచి బిరబిరా వచ్చారు. ఉద్ధవుణ్ణి చూశారు. నిరాశపడినారు. ఉద్ధవుడు కూడ వారిని చూశాడు. "శ్రీకృష్ణుడు మీకు ఒక సందేశం పంపాడు. దానిని తెచ్చాను. పదండి. అక్కడ కూర్చొని మాట్లాడుకుందాం" అని చెప్పి వారిని తీసుకొని మరొక ఏకాంత ప్రదేశానికి వెళ్లాడు.

ఉద్ధవుడు శ్రీకృష్ణుని ఉత్తరాన్ని గోపికలకు ఇచ్చాడు. గోపికలు తన్మయులు అయిపోయారు.

**నిరఖత్ అంక్ శ్యామసుందర్‌కే, బార్ బార్ లావత్ ఛాతీ,**
**లోచన్ జల్, కాగద్ మసి మిలికై, హై గయీ స్యామ్ స్యామ్ కీ పాతీ**



గోపికలు ఆ ఉత్తరాన్ని చూశారు. కన్నీళ్లు వచ్చాయి. ఆ ఉత్తరాన్ని మాటిమాటికీ తమ హృదయాలకు హత్తుకున్నారు. చదువుదామని అనుకున్నారు. కాని కన్నీరు కదా! అక్షరాలు కనిపించలేదు. అంతానల్లగా కనిపించింది. కృష్ణుడు గుర్తుకు వచ్చాడు. కృష్ణుణ్ణి చూసినట్లే అనుకున్నారు.

ఉద్ధవుడు గోపికల పరిస్థితిని గమనించాడు. మెల్లగా తాను చెబుదామని అనుకున్న మాటలను ప్రారంభించాడు. పరమాత్మ నిర్గుణుడని, నిరాకారుడని తన వాదాన్ని చక్కని మాటలతో వినిపించాడు.

కాని గోపికలు ఉద్ధవుని మాటలను పట్టించుకోలేదు. తమ ఆవేదనను తెలుపుకోవటం ప్రారంభించారు.

**గోకుల్ సబై గోపాల్ ఉపాసీ**
**కా అపరాధ్ జోగలిఖి పఠ్‌పత్, ప్రేమ్ భజన్ తజి కరత్ ఉదాసీ**

గోకులం మొత్తం ఆయననే ఉపాసిస్తున్నది. ఏమి అపరాధం చేశామో, కాని మా ప్రేమను మరచిపోయి మా కన్నయ్య ఇలా ఉదాసీనంగా ఉన్నాడు? అన్నారు.

**అంఖియా హరి దర్‌సన్ కీ భూఖీ**

మా కన్నులు కన్నయ్యను దర్శించుకోవాలని ఆకలితో ఎదురుచూపులు చూస్తున్నాయి. హృదయంలో వేగరపాటు కమ్ముకొనింది అన్నారు.

**ఊధో, స్యామహి తుమ్ లే ఆవో**
**బ్రజ జన్ చాతక్ ప్యాసే మరత్ హై, స్వాతిబిందు బిర్‌సావో-**

ఉద్ధవా! నీవు మా శ్యామసుందరునే తీసికొని రా! వ్రజనివాసులమైన మేమందరం చాతకపక్షులవలె నిరీక్షిస్తున్నాము. మాపై స్వాతిబిందువులను కురిపించు అన్నారు.

**ఊధో అబ్ నహి స్యామ్ హమారే**

ఉద్ధవా! ఇక ఆ శ్యాముడు మావాడుకాదు అనిపిస్తున్నది - అని గోపికలు తమ నైరాశ్యాన్ని చెప్పుకున్నారు.

ఇంతలో అక్కడికి ఒక "భ్రమరం" (తుమ్మెద) వచ్చింది. దానిని చూచి గోపికలు అన్యాపదేశంగా ఆ భ్రమరాన్నే సంబోధిస్తూ మాట్లాడినారు. భ్రమరం నల్లనిదే. శ్రీకృష్ణుడు నల్లనివాడే. ఇటు ఉద్ధవుడు కూడ నల్లనివాడే. అందుచేతనే గోపికలు భ్రమరాన్ని సంబోధిస్తూ అన్యాపదేశంగా ఇటు ఉద్ధవుణ్ణి, అటు శ్రీకృష్ణుణ్ణి నిష్ఠురోక్తులాడారు. **భ్రమరాన్ని మధ్యవర్తిగా ఉంచుకొని మాట్లాడిన మాటలు కనుక ఈ ప్రసంగానికి, "భ్రమరగీతలు" అని నామం సార్థకం అయిందని అన్నారు.**

**రహు రే మధుకర్, మధు మత్ వారే,**
**కహా కరౌం నిర్గున్ లై కై హౌం? జీవన్హు కాన్హ హమార్.**

ఓ భ్రమరమా! నీవు బాగా మధువును గ్రోలి మత్తెక్కి ఉన్నట్లు ఉన్నావు. అందుకే మా కన్నయ్యను నిర్గుణుడు అంటున్నావు. సుందరాకారుడై మాతోకలసి మా మధ్యనే ఉన్న కన్నయ్య నిరాకారుడు ఎలా అవుతాడు? ఏ గుణములు లేనివాడు ఎలా అవుతాడు? అని ఉద్ధవుణ్ణి నిలదీశాడు.

**ఊధో మన్ నాహి దస్‌బీస్,**
**ఏక్ హుతో సో గయో, స్యామ్ సంగ్, కో ఆరాధౌ ఈన్?**

ఉద్ధవా! మనస్సు పదివిధాలుగా, ఇరువైవిధాలుగా ఉండదు. అది ఒక్కటే. మాకు కూడ ఆ ఒక్క మనస్సే ఉండేది. అది ఇదివరకే కృష్ణునితో వెళ్లిపోయింది. ఇక మేము ఎలా నీ నిర్గుణుణ్ణి ఎలా ఆరాధించేము? అన్నాడు.

ఉద్ధవుని ఉపదేశాలు వినీ వినీ విసుగెత్తి

**నిర్గున్ కౌన్ దేస్ కే వాసీ?**



నిర్గుణుడు నిర్గుణుడు అంటున్నావే? ఆయన ఏ దేశంలో ఉంటాడు? మాతో కలిసి మెలసి ఆడుకుంటూ ఉండే మా కన్నయ్యను నిర్గుణుడు అని ఎలా అంటున్నావయ్యా? అని విసుక్కున్నారు.

ఆధ్యాత్మిక జ్ఞానం ఉన్న గోపిక - "ఓ భ్రమరమా! (ఉద్ధవా!) "నిర్గుణుడు" అంటున్నావు కదా అంటే - "హేయగుణాలులేనివాడు-" అని అర్థం చేసుకో. అలాగే "నిరాకారుడు" అంటున్నావు కదా! అంటే ఒక నిర్దిష్టమైన ఆకారమేకాదు అనేక ఆకారాలు ధరించినవాడు- అని అర్థంచేసుకో - అని బోధించింది. అందుకే ఆయనను-

**"సహస్ర శీర్షా పురుషః - సహస్రాక్షః సహస్రపాత్"** - అని వేదాలు స్తుతించినాయి అని గుర్తుకు తెచ్చుకో అన్నది.

చివరకు రాధాదేవి ఇలా అన్నాది. "ఓ భ్రమరమా! (ఉద్ధవా!) మా కన్నయ్య మనోహరాకారుడు. ఆయన మురళీగానం ఎంత మధురమో నీకు తెలియునా? ఆ గానంతో మమ్మల్ని ఎంత ఆందోళితులను చేసేవాడో నీకు తెలుసా? మాకు కృష్ణలీలలు స్మరణకురాని క్షణమేలేదు. మా సమస్త ధర్మాలను ఆయనయందే నిక్షిప్తం చేసినాము. ఇలా ఆత్మసమర్పణం చేసిన మా అంతరంగాలను, మధురకు వెళ్లి నీవు మా కన్నయ్యకు తెలియపరచు. ఆయనను త్వరగా వచ్చి మమ్మల్ని కలవమని ఆ "భ్రమరం" (శ్రీకృష్ణుడు)తో చెప్పు" అని అన్నది.

ఉద్ధవుడు గోపికల ప్రేమ భావాన్ని చూచి ఆశ్చర్యపోయినాడు. భక్తి అంటే ఏమిటో, ఆత్మ సమర్పణ భావం అంటే ఏమిటో, సగుణోపాసన ఎంత ఉత్కృష్టమైనదో, ఎంత మధురమైనదో, ఎంత సౌలభ్యమైనదో గ్రహించాడు.

మధురకు తిరిగి వెళ్లాడు. గోపికల మనోభావాలను, రాధికాసందేశాన్ని విశదీకరించాడు - "ప్రభూ! గోపికల ఆంతర్యంముందు నా వాక్చాతుర్యం

ఏమీ పనిచేయలేదు. వారి అనన్యత్వం నన్ను ముగ్ధుణ్ణి చేసింది" అని విన్నవించాడు. శ్రీకృష్ణుడు నవ్వుకున్నాడు.

ఇలా విప్రలంభ శృంగారంలోని సమస్త అంతర్దశలను సూరదాసు "భ్రమరగీతలు" అనే సన్నివేశంలో వర్ణించాడు. ప్రముఖంగా "ప్రవాస విప్రలంభ శృంగారాన్ని" వర్ణించి ఆ నీలమేఘశ్యాముని భక్త పరతంత్రతను స్పష్టపరచి సూరదాసు కృతార్థుడైనాడని సాహిత్య మర్మజ్ఞుల అభిప్రాయం.

## 6. "సూరసాగర్"లో "కావ్యకళ"

సూరదాసు తన "సూరసాగర్" అనే గ్రంథంలో నీలమేఘశ్యాముడు అయిన శ్రీకృష్ణుని లీలలనే ప్రధానంగా గ్రహించి వర్ణించాడని తెలుసుకున్నాము. ఈ రచనలో సూరదాసుపై శ్రీమద్భాగవత ప్రభావం ఉన్నదని స్కంధవిభజనను బట్టి ఆ యా స్కంధాలలో రచించిన విషయాలను బట్టి తెలుస్తున్నది.

శ్రీమద్భాగవతంయొక్క ముఖ్య విషయం భగవానుని అన్ని అవతారాలను వర్ణించి ఆ పరమాత్మయొక్క అపరిమిత శక్తిని చూపి తాను ఆనందడోలికలలో ఊగి, ప్రశాంత మనస్కుడు కావటమే అని మనకు తెలుస్తున్నది. అయినా శ్రీకృష్ణావతారాన్నే విశేషంగా దృష్టిలో ఉంచుకున్నాడని కూడ, దశమస్కంధాన్ని బట్టి తెలుస్తుంది.

సూరదాసుకూడ అదే పనిచేశాడు. దశమస్కంధంలోని పూర్వభాగాన్నే ప్రధానంగా తీసికొని శ్రీకృష్ణుడు మధురకు వెళ్లటం తరువాత గోపికల బాగోగులను తెలుసుకోవటం వరకే విస్తారంగా వర్ణించాడు. తన గీతాత్మక శైలిలో సంగీతాత్మక వైవిధ్యంతో సూరదాసు తన "సూరసాగర్"లో ఆ ఇందీవరశ్యాముని లీలలను వర్ణించాడు.

"సూరసాగర్" ఒక గీతికావ్యం, ఈ గీతికావ్యపరంపర ప్రాచీనమైనదే. జయదేవుని భక్తిగీతాలు, "విద్యాపతి" అనే హిందీ కవి గీతాలు, మీరాబాయి



భక్తిగీతాలు, ఇటు మన అన్నమయ్య భక్తిగీతాలు, క్షేత్రయ్యపదాలు, మొదలైనవి ఈ పరంపరలోనికే వస్తాయని సహృదపాఠకులకు తెలిసినదే.

"సూరసాగర్" రచన గీతాత్మక శైలిలో రచించబడిన గీతికావ్యం అయినా దీనిలో కావ్యకళారూపం ఎంతవరకు ఉన్నదో ప్రస్తుతం మనం కొంతవరకు పరిశీలిద్దాం.

సూరదాసు దృక్పథం కావ్యరచనకాదు. తన ఇష్టదైవాన్ని మనసారా కీర్తించటమే. "శ్రీనాథమందిర్"లోని నాయకుడు కదా! అయినా కావ్యకళాదృష్టితో పరిశీలిస్తేకూడ ఆయన గ్రంథం సర్వోత్తమంగానే ఉన్నదని తెలుస్తుంది.

కావ్యరచనకు మూలం సౌందర్యానుభూతి. దాని పరిణామ స్వరూపమే ఆనందానుభూతి. "కళ" అంటే కళాకారుని హృదయాన్ని పాఠకుల హృదయాలవరకు పంపించే ఒక మధురమైన చర్యయే కదా! అది పూర్తిగా "సూరసాగర్"లో ఉన్నది. నీలమేఘశ్యాముని లీలలను ఆధారంగా తీసికొని ఆ లీలల వర్ణనలద్వారా సూరదాసు మనకు ఆనందానుభూతిని కలిగించాడు.

"కళ"ను రెండు విధాలుగా పరిగణిస్తారు. 1. భావపక్షం 2. కళాపక్షం అని సాధారణంగా భక్తకవులు భావపక్షాన్నే ఆశ్రయిస్తారు. సూరదాసు కూడ అలాగే చేశాడు. అయితే ఆయన భావపక్ష "భాగీరథి"లో కళాపక్ష "కాళింది" కూడ మేళవించింది. గంగా యమునల సంగమమే ఆయన కవిత్వాన్ని ఉత్కృష్టస్థాయికి తెచ్చింది.

భావపక్షం విభిన్నరసాలను ఆశ్రయించి ఉంటుంది. కళాపక్షం విభిన్న అలంకారాలను, ఛందస్సును, భాషను ఆశ్రయించి ఉంటుంది. సంగీతాత్మకత వాటికి జోడైతే ఇంకా మధురాతి మధురం. వీటిని చూద్దాం.

"సూరసాగర్"లో ఎక్కువగా కోమలమైన రసాలనే మనం చూడ కలుగుతాము. సూరదాసు వాత్సల్యరసం, శృంగార రసాలనే ప్రధానంగా

వర్ణించాడు. అయితే రౌద్ర, భయానక, కరుణ, భీభత్స, శాంత రసాలు కూడ వర్ణింపబడినాయి.

వినయాన్ని వర్ణించే సన్నివేశాలలో "శాంత" రసాన్ని; దావానల భక్షణం, గోవర్ధనోద్ధరణం, జలప్లావనం అనే ప్రసంగాల్లో "భయానక" "భీభత్స" రసాలు వర్ణింపబడినాయి. ఇంద్రగర్వభంగం, కంసవధ అనే సన్నివేశాల్లో వీరరసాన్ని, రౌద్రరసాన్ని గమనిస్తాము. యశోదకు తన నోరు తెరచి కన్నయ్య చూపించిన విరాట్‌రూప ప్రదర్శనాన్ని మనం "అద్భుతరసం" అని అనుకోవచ్చు. నంద, యశోదల చరిత్రలు వర్ణించే సందర్భంలో "కరుణ" రసాన్ని గమనిస్తాము. ఇలా అన్ని రసాలను సూరసాగర్‌లో శ్రీకృష్ణుని లీలావర్ణనలలో మనంచూడ కలుగుతాము కొన్ని ఉదాహరణలు చూద్దాం-

**అబ్ కే మాధవ్ మోహి ఉబారి-**

సంసారసాగరంలో కొట్టుమిట్టాడుతున్న నన్ను మాధవుడే రక్షించాలి.

**హరిబిను కో ఊ కామ్ న ఆ యో-**

ఈ మాయామోహాలనుండి ఉద్ధరించటం శ్రీహరికి తప్ప మరెవ్వరికీ చేతకాదు. మొదలైన పదాలలో "శాంత" రసాన్ని చూడకలుగుతాము.

**వాత్సల్యరసం -** శ్రీకృష్ణలీలలు, ముఖ్యంగా బాల్య లీలలు వాత్సల్యరస పూరితాలే.

**లాలాహౌ బారీతీరే ముఖ్‌పర్**
**కుటిల అలక్, మోహన్ మన్ విహసన్, భృకుటివికట్ నైనన్‌పర్-**

ఆ కుటిలాలకాలు, ఆ మోహనమైనదరహాసం, ఆ భృకుటీ సంచాలనం, ఆ నయన సౌందర్యం - ఆహా ఇలా ఎన్నో! కన్నయ్య ముఖసౌందర్యం వర్ణనాతీతం-

**హిందోలా మాయీ ఝూలత్ హైం గోపాల్**
**సంగ్ రాధా పరమ సుందరి, చహు ధా బ్రజ బాల్"**



యశోదాదేవి ఊయల ఊపుతున్నది. ఆ ఊయలలో గోపాలుడు ఉన్నాడు. రాధాదేవిని కూడ పడుకోపెట్టింది. ఊయలచుట్టూ వ్రజబాలురు, బాలికలు ఉన్నారు.

మొదలైనవి వాత్సల్యరసానికి ఉదాహరణలు.

**శృంగార రసం : 1. సంయోగశృంగారం**

**ఖేలత్ హరినికసే బ్రజఖోరీ**
**గయేశ్యామ్ రవి తనయా కే తట్ అంగ్ లసత్ చందన్ కీ ఖోరీ**
**-------------------------------**
**సూర్‌స్యామ్ దేఖత్ హీ రీఫై నైన్ నైన్ మివీ పరీ ఠగోరీ**

కన్నయ్య ఆడుకోవటానికి యమునాతీరానికి వెళ్లాడు. ఆ యమునాతట విహారంలో ఆ శ్యాముని సౌందర్యం చూడటానికి మా దగ్గర మా కన్నులు లేకుండా తనే తీసికొని వెళ్లాడు. అని గోపికలు అంటారు.

మొదలైన ఎన్నో సంయోగశృంగారానికి ఉదాహరణలు.

**వియోగశృంగారం**

**బ్రజజన్ చాతక్ ప్యాసే మరత్‌హైం స్వాతిబిందు బర్‌సాఓ**

వ్రజనివాసులమైన మేమందరం చాతకపక్షులవలె నిరీక్షిస్తున్నాము. ఓ ఉద్ధవా! నీకు దయ ఉంటే మాపై స్వాతిబిందువులను కురిపించు అని గోపికలు ఉద్ధవుణ్ణి వేడుకుంటారు. "భ్రమరగీతలు" మొత్తం వియోగశృంగారానికి ఉదాహరణలే.

**హాస్యరసం**

**మైయా మోహి దా ఊ బహుత్ ఖిజాయో**
**కోసో కహత్ మోల్ కో లీనైతూ, జసుమతి కబ్‌జాయో?**

"అమ్మా, నన్ను బలరాం అన్నయ్య ఏడిపిస్తున్నాడే. "నిన్ను కొనుక్కొని వచ్చారు రా! నీవు యశోదమ్మకు ఎప్పుడు పుట్టావురా?"- అంటున్నాడు. అని కృష్ణుడు యశోదకు ఫిర్యాదు చేస్తాడు - ఇలాంటివన్నీ హాస్యరసానికి ఉదాహరణలు.

**అద్భుతరసం**

**కర్ గహి పగ్ అంగూఠా ముఖ్ మేలత్**
**ప్రభు పౌఢే పాలనే అకేలే హరషి అరషి అపనే సంగ్ ఖేలత్**

శ్రీకృష్ణుడు ఊయలలో పడుకున్నాడు. తన కాలి బొటనవ్రేలును నోటిలో పెట్టుకున్నాడు. తనకు తానే సంతోషిస్తూ ఆడుకుంటున్నాడు. ఆ దృశ్యం ఎంతో అద్భుతం కదా!

**భయానకరసం**

**పట్కత్ బాస్ కాంస్, కుస్ చమకత్, లట్కత్ తాల్ తమాల్**

**ఉచటత్ అతి అంగార్, పుటత్ కర్, ఘపటత్, లపటత్ కరాల్**
**ధూమధూంధి బాఢీ ధర్ అంబర్, చమకత్ బిచ్ బిచ్ జ్వాల్**
**హరిన్, బరాహ, మోర్, చాతక్, పిక్, జరత్ జీవ్ బేహాలా**

ఇది దావానల భయంకర దృశ్యం. శ్రీకృష్ణుని పరిమార్చటానికి కంసుడు పంపిన ఒక రాక్షసుడు దావానల రూపంలో వచ్చి బృందావనాన్ని చుట్టుముట్టాడు. ఆ దావానల దృశ్యం ఇది.

వెదురు కర్రలు ఫటఫటమని పగులుతున్నాయి. రెల్లుపొదలు అన్నీ దహించుకొనిపోతూ ఉంటే మెరుపులు వస్తున్నాయా అన్నట్లు ఉన్నది. తాడిచెట్లు, తమాలవృక్షాలు కాలివ్రేలాడుతున్నాయి. అగ్ని జ్వాలలు ప్రజ్వరిల్లుతూ ఉన్నాయి. పొగ భూమ్యాకాశాలకు వ్యాపించి ఉన్నది. ఆ పొగ మధ్య అక్కడక్కడ అగ్నిజ్వాలలు మెరుస్తున్నాయి. లేళ్ళు, వరాహాలు, నెమళ్లు, చాతకపక్షులు, గోరువంకలు మొదలైన పశుపక్ష్యాదులు, భూమిపై పాకుతూ వెళ్లే ప్రాణులు అన్నీ నిరాశ్రయులు అయిపోయి వ్యాకులపడుతున్నాయి.



ఇటువంటి దావానలాన్ని కన్నయ్య మ్రింగివేశాడు.

**సన్ సాజివ్రజ పర్ చఢ్ ధావహిc**
**ప్రథమ్ బహాయి దేహు గోవర్ధన్, తాపీఛే బ్రజఖోది బహావహి-**

గోపకులపై కోపం వచ్చి వారిపై ఇంద్రుడు చూపించే ప్రతాపం. నవమేఘాలను వర్షింపమని పంపాడు. వ్రజభూమిపై అవి దండెత్తినాయి. గోవర్ధన పర్వతాన్ని కూడ ముంచెత్తినాయి. వ్రజభూమి ఆ నీటి వరదలో కొట్టుకొని పోయినట్లే ఉన్నది ఇదీ దృశ్యం.

**అతి మలీన్ వృషభాను కుమారీ**
**హరి శ్రమ అంతర్ తను భీజై, తా లాలచ్**
**నధుపావత్ సారీ-**

రాధ ఎంతో మురికిగానే ఉండిపోయింది. శ్రీకృష్ణుని చెమటతో రాధశరీరం అంతా తడిసిపోయింది. ఆయనపై ఉండే ప్రేమాధిక్యతతో రాధకు ఆ విషయమే తెలియటంలేదు. మీదుమిక్కిలి అది తన సౌజన్యమనే భావిస్తున్నది. తాను అప్పుడు కట్టుకున్న చీరెను ఉతుక్కోనే అవకాశమే లేదు.

ఇలా ఇప్పటివరకు భావపక్షానికి సంబంధించిన రససౌందర్యాన్ని తెలుసుకున్నాము. ఇక కళాపక్షానికి సంబంధించిన వాటిని గమనిద్దాం.

**అలంకారాలు**

"కావ్యశోభాకరాలు అలంకారాలు" అని ఆలంకారికుల నిర్వచనం. సూరదాసు తన సూరసాగర్ కావ్యంలో శబ్దాలంకారాలను, అర్థాలంకారాలను కూడ మనకు దర్శింపచేశారు. స్థాలీపులాక న్యాయంగా చూద్దాం.

**శబ్దాలంకారాలు**

**అ. యమకాలంకారము**

**హరి సమ్ ఆనన్, హరి సమలోచన్ హరి సమ హరిపట్ధాగీ**
**హరి హి చాహి హరి, నసోమాచిచే హరి హరి కర్ ఉర్జాగీ**

రేఖాంకిత "హరి" శబ్దం భిన్న భిన్న అర్థాలలో ఉపయోగించబడింది. ఇది యమకాలంకారానికి ఉదాహరణ-

**ఆ. అనుప్రాసాలంకారము**

**అల్ప దఖన కల్బల్ కర్ బోలని-**

రేఖాంకిత శబ్దం అనుప్రాసాలంకారానికి ఉదాహరణ.

**అర్థాలంకారాలు**

**అ. ఉపమాలంకారము**

**బనే హైం బిసాల్ కమలదల్ నైన్**

రేఖాంకిత శబ్దం ఉపమాలంకారానికి ఉదాహరణ.

**ఆ. రూపకాలంకారము**

**నంద్ నంద్ బృందావన చంద**
**జదుకుల నయ తిథి ద్వితీయ దేవకీ ప్రగటే త్రిభువనచంద**

ఇది రూపకాలంకారానికి ఉదాహరణ. కన్నయ్య బృందావన చంద్రుడేనట.

**ఇ. ఉత్ప్రేక్షాలంకారము**

**లోచన్ జను థిర్ భృంగ్ అకార్,**
**మధుమాతల్ కిసై ఉడఈ న పార్**

నేత్రములు భ్రమరములో అన్నట్లున్నవి. మధువుగ్రోవి ఉన్నట్లున్నవి ఎగురలేకుండా ఉన్నవి. (శ్రీకృష్ణుని నేత్రవర్ణన గోపికలు వర్ణించిన సందర్భము).



ఇలా అనేక స్థలాల్లో అలంకార సౌందర్యాన్ని చూడవచ్చు. నీలమేఘశ్యాముని నేత్ర సౌందర్యాన్ని, రూపసౌందర్యాన్ని అనేక అలంకారమాధ్యమముగా సూరదాసు చిత్రించాడు.

**2. ఛందస్సు**

భావాలకు తగినట్లు సూరదాసు ఛందస్సులను కూడ ఎన్నుకున్నాడు. ఉదాహరణకు మన "భ్రమర గీతలు" అనే ప్రసంగాన్ని తీసుకోవచ్చు. భ్రమరానికి మరొకపేరు "షట్పది" అని మనకు తెలుసు. అంటే భ్రమరానికి 6 కాళ్లు ఉంటాయని అర్థం. అందుచేతనే కావచ్చు, భ్రమరగీతలలోని పదాలలో ఆరేసిపంక్తులే ఉన్నాయి. ఇలాగే మిగతా సందర్భాలలో కూడ భావానుగుణ ఛందస్సులను ఉపయోగించాడు.

**3. భాష**

సూరదాసు ఉపయోగించిన భాష శుద్ధమైన సాహిత్యక వ్రజభాషకాదు. ఆయన భాష దేశభాషా మిశ్రితమే. ప్రవాహపూర్ణత్వం, సరసత్వం, రసస్ఫోరకత్వం, వాచ్యార్థం, వ్యంగ్యార్థం, శ్లేష మొదలైనవి భావానుగుణంగా ఉండటానికి కారణం ఇదే అని సాహిత్యవిమర్శకుల అభిప్రాయం.

**4. సంగీతాత్మకత**

సూరదాసు సంగీతజ్ఞుడు అని ఇదివరకే తెలుసుకున్నాము. ఆయన శ్రీకృష్ణుని లీలలను వర్ణించేటప్పుడు, ఉత్తరభారతదేశంలో ఉన్న అనేక ప్రసిద్ధరాగాలను, జన్యాలను తన పదాలలో ప్రసంగాలను అనుకూలంగా ఉపయోగించాడు. ఆయన సంగీతజ్ఞుడు అవటంవల్లనే కదా "శ్రీనాథమందిరం"లో నాయకుడుగా నియమించబడటం. భిన్న భిన్న స్వరాలు భిన్న భిన్న భావాలను ద్యోతకం చేస్తాయి.

వినయభావాన్ని వ్యక్తం చేసేటప్పుడు ఆ భావానికి తగిన **రాగ్ బిలావల్**; శృంగారాన్ని వ్యక్తం చేసేటప్పుడు **రాగ్ ఖంభావతీ తితాలానూ**; గోవర్ధనోద్ధరణ

ప్రసంగంలో **మేఘమలార్**నూ; ప్రాతః కాలవర్ణనలలో **విభాస్, లలిత్, రామ్‌కలీ, బైరవ్, భైరవీ** రాగాలనూ; ఇలా ప్రసంగానుకూలంగా రాగాలను ఉపయోగిస్తూ సూరదాసు తన పదాలను గానం చేశాడు.

కొన్ని రాగాలు ఇలా ఉన్నాయి. **రాగ్‌మారూ; రాగ్‌విభాస్; రాగ్ సారంగ; రాగ్‌దేవగాంధార్; రాగ్‌కల్యాణ్** మొదలైన అనేక రాగాలను ఉపయోగిస్తూ సూరదాసు తన భక్తిగీతాలను ఆలాపించాడు. మనకు ఆనందాన్ని చేకూర్చాడు.

ఏ ఏ పదాలు ఏ ఏ రాగాలలో ఉన్నాయో ఇంకా చాలా పరిశోధన చేయవలసిఉన్నదని సంగీత, సాహిత్య విమర్శకుల అభిప్రాయం.

ఇలా సూరదాసు తన కావ్యంలో నీలమేఘశ్యాముని లీలలను అనేక రీతులుగా వర్ణించినాడు. కన్నులు తనకు లేకపోయినా కన్నులకు కట్టినట్లే ఆ స్వామిని వర్ణించి ధన్యుడు అయినాడు. ఆ మాధుర్యాన్ని చవిచూచి మనం కూడ ధన్యులం అయినాము.

* * * * *